



# బోల్షివిక్

సంపుటి: 8 సంచిక: 1 సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జనవరి-జూన్ 2020

## లోపలి పేజీల్లో...


1. ఆంధ్రప్రదేశ్ ప్రజల సందపను దోచుకోవడంలో - 3

2. దోపిడీ ప్రభుత్వానికీ, పోలీసులకు లొంగిపోవద్దు! - 8

3. శత్రు గుఢాచారి వ్యవస్థ - 11

4. సైద్ధాంతిక కృషి వాస్తవాల మీద ఆధారపడి ఉండాలి - 13

5. షెడ్యూల్డ్ ప్రాంతాలలోని పాఠశాలలో... - 18

6. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం - 20

7. అల్లూరి వర్ధంతి - 22

8. విశాఖ ఎల్.జి పాలిమర్స్ ఘటన - 23

9. కార్మికవర్గ నిజాయితీకి ప్రతిరూపం - 25

10. వర్గ శత్రువులన్నా, అణ్యవర్గ ధోరణులన్నా - 26

11. విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్సీ - 28

12. మార్చి 8 - 33

13. వ్యవసాయక విప్లవ కార్యక్రమం - 35

14. ప్రజల ప్రతిఘటన - 37

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది! లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైనా, పి.ఎల్.జి.ఎ.పైనా, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుంచి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2020 జనవరి నుంచి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కామ్రేడ్ నగేష్ (ఎ.సి.ఎమ్), కామ్రేడ్ అడ్మాల్ (పి.ఎమ్)లతోపాటు, దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

# ఆంధ్రప్రదేశ్ ప్రజల సంపదను దోచుకోవడంలో, బందిపోట్లలా కుమ్ములాడుకుంటున్న జగన్, చంద్రబాబు ముఠాలు

ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం 'పరిఢవిల్లుతున్న' కొద్దీ, ప్రజలు ఓట్ల డబ్బాలకే పరిమితమవుతూ, బడా పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య అధిపతులు, రియల్‌ఎస్టేట్ అధిపతులు, బడా కాంట్రాక్టర్లు, బడా భూస్వాములు మాత్రం, రాజ్యాన్ని అంతకుఅంత ఎక్కువగా లోబర్చుకొంటూ, ప్రజలను తీవ్రమైన దోపిడీ, పీడనలకు గురి చేస్తున్నారు. అంతేకాదు, ఈ దోపిడీ సంపదను పంపిణీ చేసుకోవడంలో, ఈ బందిపోటు దొంగల ముఠాలు, అత్యంత ఏహ్యంగా, చౌకబారు పద్ధతులలో, అవకాశవాద కలయికలతో ఘర్షణ పడుతున్నాయి. అయితే ఈ దోపిడీ వర్గ ముఠాలకు రాష్ట్రంలో రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న వై.ఎస్.ఆర్.సి.పి, తెలుగుదేశం, బి.జె.పి, జనసేన, కాంగ్రెస్ వగైరా పార్లమెంటరీ పార్టీల మధ్య కుమ్ములాట రూపంలో ఈ ఘర్షణ వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా 2014లో, విభక్త ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుంచి, రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు, ప్రస్తుతం పాలిస్తున్న జగన్‌లు నిరంకుశ, అరాచక, మోసపూరిత లక్షణాలను ఒక కళగానే అభ్యసించి, తమ వర్గ ప్రయోజనాలను ఈడేర్చడంలోనే కాకుండా, దోపిడీ సొమ్ములో అధిక మొత్తాన్ని చేజిక్కించుకొనేందుకు కుమ్ములాటలో కూడా వీరు ఆరితేరారు.

2014లో ఏర్పడిన విభక్త ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికలలో, అనేక మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలలో గెలిచిన చంద్రబాబు, అధికారపీఠం ఎక్కిన తర్వాత ఎన్నికల వాగ్దానాలను అటకెక్కించాడు. రైతుల, డ్వాక్రా మహిళల అప్పుల మాఫీని కేవలం కంటి తుడుపు చర్యగా మార్చాడు. ఎన్నికల హామీలలో ఏ ఒక్క దాన్ని కూడా సమగ్రంగా అమలు జరపకపోగా, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో తాను, తన పరివారం వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేసారు. ప్రధానంగా చంద్రబాబు ఆశ్రితులైన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, అమరావతి భూముల విషయంలో తమ బొక్కసాలు నింపుకొంటే, బడా కాంట్రాక్టర్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో, డబ్బు సంచుల మూటలను పెద్ద ఎత్తున వెనకేసుకున్నారు. ఇంతకీ అసలు విషయమేమిటంటే చంద్రబాబు తన రెండు కళ్ళుగా చెప్పుకొన్న ఆ రెండు నిర్మాణాలను తన హయంలో పూర్తి చేయలేకపోయాడు. కానీ తాను, తన పరివారం మాత్రం ఈ రెండు నిర్మాణాల ద్వారా బాగానే లబ్ది పొందారు. ఇక చంద్రబాబు ముఠాకు చెందిన ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా, లిక్కర్ మాఫియా, విద్యా, వైద్య రంగానికి చెందిన కార్పొరేట్ జలగలు ప్రజల నెత్తురును పీల్చి పడేశాయి. రాష్ట్ర సంపదని అడ్డగోలుగా మేసిపడేసాయి. చంద్రబాబు నేతృత్వంలోని ఈ బందిపోట్లంతా ప్రారంభం నుండే రాజ్యాంగ యంత్రాన్ని ప్రజలపై గూండాగిరి చేసే సాధనంగా చేసుకొని, తమ దోపిడీ, పీడనలను యదేచ్ఛగా కొనసాగించారు. ముఖ్యంగా అధికార యంత్రాంగంలో తమకు తొత్తులుగా వ్యవహరించే ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులను నియమించుకున్నారు. ఇందుకు కృతజ్ఞతాపూర్వకంగా ఈ నిరంకుశ అధికారులు, చట్టాలను ఉల్లగింస్తూ ప్రజలపై యదేచ్ఛగా హింసాకాండను కొనసాగించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే నల్లమల అటవీ ప్రాంతంలో పోలీసులు కోవర్టు కుట్ర జరిపి, ముగ్గురు సి.పి.ఐ (మావోయిస్టు)క్యాడర్లను హత్య చేసారు. ఈ సంఘటన మొదలు, చంద్రబాబు పదవీభ్రష్టుడయ్యే వరకు ప్రజలపై రాజ్యహింస పలురూపాల్లో జరుగుతూ వచ్చింది. పోలీసులు ఎర్రచందనాన్ని అక్రమంగా ఎగుమతి చేసే కాంట్రాక్టర్లను వదిలి, 20 మందికి పైగా సాధారణ కూలీలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రారంభ దశలో, బి.జె.పికి అనుకూలంగా ఉండి 'ప్రత్యేకహోదా' డిమాండ్‌ను వ్యతిరేకించడం వలన, ప్రత్యేకహోదా కోసం పోరాడిన ఉద్యమకారులపై తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేశాడు. తర్వాత కాలంలో చంద్రబాబు ప్లేటు ఫిరాయించి, ప్రత్యేకహోదాను డిమాండ్ చేస్తూ, అసలు సిసలు ఉద్యమ నాయకుడ్ని తానేనంటూ, తన అవకాశవాద కళను మళ్ళీ ఒకసారి బయటకు తీసాడు. తూర్పు కనుమల్లో, బహుళజాతి సంస్థలు చేపట్టిన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా, మావోయిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన ఆదివాసీ రైతాంగ ఉద్యమాన్ని పోలీసులు నెత్తుటిమయం చేసారు. ఇలా చెప్పుకుంటూ పోతే చంద్రబాబు హయంలో (2014-2019) రాజ్యహింసకు గురికాని ఒక్క పీడితవర్గంగానీ, సెక్షన్‌గాని లేదంటే అతిశయోక్తికాదు. పోరాడే ప్రజలను నియంత్రించడానికి ఈ హింస చాలదన్నట్లు, గ్రామీణ ప్రాంతంలో ప్రజలపై పెత్తనం చేయడానికి జన్మభూమి కమిటీలను ఏర్పరిచాడు. ఈ కమిటీలు చంద్రబాబు దోపిడీ ముఠాకు సాంఘీక పునాదిగా పనిచేస్తూ, ప్రజలపై స్వారీ చేసాయి. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాల ప్రహసనం, దోపిడీ, పీడనలు ఒక ఎత్తయితే, రాష్ట్ర సంపదను పెంచే నెపంతో బహుళజాతి సంస్థలకు రెడ్‌కార్పెట్

పరచడం మరో ఎత్తు. అయితే ప్రపంచ పెట్టుబడిదారి విధానం ద్రవ్య, ఆర్థిక సంక్షోభంలో ఉండటంతో, చంద్రబాబు ఆశించినట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రాష్ట్రంలోకి రాలేదు. చంద్రబాబుకు తమ ప్రభువులైన సామ్రాజ్యవాదులకు సేవచేసే మహాభాగ్యం అంతగా దక్కలేదు. కానీ రాష్ట్రంలో, ప్రజలపై అధికారం నెరపడంలోనూ, దోపిడీ, పీడనలు కొనసాగించడంలోను తమకు ముఖ్య పోటీదారుగా ఉన్న మరో పెట్టుబడిదారి, భూస్వామ్య ముఠా నాయకుడైన జగన్‌కు భవిష్యత్తులో ఎటువంటి అవకాశాలు దక్కనీయకుండా చేస్తూ, ఒక మూలకు నెట్టి, తానూ, తన ముఠా మాత్రం సంపాదనను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కానీ, 2019 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి, చంద్రబాబు అనుసరించిన ప్రజా వ్యతిరేక, విధ్వంసకర, రోడ్డురోలర్ పాలనలో దోపిడీ, పీడనలకూ, అవమానాలకూ, బాధలకూ, విసుగుకు గురైన ప్రజలు, బాబును ఓడించి, 'బర్రెను తినేవాడు పోయి, గొర్రెను తినేవాడు వచ్చినా ఫరవాలేదన్న' చందంగా మరో బడా పెట్టుబడిదారీ, బడాభూస్వామ్య వర్గాలకు చెందిన వై.ఎస్.ఆర్.సి.పి పార్టీనీ, దాని నాయకుడైన జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించారు. మన దేశంలో 72 సంవత్సరాల పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రజలకిచ్చిన 'స్వేచ్ఛ' ఇదే. అంటే తమను దోపిడీ, పీడనలకు గురిచేసే ఏదో ఒక దోపిడీ వర్గ పార్టీని ఎంపిక చేసుకొనే 'స్వేచ్ఛ' అని దీని అర్థం.

2019 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ నేతృత్వంలోని వై.ఎస్.ఆర్.సి.పి పార్టీ మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో, అత్యధికంగా 151 స్థానాలు గెలుచుకుంది. టి.డి.పికి 23 స్థానాలు రాగా, జనసేన పార్టీ ఒకస్థానాన్ని గెలుచుకొంది. బి.జె.పి, వామపక్షాలు కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయాయి. జగన్ వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదనాపరుడనీ, తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించాడనీ, తండ్రి చనిపోయిన తర్వాత తన అధికార వ్యామోహాన్ని బహిర్గత పరుచుకొన్నాడని తెలిసినప్పటికీ, ప్రజలు జగన్ పార్టీనే అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఇందుకు చంద్రబాబు మూటగట్టుకున్న ప్రజావ్యతిరేకత ప్రధాన కారణమైతే, జగన్ సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి, 'నవరత్నాల' పేరుతో ప్రజలను సంక్షేమ కార్యక్రమాల భ్రమలలో ముంచెత్తడంతోపాటు, 'ప్రత్యేకహోదా' సాధించేవరకు మడమ తిప్పేదిలేదని చేసిన మోసపూరిత ప్రతిజ్ఞ కూడా కొంత మేరకు కారణమైంది. అయితే పార్లమెంటరీ ఎన్నికలలో మోడీ నేతృత్వంలోని బి.జె.పికి సంపూర్ణ మెజారిటీ రావడంతో, జగన్ ఈ విషయాన్ని ఒక సాకుగా చూపుతూ, ప్రస్తుతం ప్రత్యేకహోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తేలేమని పోరాటం నుంచి మెల్లగా జారుకున్నాడు. ఎన్నికల సందర్భంగా 'ప్రత్యేకహోదా' సాధన కోసం తాను చేసిన ప్రకటన ఉత్త మోసపూరిత, ఆర్భాటపు ప్రకటనేనని తేలిపోయింది. ఇలా ప్రతి ఎన్నికల్లోనూ ఏవో కొన్ని కారణాలు ప్రాతిపదికగా, ఏదో ఒక దోపిడీవర్గ ముఠా అధికారాన్ని చేజిక్కించుకోవడం సర్వసాధారణంగా ఉంటున్నది. ప్రజలలో రాజకీయ వెనుకబాటుతనం కొనసాగినంతకాలం అంటే 'బర్రెను తినేవాడు పోయి, గొర్రెను తినేవాడు' వచ్చినా ఫరవాలేదని సంతృప్తి పడినంతకాలం ఈ స్థితి ఇలానే కొనసాగుతుంది. ఈ స్థితిని మార్చాలంటే శ్రామిక ప్రజలను శ్రమ పరాయీకరణ నుంచి విముక్తి పొందేలా, వర్గపోరాటంలో సమీకృతుల్ని చేయడం ఒక్కటే మార్గం. అప్పుడే శ్రామికవర్గ ప్రజలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న దళారీ, నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య, దోపిడీ వర్గాల నియంతృత్వాన్ని ధ్వంసం చేసి, నిజమైన నాలుగు విప్లవకర వర్గా(కార్మికవర్గం, రైతాంగం, పెటీబూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గం)ల ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుంటారు. దోపిడీ వర్గాలపై విప్లవకర వర్గాల నియంతృత్వాన్ని అమలు చేస్తారు. నిజమైన స్వేచ్ఛను పొందుతారు.

జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నది. ఇక జగన్ పాలన బాబు పాలనకు భిన్నంగా ఉంటుందని ఎవరైనా ఊహిస్తే అది వారి అవివేకమే అవుతుంది. ప్రస్తుతం భారతదేశంలో కేంద్రంలోగానీ, రాష్ట్రాలలోగానీ, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, అది దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రతినిధిగా ఉంటూ, రిపబ్లిక్ (గణతంత్ర) ముసుగులో ప్రజలపై తమ వర్గ నియంతృత్వాన్నే అమలు చేస్తుంది. జగన్ పాలన కూడా ఇందుకు భిన్నమేమికాదు. జగన్ మే 30, 2019న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటినుంచి, ముఖ్యంగా కేంద్రంలోని బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోడీ నేతృత్వంలోని బి.జె.పి ప్రభుత్వంతో అంటకాగుతూ, అది పార్లమెంటులో మందబలంతో చేసిన అత్యంత అప్రజాస్వామిక, దేశవ్యతిరేక, ప్రజావ్యతిరేక, ఫాసిస్టు చట్టాల(ఆర్టికల్ 370, 35(ఎ)ల రద్దు, త్రిపుల్ తలాక్, సి.ఎ.ఎ, ఎన్.పి.ఆర్, ఎన్.ఆర్.సిలు)పై ఎటువంటి భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయకుండానే పార్లమెంటులో తన పార్టీ ఎమ్.పిలచేత ఆమోదముద్ర వేయించాడు. మరోవైపు రామజన్మభూమి వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత అప్రజాస్వామిక తీర్పును కూడా ఆమోదించాడు. ఈ విషయాలలో జగన్ ఆమోదం, అతని మౌలిక, రాజకీయ వైఖరిని తెలిజేస్తున్నాయి. ఇక నిర్దిష్టంగా రాష్ట్రంలో జగన్ చేపట్టిన పాలనాపరమైన చర్యలను పరిశీలిద్దాం.

**1. అధికార యంత్రాంగాన్ని, ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం**

గడిచిన 10 నెలల కాలంలో జగన్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాల మాదిరిగానే మొదటగా 'అధికార యంత్రాంగాన్ని' ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరిచింది. జగన్ పోలీసు వ్యవస్థను తన లాఠీగా మల్చుకొనేందుకు వారికి అనుకూలంగా అనేక సంస్కరణలు చేపట్టాడు. తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు విధేయంగా ఉంటూ, సేవలు చేసిన పోలీసు, సివిల్ సర్వీస్ అధికారులను తిరిగి కీలకమైన స్థానాల్లో నియమించాడు. ఈ అధికారులు వై.ఎస్.ఆర్ పాలనలో కీలకమైన

అధికారాలు చెలాయిస్తూ, దోపిడీవర్గాల ప్రయోజనాలను, ముఖ్యంగా వై.ఎస్.ఆర్ ఆశ్రితుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు అప్రజాస్వామికంగా, క్రూరంగా వ్యవహరించిన వారే, అక్రమ, అవినీతి సంపాదనతో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నవారే. అందుకే ఈ నమ్మిన బంట్లతా జగన్ అధికారంలోకి రాగానే తమ తమ స్థానాలను తిరిగి దక్కించుకొనేందుకు ఉవ్విళూరారు. ఇందుకు తగ్గట్టుగానే జగన్ ముఖ్యమైన ఈ నమ్మినబంట్లను కీలకమైన స్థానాల్లో నియమించాడు. ఈ ప్రక్రియ చేపట్టడంతోపాటే, బాబుకు అత్యంత విధేయులైన ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులలో కొందరిని 'లూప్‌లైన్'లలో వేసాడు. కొందరిపై అవినీతి ఆరోపణలు చేసి, చర్యలు తీసుకున్నాడు. ఈ తతంగమంతా ప్రస్తుత దోపిడీ వ్యవస్థలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా జరిగేదే.

**2. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం**

జగన్ అధికారంలోకి రాగానే, చంద్రబాబు హయాంలో తీసుకొన్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాలవల్ల, ప్రజాధనం కైంకర్యం అయిందనీ, వృధా అయిందని ప్రకటనలు చేస్తూ, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపైనా, పోలవరం కాంట్రాక్టుపైనా, కియాకార్ల కంపెనీకిచ్చిన ప్రోత్సహకాలపైనా, రాజధాని నిర్ణయంపైనా సమీక్షకు పూనుకున్నాడు. వాస్తవంగా ఇటువంటి సమీక్షలు, కేంద్రంలోగానీ, రాష్ట్రాలలోగాని ప్రభుత్వాలు మారినప్పుడల్లా జరిగేవే. ఈ సమీక్షలలో ఇంతవరకు నేరస్తులు బయటపడి, వారు శిక్షలు అనుభవించిన దాఖలాలు లేవు. నిజంగానే, వాస్తవాలపై ఆధారపడి, అటువంటి సమీక్షలు జరిపితే, ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ పార్టీలలోని మెజారిటీగా నాయకమన్యులు కటకటాల వెనుక ఉండవలసినవారే. అందుకే ఈ సమీక్షలు ఒక తంతులా నిర్వహించబడతాయి. అయితే వీటి లక్ష్యం, పాత పాలక వర్గాముఠా చేతిలోని ఆర్థిక వనరులను దెబ్బతీసి, ఆ వనరులను కొత్త పాలక వర్గముఠా దక్కించుకోవడంగా ఉంటుంది. ఈ లక్ష్యంతోనే జగన్, చంద్రబాబుపై సమీక్షల యుద్ధం చేపట్టాడు. విద్యుత్ కొనుగోళ్ళపై సమీక్ష ప్రారంభం కాగానే, కేంద్రప్రభుత్వం నుంచి ఉన్నత న్యాయస్థానాల వరకు 'ఇలా సమీక్ష జరిపితే మదుపరుల విశ్వాసం దెబ్బతింటుదనీ, కనుక సమీక్ష ఆపేయాలని' ఆదేశిస్తూ, జగన్ ప్రభుత్వంపై వత్తిడి తేవడంతో, జగన్ వెనక్కు తగ్గాడు. పోలవరం కాంట్రాక్టు విషయంలో రివర్స్ టెండరింగ్ పేరుతో, చంద్రబాబు నియమించిన నవయుగ సంస్థను తొలగించి, తనకనుకూలంగా ఉన్న మేఘా ఇంజనీరింగ్ కంపెనీని ప్రవేశపెట్టాడు. ఈ చర్యవల్ల 625 కోట్ల రూపాయల ప్రజాధనం 'ఆదా' అయిందని జగన్ అంటుంటే, ప్రజలలో మాత్రం ఈ రివర్స్ టెండరింగే పెద్ద కుంభకోణమని ప్రచారం జరుగుతున్నది. కియా పరిశ్రమకు, చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సహకాల విషయంలో, సమీక్ష పేరుతో, ఆ సంస్థపై వత్తిడి తెచ్చి, ఆ సంస్థ నుంచి పెద్ద ఎత్తున కమిషన్లు గుంజుకునేందుకు జగన్ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ పద్ధతులు అనుసరిస్తున్నది. ఇక రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు, అతడి అనుచరులు 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' జరిపారంటూ ఆరోపిస్తూనే, మరోవైపు గత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పాలనా వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల నిర్ణయాన్ని జగన్ ప్రభుత్వం, అసెంబ్లీలో ఆమోదింపచేసింది. దీని ప్రకారం అమరావతి లెజిస్లేటివ్ రాజధానిగా, విశాఖ ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, కర్నూలు జ్యుడిషియరీ రాజధానిగా ఉంటాయి. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ఈ 'వికేంద్రీకరణ కేవలం పాలనకే కాక, అభివృద్ధికి కూడా దోహదపడ్తుంద'ని మరో అసత్య వాదనను ముందుకు తెచ్చింది. వాస్తవంగా రాజధాని మార్పులో అసలు మతలబు ఏమిటంటే, అమరావతి నిర్మాణంలో చంద్రబాబు, అతడి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, అక్రమంగా సంపాదించుకున్న స్థలాల విలువలను దెబ్బతీసి, విశాఖలో తాను, తన రియల్‌ఎస్టేట్ పరివారం సంపదను పోగేసుకోవటమే. ఇప్పటికే, జగన్‌కు సన్నిహితులైన రియల్‌ఎస్టేట్ రాబందులు విశాఖపై వాలి ఉన్నాయి. కనుక ఈ వికేంద్రీకరణ ప్రజల దృష్టికోణంతో చూసినప్పుడు ప్రజలకు ఒరిగేది ఏమిలేదు. ఇక ఈ పాలనా వికేంద్రీకరణను, అభివృద్ధి వికేంద్రీకరణతో ముడిపెట్టడం 'బట్టతలకు, మోకాలికి' ముడి పెట్టడమే. వాస్తవంగా మన దేశ పాలకవర్గాల చరిత్ర అంతా ఎక్కడ వనరులుంటే అక్కడ రాబందుల్లా వాలి, దోచుకొనే చరిత్రే తప్ప, అన్ని ప్రాంతాలకు (వెనుకబడిన ప్రాంతాలతో సహా) సమాన ప్రాధాన్యతనిచ్చి, సమన్యాయాన్ని పాటించి, అభివృద్ధి చేసిన చరిత్ర మాత్రం లేదు. కనుక రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర, రాయలసీమ, పల్నాడు-వెల్నాడు ప్రాంతాలుగా విభజించి, ఆయా ప్రాంతాల నైసర్గిక, భౌగోళిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి, నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి అభివృద్ధి చేయాలి. ఇందుకు పాలనా వికేంద్రీకరణ అవసరం లేదు. నిజాయితీ, చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చు. కానీ, ఈ దేశ పాలకవర్గాలకు ప్రజల ప్రయోజనాల కన్నా, తమ ప్రయోజనాలే ముఖ్యం గనుక 'ప్రాంతాల అసమానాభివృద్ధి సమస్య'ను పరిష్కరించకుండా, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు 'పాలనా వికేంద్రీకరణే, అభివృద్ధి వికేంద్రీకరణ' వంటి రకరకాల మోసపూరితమైన వాదనలు ముందుకు తెస్తాయి. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం కూడా ఇదే వాదనను ముందుకు తెస్తున్నది. ఇప్పటికే మూడు రాజధానుల నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్‌లో ఎగతెగని చర్చలు జరుగుతున్నాయి. ప్రజలంతా ఒక అభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఇందుకు చంద్రబాబు, జగన్‌లు అనుసరించిన అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరులే కారణం. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు స్వీకరించి, అవసరమైతే తన మూడు రాజధానుల నిర్ణయాన్ని సమీక్షించి, ప్రజలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్ర ఆర్థికస్థితిని, ఆచరణాత్మక సమస్యలను దృష్టిలో ఉంచుకొని అమరావతిలోనే అసెంబ్లీ, సెక్రటేరియట్‌లను ఏర్పాటు చేయాలి.

చంద్రబాబు ఊహాలోకాల్లో ఉన్న 'కాపిటల్ అమరావతి'ని భూమిపైకి తెచ్చి ఎ.పి ఆర్థిక పరిస్థితులకనుగుణంగా సాధారణ పద్ధతిలో నిర్మించాలి. అలాగే చారిత్రక ప్రాధాన్యత కలిగిన 'శ్రీభాగ్ ఒడంబడిక'ను దృష్టిలో ఉంచుకొని హైకోర్టు ప్రధాన కార్యాలయం కర్నూలులో నిర్మించాలి. అమరావతి, విశాఖలలో హైకోర్టు బెంచీలు ఏర్పాటు చేయాలి. ఏదైనా ఈ సమస్యకు సాధ్యమైనంత త్వరగా ప్రజల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకొని, ఆచరణ యోగ్యమైన పరిష్కారం రాబట్టాలి. సమస్యను ఒక కొలిక్కి తేవాలి.

### 3. 'నవరత్నాల' అమలు

ఎన్నికల సందర్భంగా జగన్ తన పాదయాత్రలో నవరత్నాల (రైతు బరోసా, ఫీ రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, మద్యనిషేధం, అమ్మఒడి, వై.ఎస్.ఆర్ ఆసరా, పేదలందరికీ ఇళ్ళు, పెన్షన్ల పెంపు)ను హామి పడ్డాడు. వీటిని తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా పొందుపరిచారు. ఎన్నికల తదనంతరం జగన్ 'నవరత్నాలే' తనకు 'గీత, ఖురాన్, బైబిల్' అంటూ వీటిని అమలు చేసేందుకు పూనుకున్నాడు. అయితే ఈ పథకాలేవి ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు తెచ్చేవికావు. పైగా ఇటువంటి పథకాలు ప్రజలకు కొత్తవేమి కావు. గతంలోనూ, ఇప్పుడూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో అమలవుతున్నవే. అయితే కొందరు ఉదారవాద ప్రజాస్వామిక మేధావులు ఈ సంక్షేమ పథకాల స్వభావాన్నీ, లక్ష్యాన్ని రాజకీయంగా అర్థం చేసుకోకుండా, వీటిలో కొన్ని ఆహ్వానించదగినవేననీ, ఆమోదించదగినవేనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇటువంటి వైఖరి బూర్జువా వర్గానికి సేవచేసేదే అవుతుంది.

వాస్తవంగా ఈ సంక్షేమ పథకాలు, ప్రజల కష్టార్జితాన్ని దోచుకుతింటూ బలిసిపోతున్న దోపిడీ వర్గాలు ప్రజలకు విదిలించే ఎంగిలి మెతుకులు మాత్రమే. ప్రజల పన్నులతో నిండుతున్న ప్రభుత్వ ఖజానాకు, ఈ దోపిడీ దొంగలు పందికొక్కుల్లా బొరియలు చేసి, దండుకోగల్గినన్ని నిధులను దండుకొని, 'పరిగ' భాగం మాత్రమే ప్రజలకు 'అత్యంత విశాల హృదయంతో' 'అత్యంత దయాదాక్షిణ్యాల'తో ఇస్తున్నారు. ఇక ఈ 'పరిగ' భాగంలో కూడా ప్రజలకు చేరేదెంత? ఇందులో ఆధికారుల అవినీతికి సగం స్వాహా అవుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా ఎల్.పి.జి విధానాలు అమలవుతున్న నేపథ్యంలో సామ్రాజ్యవాదులు, వారి తాబేదారులు తమ దోపిడీని సజావుగా కొనసాగించేందుకు ప్రజలను సంక్షేమ పథకాల మాయలో పడేసే ఎత్తుగడను రూపొందించుకోవడమే కాకుండా, ఇందుకు ఆయా ప్రభుత్వాలు తలకు మించిన అప్పులు చేసి, తిరిగి ఆ అప్పులను నెమ్మదిగా ప్రజల నెత్తిమీద వేయాలని ఆదేశించాయి. ప్రస్తుతం జగన్ ఈ ఆదేశాలనే తూ.చ తప్పకుండా పాటిస్తున్నాడు. రాష్ట్రం ఇప్పటికే రెండున్నర లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉంది. ఈ అప్పు చాలదన్నట్లు 'నవరత్నాల' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అప్పును మరింతగా పెంచి, ఈ అప్పునంతా తిరిగి పన్నుల రూపంలో ప్రజల నెత్తిన పెనుభారంగా మోపబోతున్నది. ఈ వాస్తవాలేమి ప్రజలకు అర్థం కానప్పుడు, వారు సంక్షేమ పథకాల మాయలో పడతారు. జగన్‌కున్న మరో పార్శ్యాన్ని వాళ్ళు చూడలేరు. ఆ పార్శ్యమేమిటంటే రాష్ట్ర సందపను పెంచడం. అంటే బహుళజాతి సంస్థలకూ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర వనరులను కొల్లగొట్టి, వారు విపరీతంగా సంపదను పెంచుకొనేలా చేయడమే. మరింత నిర్థిష్టంగా చెప్పాలంటే, రాష్ట్రసంపదను పెంచడం పేరుతో ఈ దోపిడీ వర్గాల సంపదను పెంచడమనే అర్థం. ఈ కుట్రను ప్రజలకు అర్థం కానీయకుండా చేసేందుకు, దోపిడీ వర్గాలు ఈ 'సంక్షేమ పథకాల గంతల'ను ప్రజల కళ్ళకు కడతాయి. ఇందుకునుగుణంగానే, జగన్ ప్రభుత్వం మోసపూరితమైన 'నవరత్నాల' గంతలను ప్రజల కళ్ళకు కట్టడంలో సఫలీకృతం అవుతున్నది.

### 4. బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్

జగన్ అధికారంలోకి రాగానే 'రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారు స్థానికులకు 75 శాతానికి పైగా ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుందని' ప్రకటించాడు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే విదేశీ, దేశీ మదుపరులు రారనే చర్చ కొంత నడిచింది. అయితే జగన్ ఈ మధ్య అనిల్ అంబానీతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ పరిమళ్ నత్వానీని ఎ.పి నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేశాడు. ఈ పరిణామం అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ సంస్థలకు ఇబ్బందులేవి ఉండవని సంకేతాన్ని ఇచ్చింది. జగన్ ప్రభుత్వం వారికి రెడ్‌కార్పెట్ పర్చడానికి సిద్ధమైంది.

### 5. సమస్యలు సృష్టించడం, ప్రజలను వాటి చుట్టూ గిరికీలు కొట్టించడం

దోపిడీ పాలకవర్గాలు ప్రజలను అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించేందుకు వారే సమస్యలు సృష్టించి, ప్రజలను ఆ సమస్యల చుట్టూ గిరికీలు కొట్టించేలా చేస్తారు. జగన్ ప్రభుత్వం ఈ విషయంలో ఆరితేరినట్లుగా కనిపిస్తున్నది. జగన్ ఉన్నట్లుండి ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుందని ప్రకటించాడు. దీంతో, ఈ నిర్ణయం పీడిత సెక్షన్ల పిల్లలకు ఉపయోగపడ్తుందనీ, వారు కూడా ఇంగ్లీషు నేర్చుకొని చదువుల్లోనూ, ఉద్యోగాల్లోను సంపన్నుల పిల్లలతో పోటీ పడి రాణించగలుగుతారనీ కొద్దిమంది వాదిస్తుంటే, మరి కొందరు మాతృభాష తెలుగుకు అన్యాయం జరిగిందనీ, ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియమే ఉండాలని వాదిస్తున్నారు. ఇరుపక్షాలు వాదించుకోవడమే కాకుండా, సమస్యలేమి లేనట్లు 'మీడియం' సమస్యలో మునిగిపోయారు. జగన్ ప్రభుత్వానికి కావలసింది కూడా అదే. అసలు జగన్ ప్రభుత్వానికి గానీ, మరే ప్రభుత్వానికి గాని ప్రభుత్వ పాఠశాలలపైనా, అందులో చదివే పీడిత వర్గాల, సెక్షన్ల పిల్లలపైన ఉన్న వైఖరి ఏమిటి? వాస్తవంగా ఈ ప్రభుత్వాలకూ, వాటిని నడుపుతున్న దోపిడీ వర్గాలకు ప్రభుత్వ పాఠశాలలపై మక్కువ కన్నా, కార్పొరేట్ పాఠశాలలపైనే మక్కువ ఎక్కువ. ఎందుకంటే కార్పొరేట్ పాఠశాలలు మాత్రమే

వాళ్ళకు డబ్బు సంచుల మూటలను సమకూర్చి పెడతాయి. ఇక ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల భవిష్యత్ అంటారా! వాళ్ళకు దానితో పనేలేదు. అందుకే ప్రభుత్వ పాఠశాలలు కునారిల్లిపోతే, అందులో చదువుతున్న పీడిత వర్గాల, సెక్షన్ల పిల్లలు వీధిన పడ్తున్నారు. జగన్ ప్రభుత్వం ఈ వైఫల్యాన్నంతా కప్పిపెట్టి, ఏకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుదని ప్రకటించడం, ఆచరణ సాధ్యం కాని, పచ్చి మోసపూరిత నిర్ణయం. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిర్ణయం మార్చుకొని ప్రభుత్వ పాఠశాలలను పునరుజ్జీవింప చేయడమే కాకుండా, వాటిల్లో చదివే పిల్లల, వారి తల్లిదండ్రుల అభీష్టం మేరకు ఇంగ్లీషుగానీ, తెలుగుగాని ఏదో ఒక మీడియం తీసుకునే అవకాశం వారికి కల్పించాలి. కేవలం ఇంగ్లీషు మీడియం మాత్రమే అమలు చేస్తాననడం నియంతృత్వమే అవుతుంది. ఈ సమస్యకు తోడు, రాజధాని సమస్యను కూడా కలిపి, వాటిని ఎడతెగని సమస్యలుగా మార్చి, ప్రజలను వాటి చుట్టూ గిరికీలు కొట్టేలా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి.

**ఫ్యూడల్ నియంత**

ఏ ప్రభుత్వానికైనా, అది ప్రాతినిధ్యం వహించే సామాజిక వ్యవస్థ తాలుకు మౌలిక, ఆర్థిక లక్షణాల మూలంగా ఒక స్వభావం ఏర్పడుతుంది. మనదేశంలోగానీ, నిర్దిష్టంగా ఆంధ్రప్రదేశ్‌లోగానీ కొనసాగుతున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సామాజిక వ్యవస్థకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలన్నింటికి దోపిడీవర్గాల తరపున ప్రజలపై నియంతృత్వాన్ని అమలు చేసే స్వభావమే ఉంటుంది. ఇవి ప్రజలకు కేవలం లాంఛనప్రాయమైన స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ, సమన్యాయాన్ని అందిస్తాయి. ప్రజలను అణచిపెట్టి ఉంచడానికి గరిష్టంగా తమ సాయుధ బలగాలపైనే ఆధారపడ్తాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ను పాలిస్తున్న జగన్ పై నియమాన్ని బాగా వంటపట్టించుకున్నవాడు. గడిచిన 10 నెలల కాలంలోనే ఆయన తీసుకొంటున్న ఏకపక్ష నిర్ణయాలతోపాటు, ప్రజలను అణచివేసి ఉంచడానికి తన పోలీసు బలగాలపై ఎంతగా ఆధారపడుతున్నాడో పరిశీలిస్తే ఆయన ఎంతటి నియంతో ఇట్టే అర్థమైపోతుంది.

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక చేత్తో బాక్సైట్ తవ్వకాల నిలుపుదలకు సంతకాలు పెడ్తానే, మరో చేత్తో మన్యంపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడికి సంకేతాలిచ్చాడు. మన్యంలో జరుగుతున్న ఆదివాసీ సాయుధ రైతాంగ ఉద్యమాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు, గతంలో విప్లవోద్యమాన్ని అణచివేసిన అనుభవమున్న క్రూరమైన పోలీసు అధికారులను నియమించాడు. వీరు ప్రత్యేక పథకాలతో, వేలాది మంది సాయుధ బలగాలను ఉద్యమ ప్రాంతంలో మోహరిస్తూ, నిరంతర కూంబింగ్‌లతో మన్యంలో మారణకాండను సృష్టిస్తున్నారు. వందలాది మందిని అరెస్టు చేయడంతోపాటు, బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని, కొండజర్త వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ప్రజా సాయుధ బలగాలపై దాడి చేసి, ముగ్గురు పి.ఎల్.జి.ఎ యోధులను హత్య చేసారు. ఫేములగొంది వద్ద ఇద్దరిని పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. బాక్సైట్ గనుల తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జగన్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ ఉద్యమంలో పాల్గొన్న వేలాదిమంది ఆదివాసీ రైతాంగంపై కేసులు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నది. అమరావతిలో రాజధాని కోసం పోరాడుతున్న ప్రజలపై కూడా ప్రభుత్వ పోలీసులు అమానవీయంగా, అరాచకంగా దాడులు చేసారు. ఈ విషయంలో జగన్ ప్రభుత్వం, హైకోర్టు చేత మొట్టికాయలు తినాల్సి వచ్చింది. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో గ్రామస్థాయిలో 'లాఠీ వ్యవస్థ'ను నిర్మిస్తే, జగన్ 'వాలంటీర్ల' పేరుతో లాఠీ వ్యవస్థకు పునాది వేసాడు. ఇక జగన్‌కు 'చట్టాలబాదరబందీ లేని పోలీసు చర్యలంటే' ఎంత మక్కువో తెలుసుకోవాలంటే, దిశా అత్యాచార సంఘటనలో తెలంగాణ పోలీసులు 'నలుగురు దోషులను' బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి వేసినప్పుడు ఆయన వ్యక్తపరిచిన వైఖరిని అర్థం చేసుకోవాల్సిందే. ఈ సంఘటన తర్వాత తెలంగాణ పోలీసు అధికారులను జగన్ తెగ పొగిడేసాడు. చివరకు తన ప్రతిపాదనగా అసెంబ్లీలో ఆమోదం పొందిన 'మూడు రాజధానుల' బిల్లును శాసనమండలి వాయిదా పడేలా చేసిందనే కక్షతో, అహంభావ పూరితంగా శాసనమండలినే రద్దు చేశాడు. నిజంగానే శాసనమండలిలో టి.డి.పికి మెజారిటీ ఉండి, వాళ్ళు ఒకవేళ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా, ఉద్దేశపూర్వకంగా మూడు రాజధానుల బిల్లును వాయిదా వేసారే అనుకున్నా, ఒక ముఖ్యమంత్రిగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం కేవలం జగన్‌కే చెల్లింది. బహుశా గత చరిత్రలో కూడా ఇంతటి నియంతగా వ్యవహరించిన ముఖ్యమంత్రి లేడనే చెప్పుకోవాలి. ఇటువంటి నియంతల పాలనలో సభా స్వాతంత్యం, పత్రికా స్వాతంత్ర్యం, చట్టం ముందు పౌరులందరూ సమానమేననే ప్రజాస్వామిక విలువలను ఎవరూ ఆశించలేరు.

పై పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందు ఒక్కటే కీలకమైన కర్తవ్యం ఉంది. అది కేంద్రంలోనూ, రాష్ట్రంలోను అధికారంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మించడమే. ఈ ఉద్యమాలను బ్రాహ్మణవాద హిందూ ఫాసిజం, విస్థాపన, భూమి, ప్రజాస్వామ్యం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, అధిక ధరలు, ఉపాధి వంటి కీలక సమస్యలతోపాటు, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ-2013 చట్టంలో పొందుపరిచిన హామీల ప్రాతిపదికన సమరశీలంగా నిర్వహించాలి. నేడు ఐక్య ఉద్యమాలే ప్రజల ప్రయోజనమని దృష్టిలో ఉంచుకోవాలి. ప్రజల ప్రయోజనాలనాసించే మేధావులకైనా, ప్రజాస్వామికవాదులకైనా, సంస్థలకైనా, పార్టీలకైనా ఐక్య ఉద్యమాలే మౌలిక కర్తవ్యంగా ఉండాలి. ఈ ఐక్య ఉద్యమాల లక్ష్యం ప్రజలను రాజకీయంగా చైతన్య పరుస్తూ, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేదిగా ఉండాలి. ♣

# దోపిడీ ప్రభుత్వానికీ, పోలీసులకు లొంగిపోవద్దు! నిజమైన ప్రజాస్వామ్యం కోసం, ప్రజల అధికారం కోసం పోరాడదాం!

*ప్రియమైన ప్రజలారా!*

మన విచ్ఛిన్నాంచల్ ప్రాంతంలో, ప్రభుత్వ సాయుధ బలగాల దాడి, రోజు రోజుకు తీవ్రతరమవుతున్నది. ఈ దాడి, శతృదేశంపై భారత ప్రభుత్వం జరుపుతున్న దాడిని పోలి వుంటున్నది. మన ప్రాంతం చుట్టూ 'కార్పెట్ సెక్యూరిటీ'లో భాగంగా, కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో, ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే అనేక క్యాంపులు ఏర్పాటు చేసాయి. మరికొన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. రోజు రోజుకు కటాఫ్ ఏరియాలో పోలీసు బలగాల సంఖ్య పెరుగుతున్నది. ఏరియాలో పోలీసు కూంబింగులు, దాడులు, అరెస్టులు, చిత్రహింసలు నిత్యకృత్యమయ్యాయి. **ముఖ్యంగా గత పది సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు (మావోయిస్టు)పార్టీ నేతృత్వంలో ప్రజలు సాధించుకున్న భూములనూ, ఏర్పాటు చేసుకొన్న ప్రజా రాజ్యాధికార నిర్మాణా(ఆర్.పి.సి)లను వదిలేసి, ప్రభుత్వానికి లొంగిపొమ్మని వత్తిడి తెస్తున్నాయి.**

**ముందుగా, కేంద్రంలోని మోడీ సర్కార్ గానీ, ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన నవీన్, జగన్ సర్కారులుగాని మనపై ఇంతపెద్ద దాడిని ఎందుకు ఎక్కుపెట్టారో అర్థం చేసుకోవాలి.** ఈ దాడి నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలంటే మన దేశ, ప్రాంత సమీప చరిత్రను కొంతైనా అర్థం చేసుకోవాలి. 1947 ఆగస్టు 15న మనకు స్వతంత్రం వచ్చిందని, మన పాలకవర్గాలు చెబుతున్నాయి. అంటే మనకు 'స్వతంత్రం' వచ్చి 73 సంవత్సరాలు కావస్తున్నది. ఈ కాలంలో మన విచ్ఛిన్నాంచల్ ప్రాంతంలో జీవిస్తున్న ప్రజల జీవన స్థితిగతులను నిర్దిష్టంగా పరిశీలిద్దాం.

మనకు స్వతంత్రం వచ్చిందని చెబుతున్న ఈ 73 సంవత్సరాల కాలంలో మన ప్రాంత ప్రజలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒడిశా ప్రభుత్వం, బలిమెల డ్యాం నిర్మాణంతో ప్రజల్ని విస్థాపితుల్ని చేసింది. మనకు ఒక్క పైసా నష్టపరిహారం ఇవ్వకుండా, మన ఆవాస ప్రాంతాల నుంచి మనల్ని పిట్టల్ని తరిమేసినట్లు తరిమేసింది. ఇలా తరిమివేయబడ్డ ప్రజలు సర్వం కోల్పోయి, వివిధ గ్రామాలకు వలస పోయారు. ఈ ఏడు దశాబ్దాల కాలంలో మన ప్రాంత ప్రజలు కనీసమైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేకపోయారు. మనం ప్రత్యక్ష పన్నుల రూపంలోనూ, ప్రతీ వస్తువుపై పరోక్షపన్ను రూపంలోను కడుతున్న పైసలను మాత్రం ఈ దోపిడీ ప్రభుత్వాలు దండుకొంటున్నప్పటికీ, కనీసం మనకు విద్యా, వైద్య సదుపాయాలను సైతం కల్పించలేదు. ఇక ప్రయాణ సౌకర్యమైతే లేదనే చెప్పాలి. చివరికి పండిన పంటలు ప్రతి సంవత్సరం బలిమెల రిజర్వాయర్ నీటి ముంపుకు గురి అవుతుంటే, ప్రభుత్వ అధికారులకు పెట్టుకున్న విజ్ఞాపనా పత్రాలన్నీ చెత్తబుట్టపాలైనాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, గత 73 సంవత్సరాలుగా మనల్ని పాలించిన దోపిడీ ప్రభుత్వాలన్నీ, మనల్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేసాయి.

పై చారిత్రక నేపథ్యంలోనే, నిర్దిష్టంగా 2009 నుంచీ, భారత కమ్యూనిస్టు (మావోయిస్టు)పార్టీ నేతృత్వంలో మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని సంకల్పించాము. అప్పటినుంచీ, కొద్దిమంది ఆదివాసేతర భూస్వాములూ, అభివృద్ధి నిరోధక తెగపెద్దలూ, మునసబ్‌లూ, బూర్జువా పార్టీల నాయకులు ప్రజల నుంచి అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి సంఘటిత పోరాటం ద్వారా స్వాధీనం చేసుకున్నాము. సహకార, సమిష్టి వ్యవసాయ పద్ధతుల ద్వారా ప్రజలందరికీ పని కల్పించడంతోపాటు, వారికి తిండి గింజలు అందేలా చేసి, ఆకలి సమస్యను పరిష్కరించుకొన్నాము. విద్యా, వైద్యం, రవాణా వంటి అనేక సదుపాయాల సాధన కోసం ప్రభుత్వంపై సమరశీలంగా పోరాడి కొంత మేరకు విజయం సాధించాము. మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడంలో భాగంగా, సమిష్టి కృషి ద్వారా రోడ్లు నిర్మించుకున్నాము. తాగునీటికోసం ట్యాంకులనూ, సాగునీటి కోసం చెక్‌డ్యాంలను నిర్మించుకున్నాము. విద్యా, వైద్య రంగాలలో ప్రాథమికంగానైనా స్కూల్స్, హాస్పిటల్స్ నిర్మించుకున్నాము. బలిమెల డ్యాంలో నీరు పెరిగినప్పుడల్లా కొన్ని గ్రామాల ప్రజల పంటలు ముంపుకు గురవుతుంటే, వారికి ఏరియా మొత్తం నుంచి ధాన్యం, బట్టలు, ఇతర వస్తువులు సేకరించి అందించాము. ఈ పనులన్నీ ప్రజల మధ్య సమిష్టితత్వాన్నీ, సహకారతత్వాన్ని పెంచడంతోపాటు, వారి సంఘటిత శక్తిపై వారికి మరింత విశ్వాసాన్ని పెంచాయి. ప్రజా అభివృద్ధి నమూనాను ఆవిష్కరించాయి. ఈ విజయాలన్నీ ముఖ్యంగా రాజకీయ రంగంలో మనం చేపట్టిన పోరాటాల వల్లే సాధ్యపడ్డాయి. అంటే గ్రామస్థాయిలో వున్న అభివృద్ధి నిరోధక పాత

అధికారానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం ద్వారానే లభ్యమయ్యాయి. 2009 దాకా, మన గ్రామీణ ప్రాంతంలో కొద్ది మంది అభివృద్ధి నిరోధక తెగపెద్దలు, మునసబ్‌లు, బూర్జువా పార్టీల నాయకుల చేతుల్లో భూమి, అధికారం ఉండేది. 2009 నుంచీ భారత కమ్యూనిస్టు (మావోయిస్టు)పార్టీ నేతృత్వంలో ప్రజలు చేపట్టిన సమరశీల రాజకీయ పోరాటం ఫలితంగా భూమి, అధికారం ప్రజల పరమవుతూ వచ్చాయి. ఈ రాజకీయ పోరాటాన్ని స్థానిక ప్రజా శతృవులకు వ్యతిరేకంగానే కాకుండా, వారికి మద్ధతుగా వచ్చిన ప్రభుత్వ సాయుధ బలగాలకు వ్యతిరేకంగా కూడా చేసాము. ఈ పోరాట ఫలితంగానే గ్రామ రాజకీయలలో ప్రజల భాగస్వామ్యం పెరిగి, ప్రజాసంఘాలు మొదలు మిలీషియా, విప్లవ ప్రజా కమిటీ(ప్రజా ప్రభుత్వాలు)లు ఏర్పడ్డాయి.

ఈ పరిణామాలన్నీ భారత దోపిడీ పాలకవర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు మింగుడుపడలేదు. వీరిదృష్టిలో ప్రజలెప్పుడూ దోపిడీ, పీడనలకు గురిఅవుతూ బానిసల్లా బతకాలి. ఇందుకు భిన్నంగా ప్రజలు ఎక్కడైనా స్వేచ్ఛనూ, స్వాతంత్ర్యాన్నీ, సమానత్వాన్ని కోరుకుంటే, ఆ ప్రజలపై తమ ప్రతీఘాతుక సాయుధ బలగాలతో దాడి చేసి, వారిని లోబరుచుకుంటారు. ప్రస్తుతం మన ప్రాంతంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడి కూడా ఇటువంటిదే. ఈ దాడి ఉద్దేశ్యం కూడా మనల్ని తిరిగి బానిసల్ని చేయాలనేదే. అందుకే నవీన్ ప్రభుత్వం ఇప్పటిదాక మనం పోరాడి సాధించుకున్న భూమి, రాజ్యాధికార కమిటీలు ఇతర విజయాలను వదులుకొని లొంగిపొమ్మని వత్తిడి తెస్తున్నది. అందుకు తన కిరాయి పోలీసు బలగాలను మనపై ఉసిగొల్పుతున్నది.

***ప్రియమైన ప్రజలారా!***

పై పరిస్థితులలో మన ముందు రెండే మార్గాలున్నాయి. ఒకటి ప్రభుత్వానికి లొంగిపోవడం. అంటే మనం సాధించుకున్న విజయాలన్నింటినీ వదులుకొని పాత పరిస్థితికి మరలిపోవడం. ఇంకా నిర్ధిష్టంగా చెప్పాలంటే, మనం పోరాడి సాధించుకున్న భూములన్నింటినీ తిరిగి ప్రజావ్యతిరేకులకు ఇచ్చివేయడంలోపాటు, మనం నిర్మించుకున్న సంఘాలనూ, మిలీషియానూ, విప్లవ ప్రజా కమిటీలను రద్దు చేసుకొని, ప్రజల చేతిలోని అధికారాన్ని పాత దోపిడీ వర్గాలకు అప్పచెప్పడం. ఇటువంటి తిరోగమనం మనల్ని తిరిగి బానిసత్వంలోకి నెడ్తుంది. ఈ మార్గం ఆత్మహత్యా సదృశ్యమైనది.

మరోమార్గం ఇప్పటిదాక మనం అనుసరిస్తున్న పోరాటమార్గం. ఈ మార్గంలో మనం కార్మికవర్గ నేతృత్వంలో కార్మికులు, కర్షకులు, పెటీబూర్జువా, జాతీయబూర్జువా వర్గాలను ఐక్యం చేసి, దోపిడీ పాలకవర్గాలైన సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం. ఇది దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో కొనసాగుతుంది. ఈ మార్గం కష్టభుయిష్టమైనదైనప్పటికీ, ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తెచ్చేందుకు మరో మార్గం లేదు. **ఈ మార్గంలో మనం ఇప్పటికే సాధించుకున్న భూములనూ, ఏర్పరుచుకున్న ప్రజా రాజ్యాధికార నిర్మాణాలనూ, ఇతర నిర్మాణాలను రక్షించుకోవాలి. ఈ విజయాలను మరింతగా సంఘటిత పరుచుకుంటూ విస్తరించాలి. ఇందుకు అనుగుణంగా మన ప్రాంతంలోని గ్రామీణ ప్రజానీకం సాయుధులై, ప్రభుత్వ సాయుధ బలగాలకు వ్యతిరేకంగా పార్టీలోకీ, పి.ఎల్.జి.ఎలోకి చేరాలి. గెరిల్లా యుద్ధంలో చురుగ్గా పాల్గొనాలి.**

అయితే నేడు పెరుగుతున్న శతృదాడి నేపథ్యంలో, మన ప్రజలలో కొన్ని గందరగోళ భావాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఈ క్రింది మూడు అభిప్రాయాలు కొద్ది మంది ప్రజలలో వ్యక్తమవుతున్నాయి.

1. ప్రభుత్వం చాలా బలమైనదనీ, దానితో ఎదిరించి పోరాడలేమనీ,

2. ప్రభుత్వదాడి మరింత పెరిగితే, పార్టీ ఈ ప్రాంతాన్ని ఖాళీ చేసిపోతుందనీ,

3. ప్రభుత్వానికి లొంగిపోయి, పార్టీ నేతృత్వంలో పని చేయవచ్చు కదా! అనే అభిప్రాయం.

పై మూడు అభిప్రాయాలు సరైనవి కావు. వాస్తవాలతో సంబంధం లేనివి. మొదటి అభిప్రాయం ప్రకారం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం విప్లవ శక్తుల కన్నా చాలా బలమైనదే. అయితే దోపిడీవర్గ స్వభావం కలిగిన ప్రభుత్వంతో ప్రజలు పోరాడలేరనే అభిప్రాయం మాత్రం సరైనది కాదు. ప్రజలు రాజకీయంగా సంఘటితపడితే, ఈ దోపిడీ ప్రభుత్వాలతో సమరశీలంగా పోరాటాలు చేపట్టగలుగుతారు. గత దశాబ్దకాలంలో మన ఆచరణ కూడా ఈ విషయాన్ని రుజువు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీఘాతుక విప్లవానిది పై చేయి అయిన మాట వాస్తవమే. అయితే ఈ పరిస్థితి ఎల్లకాలం కొనసాగదు. ప్రజల సమరశీల పోరాటాల ద్వారా తిరిగి విప్లవానిది తప్పకుండా పైచేయి అవుతుంది. ప్రజల విముక్తి కోసం జరిగే విప్లవ పోరాటం గెలుపు-ఓటమి, గెలుపు-ఓటమి అంతిమంగా గెలుపు దిశగా సాగుతుంది. ఈ చారిత్రక నియమాన్ని దృష్టిలో ఉంచుకొనే మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ మార్క్స్ "ప్రజలే చరిత్ర నిర్మాతలు"ని వ్యాఖ్యానించాడు. కనుక ప్రజలు గెలుపు యడల దృఢమైన విశ్వాసాన్ని ఉంచి, దోపిడీపాలక వర్గాలకు వ్యతిరేకంగా సాహసోపేతమైన, త్యాగపూరితమైన, దీర్ఘకాలిక సాయుధ పోరాటానికి సిద్ధపడాలి. అప్పుడు విజయం తప్పక సాధ్యపడుతుంది.

రెండవ అభిప్రాయం కూడా సరైనది కాదు. ప్రభుత్వ దాడి ఎంత పెరిగినప్పటికీ, పార్టీ ఈ ప్రాంతాన్నిగానీ, ప్రజలనుగానీ వదిలిపోదు, ప్రజలతోనే ఉంటుంది. పార్టీ ప్రజల విముక్తి కోసం సర్వస్వం అంకితమై పని చేస్తుంది. శతృవు నుంచి ఎటువంటి కష్టాలు ఎదురైనప్పటికీ ప్రజలను వీడదు. అయితే శతృదాడి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలను విప్లవంలోకి సమీకరించేందుకు

పాత ఎత్తుగడల స్థానంలో నూతన ఎత్తుగడలను ప్రవేశపెడ్తుంది. ప్రధానంగా విప్లవ కార్యాచరణలో ప్రజల క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తీవ్రంగా కృషి చేస్తుంది. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం పెరగడంపైన ఆధారపడి, విప్లవంలో గెలుపు ఓటములుంటాయి. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం ఏ మేరకు పెరిగితే, ఆ మేరకు శతృదాడిని ఎదుర్కొని నిలదొక్కుకుంటూ, విజయం వైపు పురోగమిస్తాము. కనుక శతృవు నుంచి ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ, పార్టీ ప్రజలకు రాజకీయంగా నేతృత్వం వహిస్తుంది. ప్రజలు కూడా విప్లవంలో తమ క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ, పార్టీని పర్యవేక్షించే బాధ్యతను చేపట్టాలి. పార్టీకీ, ప్రజలకు మధ్యగల ఈ పరస్పర సంబంధాన్ని పెంచుకుంటూ, ఎంతటి నిర్బంధంలోనైనా పార్టీ ప్రజలను వదలిపోవడం జరగదని మీకు హామి ఇస్తుంది.

మూడవ అభిప్రాయం, కొన్ని గ్రామాలలోని కొద్దిమంది ప్రజలలో మాత్రమే వ్యక్తమవుతున్నది. వీరు దోపిడీవర్గాల చేతిలో సాధనంగా ఉన్న రాజ్యాంగ యంత్రా(ప్రభుత్వాన్ని)న్ని సరిగా అర్థం చేసుకోలేదనే చెప్పాలి. మన దేశంలో దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు అశేష పీడిత ప్రజానీకంపై దోపిడీ పీడనలు కొనసాగించేందుకు ప్రభుత్వాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. కనుక ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య పొత్తు కుదరదు. వీటి మధ్య ఉండేది వర్గపోరాటం మాత్రమే. దోపిడీ వర్గాలనూ, వాటి చేతిలో సాధనంగా ఉన్న ప్రభుత్వాన్ని ధ్వంసం చేసి, ప్రజలను విముక్తి గావించేందుకు వర్గపోరాటం చోదకశక్తిలా ఉంటుంది. ఈ నియమాన్ని సరిగా అర్థం చేసుకోలేనివారు మాత్రమే ప్రభుత్వానికి లొంగిపోయి, పార్టీ మార్గదర్శకత్వంలో పని చేస్తామని మాట్లాడతారు. కానీ, వీరు అంతిమంగా దోపిడీ వర్గాలకూ, వాటి చేతిలో సాధనంగా ఉన్న ప్రభుత్వానికి సేవచేస్తూ, ప్రజలకు వ్యతిరేకంగా తయారవుతారు. కనుక ఇటువంటి వర్గ సామరస్య ధోరణి కల్గినవారు తమ ఆలోచనలు మార్చుకొని, ప్రభుత్వంతో ఎటువంటి లొంగుబాటు వైఖరిని చేపట్టకుండా, ప్రజలవైపు దృఢంగా నిలబడి, వర్గపోరాటంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాము.

***ప్రియమైన ప్రజలారా!***

ఈ ప్రాంతంలో మనం ఒంటరిగా లేము. మనతో పాటు దేశంలోనూ, ప్రపంచంలోను నిజమైన కార్మికవర్గ మావోయిస్టు పార్టీల నేతృత్వంలో పీడిత ప్రజలు సామ్రాజ్యవాదానికీ, దాని తైనాతీలకు వ్యతిరేకంగా విప్లవకర పోరాటాన్ని నిర్వహిస్తున్నారు. మరోవైపు, మన శతృవులైన సామ్రాజ్యవాదులూ, వారి సేవకులైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు అమలు చేస్తూ వచ్చిన పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాలు ఘోరంగా విఫలమై, అవి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయాయి. అన్ని సెక్షన్ల ప్రజలను తీవ్రమైన కష్టాలలోకీ, బాధలలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో మన దేశంలోనూ, ప్రపంచంలోనూ దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజల ఐక్య పోరాటాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ పోరాటాలను అణచివేసి, తమ దోపిడీ పీడనలను కొనసాగించేందుకు, దోపిడీ వర్గాలు మునుపెన్నడూ కనీ వినీ ఎరుగనంతటి ఫాసిస్టు నిర్బంధాన్ని అన్ని దేశాలలోను అమలు చేస్తున్నాయి. అంతే కాకుండా, దోపిడీ సంపదలో తమ వాటాను పెంచుకొనేందుకు వాటిలో అవే కుమ్ములాడుకుంటున్నాయి, యుద్ధాలకు సిద్ధపడుతున్నాయి.

**పై పరిస్థితిలో మనం దోపిడీ వర్గాలకూ, వాటి ప్రభుత్వాలకు లొంగిపోకుండా సాహసోపేతంగా ఐక్య, సంఘటిత పోరాటాలు చేపట్టాలి. మన పోరాటాలను దేశ వ్యాపితంగా జరుగుతున్న ప్రజా పోరాటాలతో అనుసంధానిస్తూ, ఒక విప్లవ వెల్లువను సృష్టించేందుకు మన వంతు కృషిని మనం చేపట్టాలి.**

**విప్లవాభివందనాలతో,**

**ఎమ్.కె.బి డివిజన్**

*జూన్ 2020* **సి.పి.ఐ (మావోయిస్టు).**

**“కేడర్లను ఎంపిక చేయడంలో ముఖ్యమైన ప్రమాణాలు ఏమిటి?**

**మొదటిది : కార్మికవర్గ ఆశయానికి తిరుగులేని అంకితం; పార్టీకి విధేయత; శతృవుతో పరీక్షకు నిలబడటం – పోరాటంలో జైల్లో, కోర్టులో గట్టిగా నిలవటం”**

- కార్యకర్తల గురించి (కామ్రేడ్ డిమిట్రోవ్)

# శత్రు గూఢాచారి వ్యవస్థ

## అనుభవాలు-2

1995లో, అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా, ఎన్.టి.ఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ విజయం సాధించి, రెండవసారి అధికార పగ్గాలు చేపట్టింది. కానీ కొద్ది నెలలకే పార్టీ అంతర్గత సంక్షోభానికి గురై, చంద్రబాబు నేతృత్వంలోని ముఠా ఎన్.టి.ఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకొన్నది. ఈ హటాత్పరిణామంతో ఎన్.టి.ఆర్‌కు గుండెపోటు వచ్చి మరణించాడు.

కొత్తగా అధికారం చేపట్టిన చంద్రబాబు, సామ్రాజ్యవాద నయావలస దోపిడీని రాష్ట్రంలోకి మరింతగా ఆహ్వానించాడు. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థ అయిన ప్రపంచ బ్యాంకుకు నమ్మకమైన ఏజెంటుగా మారాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాలకు ప్రయోగశాలగా మార్చాడు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక సంస్కరణలు పెద్ద ఎత్తున అమలు కావడం ప్రారంభమైనాయి. సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్యవర్గం రాష్ట్రంలోని సహజ వనరులనూ, పీడిత ప్రజల శ్రమ శక్తిని కారుచౌకగా కొల్లగొట్టడం తీవ్రతరం చేసాయి. ఈ పరిస్థితులలో దోపిడీ పాకలవర్గాల విధానాలను వ్యతిరేకిస్తూ, మన పార్టీ నేతృత్వంలో విప్లవోద్యమం మరింతగా పురోగమించింది. దీంతో పురోగమిస్తున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో చంద్రబాబు ప్రభుత్వం ఎల్.ఐ.సి (మంద్రస్థాయి యుద్ధతంత్రం)వ్యూహాన్ని చేపట్టింది.

ఎప్పుడైతే ప్రభుత్వం విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు పకడ్బందీగా ఎల్.ఐ.సి వ్యూహాన్ని చేపట్టిందో, అప్పటినుంచీ ప్రభుత్వదాడిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. విప్లవోద్యమంపై దాడి బహుముఖంగా సాగింది. ప్రభుత్వం ఒకవైపున సంక్షేమ పథకాలను పెద్దఎత్తున గుప్పిస్తూ, ప్రజలను భ్రమల్లో ముంచేందుకు ప్రయత్నిస్తూ, మరోవైపు మోసపూరితమైన, కుట్రపూరితమైన దాడి ఎత్తుగడలను చేపట్టింది. ఈ కాలంలోనే ప్రభుత్వం విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు తన ఇంటలిజెన్సీ సంస్థ ఎస్.ఐ.బి (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో)ని పటిష్ట పరిచింది. ఈ సంస్థ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌నూ, కోవర్ట్ వ్యవస్థను బలోపేతం చేసి, అనేక నేరపూరిత చర్యలకు పాల్పడింది. అనేక మంది విప్లవకారులనూ, విప్లవ సానుభూతిపరులను హత్య చేసింది. కొంత మందిని మాయం చేసింది. ఇది చేసిన కుట్రలకు అంతే లేదు. ఇది ఇచ్చిన సమాచారంతో, ప్రభుత్వ సాయుధ కమాండో బలగాలు (గ్రేహౌండ్స్) పార్టీపైన, పి.ఎల్.జి.ఎపైన, విప్లవ ప్రజానీకంపైన అనేక దాడులు చేసాయి.

### మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్.ఐ.బి నేతృత్వంలో కోవర్టు కుట్ర

1970ల చివరలో, మహబూబ్‌నగర్ జిల్లాలో వర్గపోరాటం ప్రారంభమై, క్రమంగా అది అనేక విప్లవ ప్రతీఘాతుక దాడులను ఎదుర్కొంటూ, పురోగమిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే, కల్వకుర్తి ఏరియాలోని, బొమ్మనపల్లి, ఐనఓలు గ్రామలలో భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పీడిత ప్రజలు పార్టీ నేతృత్వంలో వ్యవసాయక విప్లవ పోరాటాన్ని చేపట్టారు. అయితే ఆ గ్రామాలకు చెందిన భూస్వాములు ప్రభుత్వ అండతో విప్లవ ప్రజానీకంపై అనేక దాడులు నిర్వహించారు. ఇటువంటి పరిస్థితుల్లో అశోక్ (వెంకటేష్) అనే సంఘ సభ్యుడు గ్రామం వదిలి వెళ్ళిపోయాడు. ఇతను బ్రతుకుదెరువు కోసం బాంబే వెళ్ళి టైలరింగ్ నేర్చుకున్నాడు. 2000 సంవత్సరం ప్రారంభంలో తన సొంత ప్రాంతానికి తిరిగొచ్చాడు. కొద్దికాలం తర్వాత అతను పార్టీని కలిసి, "హైద్రాబాద్‌లో మిషిన్ పెట్టుకొని బట్టలు కుడుతున్నాననీ, పార్టీ ఏ పని ఇచ్చినా చేస్తానని" చెప్పాడు. దీంతో పార్టీ అతనికి, మిలటరీ యూనిఫామ్స్‌ను కుట్టే బాధ్యతను ఇచ్చింది. అది కూడా పార్టీ నిర్వహించే క్యాంపుల సందర్భంగా లోపలికి వచ్చి కుట్టాలని చెప్పింది. అందుకు అతడు అంగీకరించాడు. ఇలా వెంకటేష్ తిరిగి పార్టీ కాంటాక్టులోకి వచ్చిన తర్వాత, పార్టీ ఆదేశం మేరకు ఉద్యమ ప్రాంతంలో జరిగే క్యాంపులకు ఒకటి, రెండు సార్లు వచ్చి మిలటరీ యూనిఫామ్స్ కుట్టాడు. ఇలా వచ్చినప్పుడు తనకు 'అడవిలో క్రూరమృగాలను చూస్తే భయమనీ, హెడ్‌క్వార్టర్‌లోనే బట్టలు కుట్టేందుకు అనుమతి ఇవ్వాలని' అంటుడేవాడు. మన కామ్రేడ్స్ కూడా అతడికి అడవి జంతువులంటే భయమనే విషయాన్ని నమ్మి హెడ్‌క్వార్టర్‌లోనే బట్టలు కుట్టేందుకు ఏర్పాట్లు చేసేవారు. ఇలా జరుగుతున్న క్రమంలోనే పార్టీ ఒక మహిళా

కామ్రేడ్‌ను వెంకటేష్ ఇంటి వద్ద టైలరింగ్ నేర్చుకొనేందుకు పంపింది. అతను కూడా పార్టీ చెప్పినట్లుగానే ఆమెను తన ఇంట్లో కొన్ని నెలలు ఉంచుకొని టైలరింగ్ నేర్పాడు. ఈ క్రమంలోనే 2002 సెప్టెంబర్/అక్టోబర్ మాసాలలో పార్టీ నల్లమల అటవీ ప్రాంతంలో జోన్ మిలటరీ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ క్యాంపుకు యూనిఫామ్‌లు కుట్టేందుకు వెంకటేష్‌తోపాటు మహిళా కామ్రేడ్ కూడా వచ్చింది.

ఈ సారి కూడా వెంకటేష్ ఎప్పుడూ మాట్లాడే తన 'జంతుభయం' గురించి మాట్లాడి హెడ్‌క్వార్టర్‌లోనే తిష్ట వేసాడు. అయితే ఈ క్యాంపు జరుగుతుండగానే మనకున్న ఇంటలిజెన్సీ సోర్స్ నుంచి "మహబూబ్‌నగర్ జిల్లా, బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే అతను కోవర్ట్ అనీ, అతను బట్టలు కుట్టేందుకు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ, నాయకత్వం భోజనానికి వెళ్ళినప్పుడు తాను కూడా వెళ్ళి ఆహారంలో విషం కలిపేలా తర్ఫీదు పొందాడని" సమాచారం వచ్చింది. అయితే ఈ సమాచారం వెంకటేష్ క్యాంపులో ఉండగా రావడం యాదృచ్ఛికమే. దీంతో పార్టీ నాయకత్వం వెంటనే వెంకటేష్‌ను అరెస్టు చేసి, ఇంటరాగేషన్ చేసింది. ఈ ఇంటరాగేషన్ సందర్భంగా అతను చాలా విషయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు. "తను బాంబే నుంచి వాపస్ అయి తన గ్రామానికి రహస్యంగా వెళ్ళి వస్తుండగా, స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన భూస్వాములు తనను పట్టుకొని, తీవ్రంగా కొట్టి, వెంకట్‌రెడ్డి అనే కానిస్టేబుల్ ద్వారా ఎస్.ఐ.బిలో పని చేస్తున్న శ్రీనివాస్ అనే ఎస్.ఐకి అప్పచెప్పారనీ, అతను తనను కోవర్టుగా మలుచుకున్నాడని" చెప్పాడు. ఎస్.ఐ శ్రీనివాస్ వెంకటేష్‌ను నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్.పి సజ్జనార్‌కు అప్పజెప్పాడు. ఇక అక్కడ నుంచి సజ్జనార్‌తోపాటు, ఒ.ఎస్.డి విశ్వప్రసాద్, ఎన్.వి జగదీష్ (ఎన్.ఐ.బి), భువనగిరి డి.ఎస్.పి జగన్‌మోహన్‌రెడ్డి, డి.ఎస్.పి రవీందర్‌రెడ్డి (ఎస్.ఐ.బి) ఇలా కొద్దిమంది పోలీసు అధికారులు ఒక టీంగానే కోవర్టు కుట్రకు పథక రచన చేసి, వెంకటేష్‌ను గైడ్ చేసారు. ఆ నాటికి దక్షిణ తెలంగాణ డి.ఐ.జిగా ఉన్న గౌతమ్‌సావాంగ్ ఈ టీంకు నేతృత్వం వహించాడు

పై పోలీసు అధికారులు రూపొందించిన పథకంలో భాగంగా వెంకటేష్ బట్టలు కుట్టేందుకు పార్టీ నిర్వహించే క్యాంపులకు వెళ్ళినప్పుడు సైనెడ్ (విషం)తో నింపిన క్యాప్సిల్‌ను పై నాయకత్వం (సి.సి, ఎన్.జడ్.సి) తినే ఆహారంలో కలిపేలా ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌కి అనుగుణంగా ఎస్.పి జగదీష్ (ఎస్.ఐ.బి) వెంకటేష్‌కు తర్ఫీదునిచ్చాడు. జగదీష్ ఎమ్.ఎస్.సి (రసాయన శాస్త్రం) చేయడం వల్ల సైనెడ్‌ను క్యాప్సిల్‌లో నింపే బాధ్యతను తీసుకున్నాడు. అంతేకాకుండా పాయిజన్ క్యాప్సిల్‌ను వేళ్ళ సందులో పెట్టుకొని నాయకత్వం భోజనానికి వెళ్ళే ముందే వేడి వేడి పప్పులో కలిపే విధంగా వెంకటేష్‌కు తర్ఫీదునిచ్చాడు. అంటే పోలీసు అధికారులు ముఖ్యంగా నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ ఈ పథకాన్ని రూపొందించారు.

మనం చేపట్టిన ఈ ఇంటరాగేషన్‌లో వెంకటేష్ పై విషయాలన్నీ చెప్పడంతోపాటు, పోలీసులు తనకిచ్చిన డైరెక్షన్‌లో భాగంగానే ఈ కోవర్టు కుట్రలో 'తనతోపాటు, తన వద్ద టైలరింగ్ నేర్చుకొన్న మహిళా కామ్రేడ్ కూడా ఉందనీ, ఆమె టైలరింగ్ నేర్చుకోవడానికి వచ్చినప్పుడు పోలీసులు ఆమెను కూడా ఈ కుట్రలో భాగమయ్యేలా ఒప్పించారని' చెప్పాడు. దీంతో పార్టీ తొందరపడి ఆమెను కూడా బంధించింది. ఈ సందర్భంగా ఆమె చాలా ఆవేదనతో ఇందంతా పోలీసుకుట్రేననీ, వెంకటేష్, పోలీసులు కలిసి ఆడుతున్న నాటకమని మాట్లాడుతూ, వెంకటేష్‌ను గట్టిగా నిలేసింది. ఎప్పుడైతే మహిళా కామ్రేడ్ తన ఆవేదనను వెలిబుచ్చుతూ, వెంకటేష్‌ను గట్టిగా నిలేసిందో, అప్పుడు ఇంటరాగేషన్ చేస్తున్న కామ్రేడ్స్ తమ తొందరపాటును గ్రహించి, వెంకటేష్‌ను మరింత లోతుగా ప్రశ్నిస్తూ వాస్తవాలు రాబట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మరికొన్ని విషయాలు బయటపెట్టాడు. అవి– "మన మహిళా కామ్రేడ్ తన ఇంటి వద్ద టైలరింగ్ నేర్చుకొనే సమయంలో పోలీసులు తన ఇంటికి చుట్టాల మాదిరిగా వచ్చి ఆమెను చూసారనీ, ఆమె గురించి తన ద్వారా విషయాలు తెలుసుకున్నారనీ, పోలీసులు ఆమెను కూడా లొంగదీసుకోవడానికి ఆమెకున్న బలహీనతలేమిటో అడిగారనీ, ఆమెను కోవర్టుగా మలుచుకుంటే మన పని సులువు అవుతందని చెప్పారని" అన్నాడు. అయితే తాను "ఆమె ఎటువంటి ప్రలోభాలకు లొంగదని చెప్పిన మీదట ఆమెను ఏమి చేయకుండా, నాయకత్వాన్ని నిర్మూలించే పథకం విజయవంతం చేయడమే ముఖ్యమని తనని ప్రోత్సహించినట్లుగా" చెప్పాడు. ఇదే సందర్భంగా పోలీసు అధికారులు తనతో "ఒకవేళ ఈ పథకం బయటపడి, పార్టీ నిన్ను శిక్షించే పరిస్థితి వస్తే, ఈ మహిళా కామ్రేడ్ కూడా ఈ కుట్రలో భాగమని చెప్పి, ఆమెను కూడా పార్టీ చేత చంపించాలనే పథకాన్ని కూడా ఇచ్చారని" చెప్పాడు. దీంతో పార్టీ వెంకటేష్‌కు మరణశిక్షను విధించింది. ఈ సంఘటన ద్వారా పోలీసులు ఎస్.ఐ.బి వ్యూహంలో భాగంగా ఎంతటి కుట్రపూరిత పథకాలకు పాల్పడతారో అనుభవపూర్వకంగా పార్టీకి అర్థమైంది. శత్రువు మనచేతనే మన కామ్రేడ్స్‌ను శిక్షించే విధంగా పథకాలు రూపొందిస్తుండటంతో, ఎస్.ఐ.బి. వ్యూహంలోని కుట్రలనూ, కుహకాలను మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సంఘటన మనకు తెలియజేస్తున్నది. శత్రువు నిర్వహించే కోవర్టు కుట్రలపై మనల్ని మరింతగా అప్రమత్తం చేస్తున్నది. ♣

# సైద్ధాంతిక కృషి వాస్తవాల మీద ఆధారపడి ఉండాలి

మన సైద్ధాంతిక కృషిలో మౌలికమైన ప్రశ్న -అది వాస్తవాల మీద ఆధారపడి ఉండాలా? లేక కేవలం విద్యాలయాల విద్య మీద ఆధారపడి ఉండాలా? అనేదే. ప్రజా గెరిల్లా సైన్యంలో జరిగిన రాజకీయ కృషిలో ఉత్పన్నమైన "నాలుగు ప్రథమ అంశాలు" అనే సూత్రం, పుస్తకాల ద్వారా విద్యనూ, సజీవమైన భావాల ద్వారా విద్యనూ పోల్చి చూసినప్పుడు సైద్ధాంతిక కృషిలో సజీవమైన భావాలకు మొదటి స్థానాన్నివ్వాలని సూచిస్తోంది. మరో మాటలో చెప్పాలంటే, మన సైద్ధాంతిక కృషి వాస్తవాల నుండీ, ఆచరణాత్మకమైన సమస్యల నుండీ మొదలవ్వాలి. అది పుస్తకాల నుండో, అమూర్త సిద్ధాంతాల నుండో, సూత్రాల నుండో మొదలు కాకూడదు.

ఈ విషయంలో తన రాజకీయ-సైద్ధాంతిక కృషి క్రమంలో ప్రజా విముక్తి సైన్యం ఎన్నో గొప్ప అనుభవాలను సంపాదించుకుంది. పి.ఎల్.ఎ కంపెనీల సైద్ధాంతిక కృషిలోని అనుభవాల ఆధారంగా తయారైన పది అంశాలను మొదట క్లుప్తంగా పరిచయం చేస్తాం.

1. మావో ఆలోచనా విధానాన్ని సృజనాత్మకంగా అధ్యయనం చేసి అన్వయించాలి. మొత్తం సైన్యం సైద్ధాంతిక-రాజకీయ కృషిలో దీనిని మౌలిక కర్తవ్యంగా చేపట్టాలి. మౌలికంగా ప్రతిఒక్కరూ నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధ్యయనాన్ని చేపట్టాలి. ఆ తర్వాత వారు అత్యంత ఆవశ్యకమైన సిద్ధాంతాల్ని సృజనాత్మకంగా అధ్యయనం చేయాలి. అధ్యయనాన్నీ, అన్వయింపునీ మేళవించాలి. ఈ విధంగా తక్షణం ఫలితాల్ని పొందగల్గుతాం.

2. రాజకీయ విద్యనూ, సైద్ధాంతిక విద్యనూ గరపడంలో కార్మికవర్గ విద్యను పునాదిగా చేసుకోవడంతో మొదలు కావాలి. దీన్ని పునాదిగా చేసుకొని దేశభక్తి, అంతర్జాతీయతత్వం, విప్లవ వీరత్వం, పార్టీ, సైన్యం సంప్రదాయాలు మొదలైన విషయాల మీద విద్యను కొనసాగించవచ్చు.

3. వాస్తవాల నుండి మొదలై, ఈ రెండు అంశాలనూ గ్రహించాలి. మొదటిది, పార్టీ కేంద్రకమిటీ యొక్క పంథాలనూ, విధానాలనూ, నిర్ణయాలనూ, ఉన్నత నిర్మాణాల యొక్క సూచనలనూ కిందకు పంపి వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. రెండవది, అన్ని సమయాల్లోనూ తరచుగా పరిశోధించి, నిర్దిష్ట పరిస్థితులనూ, కంపెనీలోని అన్ని యూనిట్లలోని సైనికుల మనోభావాలనూ తెలుసుకోవాలి. ఈ రెండు అంశాలనూ మేళవించి, నాయకత్వాన్నీ, ప్రజలనూ, ఒక దగ్గర కూర్చాలి; క్లుప్తంగా చెప్పాలంటే "ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే విధానాన్ని అమలు చేయాలి.

4. పిండదశలో ఉన్నప్పుడే సమస్యల్ని తీసుకోవాలి. సత్వరంగానూ, సరియైన పద్ధతిలోనూ వాటితో వ్యవహరించి అవి మొక్కలు కాకుండా అడ్డుకోవాలి. అంటే ప్రజల మనసుల్లో తలెత్తబోయే ఆలోచనా ధోరణులనూ, రాబోయే సమస్యలనూ ముందుగానే ఊహించి ఆ సమస్యల్ని వెంటనే పరిష్కరించడంలో మెరుగ్గా ఉండాలి.

5. హేతుబద్ధతను ఉపయోగించి ఇతరులను ఒప్పించడం పైనా, ఎడ్యుకేట్ చేయడంపైనా నిరంతర కృషి చేయాలి. సాధారణంగా చెప్పాలంటే, కార్యకర్తల్లోనూ, సైనికుల్లోనూ తలెత్తే సైద్ధాంతిక సమస్యలు ప్రజల్లోని సరియైన, తప్పుడు భావాల ప్రతిఫలనాలే. అందుకనే 'ఐక్యత-విమర్శ-ఐక్యత' సూత్రాన్ని ఉపయోగించాలి. వాస్తవాల నుండి సత్యాన్ని వెలికితీస్తూ నిర్దిష్ట పరిశీలనకు ఉపయోగిస్తూ, ఒప్పిగా ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నిస్తూ సైద్ధాంతిక సమస్యల్ని పరిష్కారించే ప్రయత్నం చేయాలి.

6, ప్రజల సైద్ధాంతిక స్థాయిని మెట్టుమెట్టుగా పెంచాలి. ప్రజలందరికీ ఒకే సైద్ధాంతిక స్థాయిగానీ, ఒకే రాజకీయ చైతన్య స్థాయిగానీ ఉండడం అసాధ్యం. అందుకనే, పురోగామి, మధ్యరకం, వెనుకబడినవారు అనే తేడాలున్నాయి. సైద్ధాంతిక కృషి చేసేటప్పుడు అత్యధిక సంఖ్యాకుల్ని దృష్టిలో ఉంచుకోవాలి. అత్యధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యమయ్యే విద్యా విధానాన్ని ఉపయోగించాలి. తద్వారా వారు క్రమంగా పురోగామి స్థాయికి చేరగల్గుతారు.

7. రోజువారీ ఎడ్యుకేషన్‌తో రాజకీయ, సైద్ధాంతిక క్యాంపెయిన్‌లను జోడించాలి. ఒక నిర్దిష్ట కాలంలో వచ్చే రాజకీయ, సైద్ధాంతిక ఉద్యమాల మీద మాత్రమే వక్కాణింపు నివ్వకండి. రోజువారీ సైద్ధాంతిక విద్యకు కూడా గొప్ప ప్రాధాన్యత నివ్వండి.

8. ప్రజల్ని సమీకరించి ప్రతి ఒక్కర్ని సైద్ధాంతిక కృషిలో భాగం చేయండి. ఉత్తమమైన వ్యక్తుల గురించీ, పనుల గురించీ సకాలంలో నివేదికలనూ, ప్రశంసలనూ అందించండి; చెడు ధోరణులను సకాలంలో ఎండగట్టి సరిదిద్దండి; సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం లేకుండా వాటిని చేపట్టండి.

9. సిద్ధాంత ప్రాముఖ్యతను, ఆచరణాత్మక సమస్యల పరిష్కారంతో జోడించండి. కేవలం ప్రజల సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించడం పైనా, వారి రాజకీయ పురోగతి పైనా మాత్రమే శ్రద్ధ వహించండి, వారి ఆచరణాత్మక సమస్యలను చేపట్టడాన్ని మరువకండి. వారి బాగోగులను పట్టించుకోండి.

10. సజీవమైన విద్యా సామగ్రినీ, పద్ధతుల్నీ ఉపయోగించండి. అంటే ప్రజల వ్యక్తిగత అనుభవాల ద్వారా, నిజ జీవితంలోని నిర్దిష్ట వాస్తవాలను ఉపయోగించుకుంటూ, ఉత్తమమైన వ్యక్తుల్ని,

పనులనూ ప్రశంసిస్తూ మనం విద్యను గరపాలి అని అర్థం.

వాస్తవాల మీద ఆధారపడి సైద్ధాంతిక కృషి చేయడంలోని సారాన్ని పైన పేర్కొన్న పది అంశాలూ పూర్తిగా ప్రతిఫలిస్తున్నాయి.

మన సైద్ధాంతిక కృషిలోని సాధారణ కర్తవ్యం కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ మార్క్సిజం-లెనినిజాన్ని వ్యాప్తి చేయడం. కామ్రేడ్ మావో ఇలా అన్నారు. "మార్క్సిజం అంటే ప్రజల జీవితాల్లో, పోరాటాల్లో శక్తివంతమైన పాత్ర వహించే సజీవమైన మార్క్సిజం అనే అర్థం. అంతే తప్ప మాటల్లో చెప్పే మార్క్సిజం కాదు." లెనిన్ కూడా ఇదే భావాన్ని ఒక చోట ఇలా వ్యక్తపరిచారు : "మనకు జీవం లేని బొక్కలు కాదు కావాల్సింది, సజీవమైన జీవితం కావాలి." కార్మికవర్గం చేసే వాస్తవమైన పోరాటాల నుండి పుట్టి నిరంతరం వాస్తవం ద్వారా ధృవీకరింపబడుతున్న అత్యంత శాస్త్రీయమైన, అత్యంత విప్లవకరమైన సత్యం మార్క్సిజం కనుక అది చిరకాలం జీవిస్తుంది. మార్క్సిజం వాస్తవాల నుండి దూరమైనప్పుడు మాత్రమే దాని అన్వయింపుగానీ, అభివృద్ధిగానీ అడ్డగించబడ్డాయి. అందుకనే సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించి, ఆచరణాత్మక సమస్యలను పరిష్కారించడానికి మార్క్సిజం-లెనినిజంను అధ్యయనం చేయడమూ, ప్రచారం చేయడమూ కీలకమైన అంశం. ఈ విధంగా చేయడం ద్వారా మాత్రమే ప్రజలు సజీవమైన మార్క్సిజం-లెనినిజం మీద పట్టు సాధించగల్గుతారు.

కొందరు బూర్జువా కార్యకర్తలు వాస్తవాలను ఏ విధంగా ఎదుర్కొని బూర్జువా విప్లవాల కాలంలో వాస్తవ పోరాటాల్లో చురుకైన పాత్ర వహించారో ఎంగెల్స్ ఒకసారి ఇలా వర్ణించారు :

"అయితే వీరందరిలోని స్వాభావిక లక్షణం ఏమంటే వీరందరూ కూడా సమకాలీన ఉద్యమాల మధ్యలోనే జీవిస్తూ కార్యకలాపాలను కొనసాగిస్తుంటారు; ఆచరణాత్మక పోరాటంలో భాగమౌతారు; వారు ఏదో ఒక పక్షం వహిస్తారు; పోరాటంలో చేరతారు – కొందరు ఉపన్యాసాల ద్వారా, కొందరు రచనల ద్వారా, కొందరు కత్తి పడ్తారు, కొందరు రెండూ చేస్తారు. అయితే బాగా చదువుకున్నవారు మాత్రం మినహాయింపు. వీరు రెండవ లేదా మూడవ స్థాయి మనుషులు లేదా చేతులు కాలడం ఇష్టంలేని జాగ్రత్తపరులైన అసమర్థ జీవయాత్రికులు."

బూర్జువా విప్లవ సిద్ధాంతవేత్తలకు కూడా సైద్ధాంతిక కృషిని వాస్తవాల నుండి వేరు చేయలేమనే విషయం తెలుసు. మరి కార్మికవర్గ విప్లవకారులం, సిద్ధాంతవేత్తలం, సైద్ధాంతిక కార్యకర్తలం అయిన మనం వాస్తవాల నుండి సిద్ధాంతాన్ని విడదీసే సంస్కృతిహీనుల వైఖరిని నిజమైన విప్లవకర శాస్త్రమైన మార్క్సిజం -లెనినిజం-పట్ల ఎలా చేపట్టగలం? అందులోనూ మనం కమ్యూనిజం కోసం పోరాడుతున్నప్పుడు ఈ పనిని ఎలా చేయగలం?

**"అధ్యయనాన్ని సంస్కరించుకుందాం"** అనే వ్యాసంలో మావో అధ్యయనం విషయంలో రెండు పూర్తి భిన్నమైన వైఖరుల గురించి ప్రస్తావించారు. "ఒకటి, స్వీయాత్మక వైఖరి : ఈ వైఖరి గల వ్యక్తులు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని అమూర్తంగా చదువుతారు. ఎటువంటి లక్ష్యం లేకుండా చదువుతారు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న ఎత్తుగడల పరమైన, సైద్ధాంతికమైన సమస్యల్ని పరిష్కరించే పద్ధతులు, దృక్పథం, వైఖరుల్ని తెలుసుకోవడం కోసం మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల వద్దకు వారు వెళ్ళరు. వారు కేవలం సిద్ధాంతాన్ని సిద్ధాంతం కోసం అధ్యయనం చేస్తారు. వారు గురిచూసి బాణాల్ని వదలరు, ఇష్టమొచ్చినట్టు బాణాలు వదులుతారు." మరో వైఖరి మార్క్సిస్టు-లెనినిస్టులది : "ఈ వైఖరిగలవారు మార్క్సిజం-లెనినిజంను ఒక లక్ష్యం కోసం అధ్యయనం చేస్తారు. అంటే చైనా విప్లవోద్యమంతో మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని మేళవించడానికి, ఆ సిద్ధాంతం నుండి చైనా విప్లవపు ఎత్తుగడల, సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించే పద్ధతుల్నీ, వైఖరుల్నీ, దృక్పథాన్ని తెలుసుకో ప్రయత్నిస్తారు. గురి చూసి బాణాన్ని కొట్టే వైఖరి ఇది".

సైద్ధాంతిక కృషిలో సరైన దిశను అంటిపెట్టుకొని ఉండడం కోసం కామ్రేడ్ మావో సేటుంగ్ పార్టీలో స్వీయాత్మకమైన, చెడు అధ్యయన పద్ధతులకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన పోరాటాన్ని చేపట్టారు. పిడివాదుల, అనుభవవాదుల భావజాలానికీ, పనిశైలికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఇది.

చైనా ప్రజాస్వామిక విప్లవ క్రమంలో, విదేశాల అనుభవాల్ని యాంత్రికంగా తీసుకొని అన్వయించిన కొందరు పిడివాదులు పార్టీలో తలెత్తారు. వారు కూడా మార్క్సిజం-లెనినిజం అధ్యయనాన్ని ప్రోత్సహించారు. అయితే వారికి వాస్తవ పరిస్థితుల గురించిన ఎటువంటి జ్ఞానమూ లేకపోయినప్పటికీ, మార్క్సిస్టు గ్రంథాల నుండి కొన్ని పదాల్నీ, పదబంధాల్నీ వల్లె వేయడం, కాపీ చేయడం అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుందని భావిస్తారు. పిడివాదులు కూడా మాటల్లో పదే పదే సిద్ధాంతం ఆచరణతో ముడిపడి ఉండాలని వాదిస్తారు కానీ దీన్ని ఎప్పుడూ ఆచరించరు. చాలా మంది పరిశోధన చేసేవారు చైనా వాస్తవ స్థితిని అధ్యయనం చేయడంపై ఆసక్తి చూపలేదు. బదులుగా వారు ఉత్త 'సిద్ధాంతాన్ని' అధ్యయనం చేయసాగారు. ఈ పిడివాద ధోరణిని ఎదిరిస్తూ కామ్రేడ్ మావో అప్పటి పరిస్థితుల్నీ, చరిత్రనూ అధ్యయనం చేయడంపైనా, సిద్ధాంతాన్ని అన్వయించడంపైనా శ్రద్ధ వహించాలని సూచించారు. చలనం లేని, ఏకపక్షమైన, ఒంటరి అధ్యయన పద్ధతుల్ని వ్యతిరేకిస్తూ ఆయన కార్యకర్తలకు మార్క్సిజం-లెనినిజాన్ని నేర్పడానికి మరో పద్ధతిని రూపొందించారు. మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాల మార్గదర్శకత్వంలో చైనా విప్లవం యొక్క ఆచరణాత్మకమైన సమస్యల్ని అధ్యయనం చేయడం చుట్టూతనే ఈ పద్ధతిని ఆయన రూపొందించారు. ప్రజల్లో ప్రచార కృషిని గురించి చెప్తూ ఆయన అది ప్రజల మనసులకు హత్తుకునే విధంగా ఉండాలన్నారు. అందుకనే విషయాలతో కూడిన నిజమైన వాస్తవాలను కలిగి ఉన్న వ్యాసాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. అంటే మన ప్రచారాన్ని ఏ ప్రజలకైతే ఉద్దేశిస్తున్నామో వారి గురించిన సంపూర్ణమైన జ్ఞానం ముందుగా మనకు ఉండాలన్న మాట. ప్రజలను అధ్యయనం చేయకుండా, విశ్లేషించకుండా మనం ప్రచార కృషిలోకి దిగకూడదన్నమాట.

అదే సమయంలో కామ్రేడ్ మావో పార్టీలోని అనుభవవాద ధోరణిని కూడా వ్యతిరేకించాడు. ఈ ధోరణి గలవారు సిద్ధాంతాల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేస్తారు. సిద్ధాంత సమస్యలకు ఆచరణాత్మక సమస్యలను జోడించాల్సిన అవసరాన్ని ఎన్నడూ గుర్తించరు. వాస్తవమైన పరిణామాలతో వారు తరచూ గందరగోళపడుతుంటారు. లేదా పరిమితమైన అనుభవాల మీదే అత్యధిక నమ్మకాన్ని ప్రదర్శిస్తుంటారు. సిద్ధాంతాన్ని ఆచరణ నుండి విడదీసి చూసే

పొరపాటుకు ఇది మరో వ్యక్తీకరణ. తమ అనుభవాలను క్రమబద్ధీకరించి మరింత సంపూర్ణమైన జ్ఞానాన్ని పొందడానికిగాను మార్క్సిస్టు సిద్ధాంతాన్ననుసరించి తమ అనుభవాల్ని సీరియస్‌గా క్రోడీకరించాలని డిమాండ్ చేయడమే కామ్రేడ్స్‌లోని ఈ లోపాన్ని అధిగమింపజేసే మార్గం అని కామ్రేడ్ మావో సూచించారు.

చైనా ప్రజాస్వామిక విప్లవానికి పైన పేర్కొన్న రెండు స్వీయాత్మక ధోరణులూ తీవ్రమైన నష్టాన్ని కలుగజేశాయనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే మనం చివరికి విజయం పైన విజయం సాధిస్తూ, ఒక బలమైన శత్రువును ఓడించి ప్రజల సోషలిస్టు నూతన చైనాను స్థాపించాం. ఇది ఎలా సాధ్యమైంది? ఈ తప్పుడు ధోరణులను అధిగమించడంలోనూ చైనా సమాజ ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాలను ఉపయోగించడాన్ని నేర్చుకోవడంతోనూ, చైనా విప్లవ అభివృద్ధి సూత్రాలను కనిపెట్టడంలోనూ పార్టీకి కామ్రేడ్ మావో నేతృత్వం వహించారు. అంతే కాదు, చైనా సమాజ లక్షణాల ననుసరించి విప్లవ వ్యూహాలనూ, ఎత్తుగడలనూ రూపొందించడంలోనూ, ఈ వ్యూహాలకూ, ఎత్తుగడలకూ అనుగుణంగా చైనా ప్రజల్ని సమీకరించి, సంఘటితపరచడంలోనూ పార్టీకి కామ్రేడ్ మావో నేతృత్వం వహించారు. అందువల్లనే మనం విజయం సాధించగలిగాం.

"ప్రజల అవసరాల్ని తీర్చగలిగిన మేరకు మాత్రమే సిద్ధాంతం ఎప్పుడైనా గానీ ప్రజలలో వాస్తవ రూపాన్ని సంతరించుకుంటుంది" అన్నారు మార్క్స్. ఇంత పెద్ద జనాభా గలిగిన ఒక విశాలమైన దేశంలో కామ్రేడ్ మావో మార్గదర్శకత్వంలో మార్క్సిజం-లెనినిజం అనే సత్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడం, చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణకు మార్క్సిజం-లెనినిజం విశ్వజనీన సూత్రాలను సన్నిహితంగా మేళవించడం, చైనా ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని మలచడం మార్క్సిజం-లెనినిజం అభివృద్ధి చరిత్రలో నిస్సందేహంగా ఒక గొప్ప ఘటన అని చైనా కమ్యూనిస్టులు భావిస్తున్నారు.

పి.ఎల్.ఎ "నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధ్యయనం చేయండి" అని సూచిస్తుంది. ఆచరణాత్మక సమస్యల దిశగా సైద్ధాంతిక అధ్యయనాన్ని మళ్ళిస్తుంది. మన పార్టీ సైద్ధాంతిక, భావజాలపరమైన కృషి యొక్క మహత్తర సంప్రదాయం ఇది. మనం అన్ని సమయాలలోనూ, అన్ని రకాల పరిస్థితుల్లోనూ ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలి. నిజానికి, ఈ సంప్రదాయాన్ని అభివృద్ధిపరచడం పైన శ్రద్ధ వహించి దాన్ని కొనసాగించడం మున్నెన్నటికంటే మరింత అవసరం. ఎందుకంటే గొప్ప మార్పులు, నూతన అంతర్జాతీయ, దేశీయ విప్లవ పోరాటాలు జరుగుతున్న నూతన చారిత్రక శకంలో మనం జీవిస్తున్నాం.

ఒక గొప్ప సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించే కర్తవ్యం అపూర్వమైనది. ఎందుకంటే చైనా చరిత్రలో అతి గొప్ప, ఉన్నతమైన లక్ష్యం ఇదే. ఎందుకంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం చేసే కృషి మనకు పూర్తిగా కొత్త. సోషలిస్టు దశలో వర్గపోరాటం, ఉత్పత్తికోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటం గతంలో జరిగిన ఇతర విప్లవోద్యమాలన్నిటికంటే పూర్తిగా భిన్నమైనది. మార్క్సిస్టు-లెనినిస్టు విశ్వజనీన సత్యాలు సరియైన అవగాహనకు చుక్కానిగా నిలుస్తాయి. అందుకని మనం మార్క్సిస్టు-లెనినిస్టు ప్రామాణిక గ్రంథాలను శ్రద్ధగా అధ్యయనం చేయాలి. మన అవగాహనకు మార్గదర్శకత్వాన్ని వాటి నుండి పొందాలి. అయితే అనేక ఆచరణాత్మక సమస్యల పైన మన స్వంత బుర్రనుపయోగించి నిర్దిష్టమైన నిర్ధారణలకు రావాలి.

**లెనిన్ చెప్పినట్లుగా –**

"సోషలిజాన్ని చేరుకునే మార్గం గురించి మార్క్సుకుగానీ మార్క్సిస్టులకు గానీ ప్రతి చిన్న వివరణతో సహా అన్నీ తెలుసునని మేం చెప్పడం లేదు. అలాంటివి చెప్పుకోవడం అర్థరహితంగా ఉంటుంది. మనకు తెలిసిందల్లా ఆ మార్గం పోయే దిశ గురించీ, దాని ననుసరించే వర్గశక్తుల గురించి మాత్రమే. కోట్లాది ప్రజలు పగ్గాల్ని చేపట్టడం ద్వారా పొందే అనుభవం నుండి మాత్రమే నిర్దిష్టమైన, ఆచరణాత్మకమైన వివరాలు వెలుగులోకి వస్తాయి."

సోషలిస్టు విప్లవమూ, సోషలిస్టు నిర్మాణమూ ఎన్నో కొత్త రకం సమస్యల్ని మన ముందుకు తీసుకొచ్చిపెట్టాయి. అవి మనల్ని ఆలోచించమనీ, సమాధానాలు వెతకమనీ ఒత్తిడి చేస్తున్నాయి. ఉదాహరణకు, సోషలిస్టు సమాజంలో వర్గాల లక్షణాలు ఏవి, వర్గపోరాటం ఎలా ఉంటుంది? కార్మికవర్గ నియంతృత్వాన్ని ఎలా సంఘటితపరచి, అభివృద్ధిపరచాలి? పెట్టుబడిదారీ శక్తులు తలెత్తకుండా, పునరుద్ధానం పొందకుండా ఎలా అడ్డుకోవాలి? సోషలిస్టు ఉత్పత్తిని అభివృద్ధిపరచడం, పంచడం ఎలా? వ్యక్తికీ, సమిష్టికీ సంబంధాన్ని ఎలా చూడాలి? సోషలిస్టు సమాజంలో విజ్ఞానశాస్త్రాన్నీ, కళల్నీ ఎలా పురోగమింపజేయాలి? కార్యకర్తల, ప్రజల భావజాలాన్ని విప్లవీకరించడాన్ని ఎలా ప్రోత్సహించాలి?

దేశీయ సమస్యలతో పాటుగా అంతర్జాతీయ రంగంలో మార్క్సిస్టు-లెనినిస్టులకూ, ఆధునిక రివిజనిస్టులకూ మధ్య పెద్దయెత్తున సైద్ధాంతిక చర్చ జరుగుతోందని కూడా తెలుసు. మార్క్సిజం-లెనినిజంలోని విప్లవసారాన్ని బలహీనపర్చడానికీ, తద్వారా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ పరిస్థితిలో 'నూతన పరిస్థితులు' 'నూతన లక్షణాలు' వచ్చాయనే సాకుతో కావాలని వాస్తవాల్ని వక్రీకరిస్తూ మార్క్సిజం-లెనినిజం నుండి దూరంగా పోవడానికి ఆధునిక రివిజనిస్టులు ప్రయత్నిస్తూ ఉన్నారు. ఈ విధంగా, ప్రపంచ ప్రజల ముందు అనేక నూతన ప్రశ్నల్ని ఉంచారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ పరిస్థితిలో వచ్చిన నూతన మార్పులు, నూతన లక్షణాలు ఏవి? ఆధునిక సామ్రాజ్యవాద లక్షణాలు ఏవి? సామ్రాజ్యవాదం స్వభావంలో మార్పు వచ్చిందా? ఆధునిక రివిజనిస్టులు చెప్తున్నట్లుగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచం నుదుటిరాతను మార్చివేయగలదా? చారిత్రక అనుభవాలన్నిటి ద్వారా రుజువైనట్లుగా మానవ చరిత్ర సృష్టికర్త ఎవరు? సమకాలీన ప్రపంచంలో విప్లవానికీ, యుద్ధానికీ, శాంతికీ గల సంబంధం ఏమిటి? సోషలిజానికీ, సామ్రాజ్యవాదానికీ గల సంబంధంతో ఎలా వ్యవహరించాలి? సోషలిస్టు దేశాల మధ్య సంబంధాలతో ఎలా వ్యవహరించాలి? ప్రపంచ విప్లవం ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది? దాని భవిష్యత్తు ఏ విధంగా ఉంటుంది? పీడిత ప్రజల, జాతుల విప్లవోద్యమాలను ఏ విధంగా అంచనా కట్టాలి? వాటితో ఎలా వ్యవహరించాలి? ప్రపంచ ప్రజల్లోని విప్లవోద్యమాల్లోని అసంఖ్యాకమైన వాస్తవాలు మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ సూత్రాలు నిస్సందేహంగా సరైనవని రుజువు చేస్తున్నాయా? లేక ఈ సూత్రాలు కాలం చెల్లినవని రుజువు చేస్తున్నాయా? ఆధునిక రివిజనిజం సారం ఏమిటి? దానికి మూలం ఏది? ఈ రాజకీయ చర్చ స్వభావం ఏమిటి? దాని భవిష్యత్తు ఏమిటి?

వాస్తవ జీవితంలో ఎవరూ ఈ ముఖ్యమైన దేశీయ, అంతర్జాతీయ సమస్యలను తప్పించుకోలేరు. నిజానికి అవి ప్రతి ఒక్కరి జీవితంతో సన్నిహిత సంబంధం కలిగినవి. ప్రతి విభాగం యొక్క కృషి, పోరాటం, ప్రజల అలోచనలు కూడా ఈ సమస్యలతో దగ్గరి సంబంధం కలవి. వీటితో సంబంధం లేకుండా అవి పని చేయజాలవు. ఈ సమస్యలకూ, వీటి నుండి ఉత్పన్నమయ్యే ఇతర సమస్యలకూ మన సైద్ధాంతిక కృషి శాస్త్రీయమైన సమాధానాల నివ్వాలనే విషయం తేటతెల్లమే.

**కామ్రేడ్ మావో ఇలా అన్నారు –**

"ప్రస్తుత ఉద్యమం లక్షణాలు ఏవి? దాని సూత్రాలు ఏవి? దానికి ఎలా దిశా నిర్దేశం అందివ్వాలి? ఇవన్నీ ఆచరణాత్మకమైన సమస్యలు .... ఉద్యమం అభివృద్ధి అవుతోంది. నూతన విషయాలు ఇంకా పుట్టుకొచ్చేది ఉంది. అవి నిరంతరాయంగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఈ ఉద్యమాన్ని సమగ్రంగానూ, అభివృద్ధి చెందుతున్న క్రమంలోనూ అధ్యయనం చేయడం అనేది మనం నిరంతరం శ్రద్ధ వహించాల్సిన ఒక గొప్ప కర్తవ్యం. ఈ సమస్యలను జాగ్రత్తగా, సీరియస్‌గా అధ్యయనం చేయనిరాకరించేవారు మార్క్సిస్టులు కారు."

దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ కూడా వాస్తవ పోరాటాల నుండి పుట్టుకొచ్చే నూతన సమస్యలపై మనం నిరంతరం శ్రద్ధ వహించాలి. మనం వాటిని అధ్యయనం చేయాలి. ప్రతి ఒక్క పనికీ, ఉద్యమానికీ గల అభివృద్ధి సూత్రాలను కనిపెట్టాలి. దీని ప్రాతిపదికగా మాత్రమే మనం సరియైన సాధారణ పంథాను, పోరాటాన్ని గైడ్ చేసే విధానాన్నీ, అనుసరించాల్సిన నిర్దిష్టమైన పంథాలనూ, విధానాలను రూపొందించగలం. ఈ విధానాలు, పంథాలు ఆచరణలోని సజీవమైన మార్క్సిజం–లెనినిజమే. ప్రజల్ని ఎడ్యుకేట్ చేసి, వారికి వివిధ ముఖ్యమైన సమకాలీన సమస్యలను వివరించి మెట్టుమెట్టుగా ఆచరణాత్మకమైన పోరాటాలను కొనసాగించి, మార్క్సిజం –లెనినిజం–మవో ఆలోచనా విధానం ప్రాతిపదికన పార్టీ పంథాలూ, విధానాల కనుగుణంగా వారిని ముందుకు నడపడమే మన సైద్ధాంతిక కృషిలోని కర్తవ్యం.

పార్టీ పంథాలూ, విధానాల్లో ప్రజల్ని ఎడ్యుకేట్ చేసి వాటిని అమలు పరిచేలా చేయడం ఎలా? యాంత్రికంగా వాటిని బైటకు చదివేస్తే సరిపోతుందా? నిర్దిష్ట పరిస్థితుల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా వారిని ముందుకు తోస్తే సరిపోతుందా? లేదు, మనం ఇలా చేయకూడదు. ఎందుకంటే వివిధ ప్రాంతాల్లో, రంగాల్లో ప్రజల ఆచరణాత్మక అనుభవాల్ని క్రోడీకరించడం ద్వారానే పార్టీ పంథాలూ, విధానాలు పుట్టుకొస్తాయి. అందుకనే ఏదైనా ఒక రంగానికి లేదా కార్యక్షేత్రానికి చెందిన నిర్దిష్ట పరిస్థితుల్లో వాటిని అన్వయించినప్పుడు అవి సాధారణ ఆదేశాలుగా మారతాయి. ప్రజల అనుభవాల నుండి చేసిన నిర్ధారణలను వారి వద్దకు తిరిగి తీసుకువెళ్ళినప్పుడు వీటిని ప్రజల వాస్తవ పరిస్థితులకు తగినట్లుగా ఆచరించాల్సి ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, ఎక్కడైనాగానీ పార్టీ పంథాలూ, విధానాలు ప్రజల ఆలోచనలతో, నిర్దిష్ట పరిస్థితులతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండాలి. ఈ విధంగా మాత్రమే ప్రజల ఆచరణాత్మక, సైద్ధాంతిక సమస్యలను శక్తివంతంగా చేపట్టగల్గుతాం. పార్టీ విధానాలను ప్రజల ఆచరణగా మార్చగల్గుతాం.

గొప్ప సామాజిక మార్పులు జరుగుతున్న కాలంలో, వాస్తవ జీవితం సుసంపన్నంగానూ, సంక్లిష్టంగానూ కూడా ఉంటుంది. అన్ని వర్గాల్లోనూ, సామాజిక సెక్షన్లలోనూ తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయి. నూతన పరిస్థితుల కనుగుణంగా వివిధ సామాజిక శక్తుల పున:సమీకరణ జరుగుతోంది. గొప్ప వేగంతో ప్రజా ఉద్యమాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజలు నిరంతరం నూతన విషయాల్ని సృష్టిస్తున్నారు. అయితే ప్రజలు ఇంకా అలవాటుపడని ఎన్నో అపరిచిత అంశాలు కూడా ఇంకా ఉన్నాయి. పార్టీ పంథాలపట్ల, విధానాలపట్ల వివిధ వర్గాల ప్రజలు వేర్వేరుగా స్పందిస్తారు, వేర్వేరు వైఖరులు చేపడ్తారు, వేర్వేరు ప్రశ్నల్ని రేకెత్తుతారు. ఇది ప్రజలకు, కార్యకర్తలకూ కూడా వర్తించే అంశం. విప్లవకర కార్యకర్తలు, శ్రేణులు విస్తరించేకొద్దీ, ఎందరెందరో "కొత్తవాళ్ళు" వచ్చి చేరుతుంటారు. విధానాలను అమలుపరచడంలో వారు అనేక సమస్యలను ఎదుర్కొంటారు. ఒక్కోసారి నిర్ణయాలు తీసుకోవడంలో వెనకా ముందాడుతుంటారు. నూతన పరిస్థితుల్లో 'అనుభవజ్ఞులు' కూడా అనేక నూతన సమస్యల నెదుర్కొంటారు. ఈ ఆచణాత్మక సమస్యల కేసి మన సైద్ధాంతిక కృషిని మొదటగా కేంద్రీకరించాలి. వాటి వేర్వేరు స్వభావాల మధ్య తేడాను గుర్తించి, వాటిని వివరించడానికీ, చేపట్టడానికీ వేర్వేరు పద్ధతులను ఉపయోగించాలి. ఈ విషయంలో పి.ఎల్.ఎ కంపెనీల సైద్ధాంతిక కృషి ఎన్నో మంచి అనుభవాల్ని మూటగట్టుకుంది.

ఎప్పుడైనా ఆచరణే మొదటి స్థానాన్నాక్రమిస్తుంది. ప్రజలు సరైన విధానంపై పట్టు సాధించి దాన్ని ఆచరణగా మార్చినప్పుడు కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. దాంతో కొత్త అనుభవాల్ని పోగేసుకోవడానికి, కొత్త నిర్ధారణలకు రావడానికి మనం ప్రజల వద్దకు వెళ్ళాల్సి ఉంటుంది. ఉదాహరణకు సోషలిస్టు సమాజంలో వర్గ సంబంధాల్ని తీసుకుందాం. సోషలిస్టు పరివర్తనా దశలో మన పార్టీ రూపొందించిన విధానాలు ఆ సమయంలో వర్గ సంబంధాలతో సరిగానే వ్యవహరించాయి. అయితే ఉత్పత్తి సాధనాల యాజమాన్యాన్ని మౌలికంగా సోషలిస్టు యాజమాన్యంగా పరివర్తన చెందించాక వర్గ సంబంధాల విషయంలో కొత్త సమస్యలు తలెత్తాయి. దాంతో మన అవగాహనను క్రమంగా లోతుగా పెంపొందించుకోవాల్సిన అవసరం ముందుకొచ్చింది. ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో మార్పు రావడంతోటే దోపిడీ వర్గాలన్నింటినీ వెంటనే రద్దు చేయడం సాధ్యం కాదు. అది సుదీర్ఘ క్రమాన్నే తీసుకుంటుంది. సోషలిస్టు సమాజంలో నూతన బూర్జువా శక్తులు తలెత్తవచ్చు; గ్రామీణ ప్రాంతాల్లో సమిష్టీకరణ జరిగిన తర్వాత సుదీర్ఘ చారిత్రక కాలం వరకు మనం పేదరైతుల్నీ, మధ్య తరగతి రైతుల్నీ నమ్మదగిన మిత్రులుగానే ఆర్గనైజ్ చేయాల్సి ఉంటుంది. మన పార్టీ వర్గ విధానాల్లో నూతన అభివృద్ధికి ఈ ఆచరణాత్మక అనుభవాలన్నీ దారితీశాయనేదీ, వాటికి అన్ని విధాలా నూతన సారాన్ని చేకూర్చాయానేదీ నిస్సందేహం. ఈ నూతన సారాన్ని వివరించే సైద్ధాంతిక వివరణలు తప్పక మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని ఒకడుగు ముందుకు తీసుకుపోతాయి. ఆచరణ నుండి వచ్చే వివిధ రకాల కొత్త సమస్యలను మనం నిర్లక్ష్యం చేస్తే, వాటిని మార్క్సిస్టు–లెనినిస్టు పద్ధతిలో విశ్లేషించకపోతే, మన సిద్ధాంతాలు, విధానాలు వెనుకబడిపోతాయి. ఆ విధంగా సోషలిజం, కమ్యూనిజంల సాధనకు తీవ్ర విఘాతాన్ని కల్గిస్తాయి లేదా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

**కామ్రేడ్ మావో ఇలా అంటారు –**

“మన పార్టీ చేసే ఆచరణాత్మక కృషి అంతటితో, సరియైన నాయకత్వం ‘ప్రజల నుండి ప్రజల వద్దకు’ వెళ్ళే క్రమంలో మాత్రమే ముందుకొచ్చింది: దీనర్థం ఏమంటే : ప్రజల నుండి భావాల్ని తీసుకో (అవి చెల్లా చెదురుగా, పద్ధతి లేకుండా ఉండే భావాలు), వాటిని కేంద్రీకరించు (అధ్యయనం ద్వారా వాటిని కేంద్రీకరించబడిన, పద్ధతి కలిగిన భావాలుగా మార్చు) ఆ తర్వాత ప్రజల వద్దకు వెళ్ళి ప్రజలు ఆ భావాల్ని తమవిగా భావించేంత వరకు వాటిని గట్టిగా చెబుని వాటిని ఆచరణగా మార్చేంత వరకు, అటువంటి ఆచరణలోనే అవి ఎంత సరైనవో పరిక్షించేంతవరకు వాటిని ప్రచారం చేయి, వాటిని వివరించు. మరొక్కసారి ప్రజల నుండి తీసుకున్న భావాల్ని కేంద్రీకరించు. మళ్ళీ ప్రజల వద్దకు వెళ్ళి ఆ భావాలు వారిలోకి ఇంకి ఆచరణలోకి వెళ్ళేలా కృషి చేయి. ఈ విధంగా అనేకసార్లు పదే పదే ఒక అనంతమైన చక్రంలా దీన్ని కొనసాగించాలి. ప్రతిసారీ భావాలు మరింత సరైనవిగానూ, మరింత కీలకంగానూ, సుసంపన్నంగానూ మారతాయి. ఇదే మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం.”

సజీవమైన సైద్ధాంతిక కృషిని కొనసాగించడం అంటే అర్థం మన సైద్ధాంతిక కృషి పదే పదే ‘ప్రజల నుండి ప్రజల వద్దకు’ అనే క్రమం గుండా పయనించాలి అనే. ఇటువంటి సైద్ధాంతిక కృషే కీలంకంగా, శక్తివంతంగా ఉంటుంది.

ఆచరణాత్మక పోరాటాల నుండి వస్తున్న వివిధ సమస్యలకు సమాధానం చెప్పడానికీ, ఆచరణాత్మక అనుభవాన్ని క్రోడీకరించడానికీ, సహజంగానే మనం తరచూ మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో సేటుంగ్‌ల రచనల్ని చూడాల్సి వస్తుంది. మార్క్సిజం–లెనినిజాన్ని సృజనాత్మకంగా అధ్యయనం చేసి, అన్వయించడమంటే ఎదురయ్యే నిర్దిష్ట సమస్యలను పరిష్కరించడానికి వాటికి సమాధానం చెప్పడానికి ‘ప్రజల నుండి ప్రజల వరకు’ పోయే క్రమంలో మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేసి అన్వయించడం అనే అర్థం.

నిజానికి మన కామ్రేడ్స్‌లో చాలా మందికి ఈ విధంగానే మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడం, అన్వయించడం అలవాటైంది. రోజువారీ పనుల్లో భాగంగానో, పని గురించి చర్చించే క్రమంలోనో, తమ పనిలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించడానికీ, అనుభవాల్ని క్రోడీకరించడానికీ అవసరమైన మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల రచనల్ని పదే పదే సంప్రదించడం లేదా తరచుగా చదవడం జరుగుతూ ఉంటుంది. ఈ విధంగా క్రమక్రమంగా జీర్ణించుకున్న అధ్యయనాలు ఎంతో లోతుగా ఉండి, విజయాన్ని సులభం చేస్తాయి. సత్వర ఫలితాలనిస్తాయి. ఎందుకంటే ఈ అధ్యయనాల లక్ష్యం తాను నేర్చుకున్నదాన్ని అన్వయించడమే. తద్వారా వారి అవగాహన మరింత లోతుగా పెంపొందుతుంది. ఈ పద్ధతి క్రమంగా ప్రజల్లో వ్యాప్తి చెందింది. ముఖ్యంగా పార్టీ విధానాన్ని మెరుగ్గా అర్థం చేసుకొని పనిలో సృజనాత్మకంగా ఉండాలనుకునే కార్యకర్తలు కామ్రేడ్ మావో రచనల్ని చదివే ముఖ్యమైన కర్తవ్యాన్ని చేపట్టారు. వీరిలో ఇది మరింతగా వ్యాప్తి చెందింది. ఇది తప్పనిసరిగా మన పార్టీ సైద్ధాంతిక కృషిని అభివృద్ధి పరచి పెంపొందిస్తుందనడంలో సందేహం లేదు.

సజీవమైన భావాల్ని గ్రహించడానికి, నిర్దిష్టమైన సమస్యల్ని దృష్టిలో ఉంచుకొని అధ్యయనం కొనసాగించడానికీ పద్ధతి ప్రకారం సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడం అసాధ్యమనో, అనవసరమనో అర్థం కాదు. నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధ్యయనం చేసినంతకాలం, వాటిని ఒకటొకటిగా అధ్యయనం చేసినంతకాలం, ప్రతి నెలా, ప్రతి రోజూ సీరియస్‌గా, పట్టుదలగా దీనిని కొనసాగించినప్పుడు, క్రమంగా మార్క్సిజం–లెనినిజంలో పద్ధతి ప్రకారం జ్ఞానం సంపాదించగల్గుతాము. నేర్చుకోవడానికి ఆతృతపడే, సిద్ధాంతంలోకి లోతుగా వెళ్ళే అలవాటును చేసుకోగల్గుతాం.

నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధ్యయనం చేయాలంటే అర్థం పద్ధతి ప్రకారం అధ్యయనం చేయకూడదని కాదు. ప్రత్యేకంగా, ఉన్నత స్థాయి కార్యకర్తలూ, సైద్ధాంతిక, భావజాలపరమైన కార్యకర్తలూ కామ్రేడ్ మావో రచనల్ని మాత్రమే కాక కామ్రేడ్స్ మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్ని లోతుగా అధ్యయనం చేయాలి. దేశీయ, అంతర్జాతీయ పోరాట అవసరాలను తీర్చడం పద్ధతి ప్రకారం చేసే అధ్యయనం లక్ష్యంగా ఉంటుంది. ప్రస్తుతం సోషలిస్టు విప్లవ, సోషలిస్టు నిర్మాణ అవసరాలనూ, ముఖ్యంగా ఆధునిక రివిజనిజంతో పోరాడే క్రమంలో తలెత్తే అవసరాలనూ తీర్చడానికి అది ఉద్దేశింపబడాలి. పోరాటం మధ్యలోనే, ఒక లక్ష్యంతో మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడం ఇది. సిద్ధాంతాన్ని ఆచరణతో అన్వయించే అత్యుత్తమ అధ్యయన పద్ధతి ఇది.

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, సిద్ధాంతాన్ని ఆచరణ నుండి విడదీసే అలవాటు పెరుగుతుంది. అందుకని సైద్ధాంతిక కృషికి ప్రథమ స్థానం ఇవ్వాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అయితే అది వాస్తవం మీద ఆధారపడకుండా, ఆచరణ నుండి దూరమైపోతే మన సైద్ధాంతిక కృషి ఏ మాత్రం ప్రభావాన్ని వేయజాలదు. అది తన ప్రాముఖ్యతను కోల్పోతుంది. అందుకని ప్రజల అవసరాలను మరింతగా తీర్చేందుకూ, పరిస్థితుల అభివృద్ధి నుండి వచ్చే అవసరాలను మరింతగా తీర్చేందుకూ మనం తరచుగా మన సైద్ధాంతిక కృషిని తనిఖీ చేస్తూ, అంచనా కడ్తూ ఉండాలి.

***(హాంకీ (ఎర్రజెండా) నెం. 7–8, 1964)*** ♣

**“వాస్తవ పరిస్థితిని గురించిన పరిశోధన లేకపోతే, అపుడు వర్గ బలగాల గురించి భావవాద అంచనా, పనిలో భావవాద మార్గదర్శకత్వమూ విధిగా చోటు చేసుకుంటాయి, ఇవి అవకాశవాదానికిగానీ, దుందుడుకు తత్వానికి (పుట్చిజం)గానీ దారితీస్తాయి”**

– కామ్రేడ్ మావో గ్రంథపూజను వ్యతిరేకించండి (మే, 1930)

# షెడ్యూలు ప్రాంతాలలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను 100 % ఆదివాసులకే ఇవ్వాలనే జి.ఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సమరశీలంగా పోరాడండి!

*ప్రియమైన ప్రజలారా!*

తెలుగు రాష్ట్రాలలోని (ఎ.పి, తెలంగాణ) ఏజెన్సీ ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలన్నీ 100% ఆదివాసులకే ఇవ్వాలనే జి.ఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, ఆదివాసులకు 100% రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధమనీ, 50% రిజర్వేషన్‌కు మించరాదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ, ఒకవైపు ఏజెన్సీలోని ఉపాధ్యాయ, ఉద్యోగ, ఆదివాసీ సంఘాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు జి.ఒ 3 ఫలితంగా బి.సి, ఎస్.సి, మైనారిటీల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారనీ, నేడు దీన్ని రద్దు చేస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ, కొంతమంది ఆదివాసేతరులు, బి.సి సామాజిక వర్గంవారు ప్రకటనలు చేస్తున్నారు. వాస్తవంగా ఈ జి.ఒను రద్దు చేయడం వలన ఎవరికి లాభం చేకూరుతుంది? ఎవరికి నష్టం జరుగుతుంది? అనేది అర్థం కావాలంటే ఈ జి.ఒ వెనుక గల నేపథ్యాన్ని మనం చూడాలి.

తరతరాలుగా ఆదివాసీ ప్రజలు చేసిన వీరోచిత పోరాటాలవలనే భారత రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్ళు, 1/70 చట్టం, పీసా, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలు ఏర్పడ్డాయి. అందులో భాగంగానే 1986లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జి.ఒ 3ను జారీ చేసింది. ఏజెన్సీ ప్రాంతంలో వున్న పాఠశాలలన్నింటిలో టీచరు పోస్టులన్నీ స్థానిక ఆదివాసులకే ఇవ్వాలని ఈ జి.ఒ చెబుతుంది. దీని వలన రెండు లక్ష్యాలను సాధించవచ్చని ఆ జి.ఒలో పొందుపర్చారు. 1. ఉపాధ్యాయులు స్థానిక ఆదివాసీలే అయితే అక్కడే ఉండటానికి అభ్యంతరం చెప్పరు. ఇతరులకు ఏజెన్సీలో పోస్టింగ్ వేస్తే బయటకు బదిలీ చేయించుకునే పైరవీలతో కాలమంతా గడుపుతారు. ఆదివాసీ ఉపాధ్యాయులైతే తమ వారి బాగోగులు కోరుకుంటారు, కనుక మరింత శ్రద్ధగా చదువు చెప్పే అవకాశం వుంటుంది. అవసరమైనప్పుడు తమ భాషలో కూడా బోధించగలరు. తమ వారే టీచర్లుగా ఉంటే ఆదివాసీ పిల్లలకు సహితం మానసిక స్థైర్యం, ప్రోత్సాహం ఉంటుంది. 2. చదువుకున్న ఆదివాసులకు ఉద్యోగాలు రావడం వలన ఆదివాసులు చదువుకోవటానికి ముందుకు వస్తారు. ఆదివాసులకు ఉద్యోగ రంగంలో ఉన్న 6% రిజర్వేషన్ వలన కొద్ది మందికి మాత్రమే ఉద్యోగాలు దొరుకుతాయి. ఆ కొద్ది ఉద్యోగాలు కూడా ఏజెన్సీ బయట ఉండే ఆదివాసీ తెగలు పొందుతున్నారు. ఉద్యోగాలు దొరకని చదువుల పట్ల ఏజెన్సీలోని ఆదివాసులకు పెద్దగా ఆసక్తి వుండదు. కనీసంగా స్థానికంగా టీచరు పోస్టులయినా దొరుకుతాయన్న నమ్మకం ప్రోత్సాహకంగా పని చేస్తుంది. పై రెండు లక్ష్యాల సాధన కోసం ఈ జి.ఒను తెస్తున్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. చట్టం బాగానే ఉంది కానీ, నిజంగా ఆచరణలో ఇది ఎంత వరకూ అమలవుతుందో చూస్తే చట్టాల అమలులో పాలకుల చిత్తశుద్ధి ఎంత ఉందో మనకు అర్థమవుతుంది. 1998లో విశాఖ జిల్లాలో, జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా పాఠశాల అధ్యాపకులను ఎంపిక చేసినప్పుడు ఏజెన్సీ వెలుపల ఉన్న స్కూళ్ళతోపాటు, ఏజెన్సీలోని స్కూళ్ళను కూడా కలిపి వేసి, పై జి.ఒకు పూర్తి విరుద్ధంగా ఉమ్మడిగా ఎంపిక చేశారు. దీంతో ఏజెన్సీలోని పాఠశాలల్లో 883 టీచరు పోస్టులకు ఆదివాసేతరులే ఎంపిక అయ్యారు. ఆనాడు దీనికి వ్యతిరేకంగా ఆదివాసులు ఆందోళనలు చేశారు. గతంలో కూడా ఈ జి.ఒ 3పై దాని రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ, కొందరు ఆదివాసేతరులు హైకోర్టులో పిటిషన్ వేస్తే, అప్పుడు కూడా ఆదివాసులంతా ఐక్యంగా పోరాడి దాన్ని ఓడించారు. చివరకు నేడు భారత సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఈ జి.ఒను రద్దు చేయటమంటే ఆదివాసీ ప్రజలు పోరాడి సాధించుకున్న న్యాయమైన హక్కులనూ, చట్టాలను కాలరాచివేయటమే తప్ప మరొకటి కాదు.

ఆదివాసీ చట్టాలకు రాష్ట్రంలో గవర్నర్లు, దేశంలో రాష్ట్రపతి అధిపతులుగా ఉంటున్నారు. కానీ నేడు ఆదివాసీ చట్టాలు, హక్కులు, సంస్కృతి ధ్వంసం అవుతున్నా, ఏ రాష్ట్రపతి, గవర్నర్లూ పట్టించుకోరు. పైగా ప్రజలు పోరాడి సాధించుకున్న చట్టాలను దోపిడీ వర్గాలకు అనుకూలంగా సవరణలు చేయడం, రద్దు చేయడం జరుగుతున్నది. ఇటువంటి రిజర్వేషన్ల సమస్యతో ఆదివాసీ, ఆదివాసేతరుల మధ్య చీలికలు తీసుకువచ్చి, పీడిత ప్రజల మధ్య కొట్లాట పెడుతున్నారు. కానీ, ఈ సమస్య ఆదివాసీ, ఆదివాసేతరుల మధ్య సమస్య కాదు. ఈ జి.ఒను రద్దు చేయడం ద్వారా ఆదివాసేతరుల నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. పైగా ఆదివాసులు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లు ఇప్పటికీ అరకొరగా అమలవుతున్నాయి. అవి కూడా దక్కకుండా మరింత అన్యాయమే జరుగుతుంది. కనుక ఆదివాసీల హక్కుల కోసం, పీడిత ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ, ఆదివాసేతర పీడిత ప్రజానీకమంతా సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

***ప్రియమైన ప్రజలారా!***

దేశంలోని మొత్తం ఉపాధిరంగంలో ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం 4-5%నికి మించవు. పేదరికం, నిరుద్యోగం అనే సముద్రంలో నీటి చుక్కతో సమానమైన రిజర్వేషన్లతో ఆదివాసీ, ఆదివాసేతర పీడిత ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ప్రజలకు రిజర్వేషన్ల ఆశలు కల్పిస్తూ, వాటి ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనే భ్రమల్లో ముంచెత్తుతున్నది. ప్రజల మధ్య చీలికలు తెస్తున్నది. నేడు దేశంలో ఆధునిక పారిశ్రామిక రంగంలో మానవ శ్రమశక్తి తగ్గి, యంత్రాల ప్రాధాన్యత పెరుగుతున్నది. మరోవైపు కాస్తో, కూస్తో ఉద్యోగాలు కల్పించే తయారీ రంగం ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానంతో కుదేలవుతున్నది. అరాచక పారిశ్రామిక ఉత్పత్తి విధానం కారణంగా పర్యావరణం కలుషితమైపోయి, జీవవైవిధ్యం ధ్వంసంమైపోయి, కొరోనా వంటి మహమ్మారులతో ప్రపంచ దేశాలన్నీ విలవిలలాడుతున్నాయి. మరోవైపు మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం మరింతగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, మన దేశ సంపదను దోచుకుపోవడానికి తలుపులు బార్లా తెరుస్తున్నాయి. ప్రపంచంలోనే ఏ ప్రభుత్వాలు ప్రకటించనంతగా దేశంలో 20లక్షల కోట్ల రూపాయల ఉద్దీపనను ప్రకటించామనీ, దేశంలోని ఆర్థికరంగాన్ని పరుగులు పెట్టిస్తామని నరేంద్రమోడీ, నిర్మలా సీతారామన్‌లు ప్రకటనలు చేస్తూ, ప్రజలను మభ్యపెట్టటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి స్థితిలో సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను ఈడేర్చే ఈ దోపిడీ వ్యవస్థను మట్టుబెట్టకుండా, దేశంలో నిరుద్యోగ సమస్యను ఏ రిజర్వేషన్ విధానాలు పరిష్కరించవు. అందుకే ఈ దేశంలో దోపిడీ రహిత సమాజ నిర్మాణం, నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యం తప్ప, ఏ 'న్యూ ఇండియాలు', 'మేకిన్ ఇండియా'ల ద్వారా సాధ్యం కాదు. నిజమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ఆదివాసీ-ఆదివాసేతర పీడిత ప్రజానీకమంతా సమైక్యంగా పోరాడాల్సిందిగా, మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న న్యాయమైన ప్రజాయుద్ధంలో భాగం కావాల్సిందిగా ఎ.ఒ.బి ఎస్.జడ్.సి పిలుపునిస్తోంది!

***డిమాండ్స్***

- **జి.ఒ 3ను ఖచ్చితంగా అమలు చేయాలి!**
- **సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలి!**
- **ఏజెన్సీలోని ఇప్పటికే ఖాళీగా వున్న టీచర్ పోస్టులన్నీ భర్తీ చేయాలి!**

**విప్లవాభివందనాలతో,**

**ఎ.ఒ.బి ఎస్.జడ్.సి,**

***తేది : మే, 2020*** **సి.పి.ఐ (మావోయిస్టు).**

# మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వర్ధిల్లాలి!
# హిందూ బ్రాహ్మణీయ భూస్వామ్య, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుదాం!
# మహిళా-పురుష సమానత్వాన్ని సాధించుకుందాం!

*ప్రియమైన ప్రజలారా!*

స్త్రీ విముక్తి, సమసమాజ స్థాపన లక్ష్యంగా కలిగిన మహిళా శక్తి తమ పోరాటానికి నాందిగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని గుర్తిస్తున్నది. ఈ శ్రామిక మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం 110 సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. నేడు 111వ దినోత్సవాన్ని జరుపుకోబోతున్న శ్రామిక విప్లవ మహిళా లోకానికి సి.పి.ఐ (మావోయిస్టు) తన విప్లవ శుభాకాంక్షలు తెలుపుతున్నది.

ఈ సుదీర్ఘ పోరాటంలో మహిళా విముక్తి కోసం, మొత్తం పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజల శత్రువులైన సామ్రాజ్యవాదానికీ, హిందూ బ్రాహ్మణీయ భూస్వామ్యానికీ, పితృస్వామ్యానికీ, పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతూ, ఎందరో వీరనారీమణులు తమ జీవితాలను త్యాగం చేశారు. వారి పోరాట సాంప్రదాయాన్ని, వారి ఉన్నత ఆశయాలను తుదికంటా కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిన బూనుదాం.

130 కోట్లకు పైబడిన భారత ప్రజలలో మహిళలు సగభాగంగా ఉండి, సమాజ వికాసంలో తమ వంతు పాత్రను ఎంతో బాధ్యతతో పోషిస్తున్నారు. అయితే భారత సామాజిక వ్యవస్థ అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థ కావడంతో, మహిళలు ఒక వైపున హిందూ బ్రాహ్మణీయ, ఫ్యూడల్ పితృస్వామ్య దాడికి గురికావడంతో పాటు, మరోవైపు పెట్టుబడిదారీ పితృస్వామ్య దాడికి కూడా గురవుతున్నారు. ఈ అర్ధవలస-అర్ధభూస్వామ్య దోపిడీ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ, మనల్ని పరిపాలిస్తున్న ఈ పార్లమెంటరీ పార్టీలన్నికూడా సమాజంలో పితృస్వామ్యాన్ని నిలిపివుంచి, అభివృద్ధి చేయడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి నేరుగా ప్రాతినిధ్యం వహిస్తూ, సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్న మోడీ నేతృత్వంలోని బి.జె.పి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడి మరింత తీవ్రతరమైంది.

2019 మే నెలలో రెండవసారి అధికారంలోకి వచ్చిన నరహంతక మోడీ నాయకత్వంలో, బి.జె.పి పార్టీ మరింత రెచ్చిపోయి, ప్రజలమీద దాడిని పెంచింది. ఒకవైపున హిందూ మతోన్మాదాన్ని విపరీతంగా రెచ్చగొడుతూ, మరోవైపున అన్ని వర్గాల ప్రజలలో పితృస్వామ్యం పెరిగేలాగ బి.జె.పి, దాని అనుబంధ సంస్థల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద సరుకు-వినియోగ సంస్కృతిని తీవ్రంగా పెంచి, మహిళల ప్రాణాలకు సంకటంగా మారింది. బేటి బచావో, బేటీ పడావో అని నినాదాలు ఇస్తూ, వీరి కార్యకర్తలే అనేక చోట్ల మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారు. 'సేవా భారతి' సంస్థ ఈశాన్య రాష్ట్రాల నుంచి 3 నుండి 11 ఏళ్ళ వయస్సు గల అమ్మాయిలను 5వేల మందిని అపహరించింది. వారిని అక్కడనుంచి పంజాబ్, గుజరాత్‌లకు తరలించినట్లు 2017లో పత్రికల వార్తల ద్వారా లోకానికి బహిర్గతమైంది. బి.జె.పి అధికారంలో కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌లో మహిళల మీద అత్యాచారం-హత్య ఉదంతాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బి.జె.పి ఎమ్.ఎల్.ఎ కులదీప్‌సింగ్ సెంగర్ మీద కేసు పెట్టడానికి సంవత్సరకాలం పట్టింది. అదికూడా బాధితురాలు విధానసభ ముందు పోరాట దీక్ష పూనిన తర్వాత మాత్రమే జరిగింది. ఇటీవల కాలంలో బాధితురాలి మీద యాక్సిడెంట్ ద్వారా హత్యా ప్రయత్నం జరిగింది. మరొక బి.జె.పి నాయకుడు కాన్పూర్‌లో విద్యా సంస్థను నడుపుతూ, ఒక విద్యార్థిని మీద అత్యాచారం చేశాడు. ఈ అత్యాచార విషయం వీడియో ద్వారా సాక్ష్యం ఇచ్చిన తర్వాతనే కేసులు పెట్టారు. మరల బాధితురాలి మీద కౌంటరు కేసు పెట్టించారు. ఈ విధంగా బి.జె.పి పార్టీ దాని అనుబంధ సంస్థల నాయకులు దుర్మార్గాలు చేస్తూ, భయోత్పాతాన్ని సృష్టిస్తూ, కేసులు కూడా పెట్టలేని స్థితికి బాధితులను నెడుతున్నారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్, బాలికా వసతిగృహంలో జరిగిన ఘోర ఉదంతం సమాజాన్ని కలచివేసింది. మంత్రులు, రాజకీయ నాయకులు, స్వామీజీలు, బాబాలు పితృస్వామ్య భావజాలంతో మహిళల మీద అత్యాచారాలు, హత్యలు చేయడం వారికి నిత్యకృత్యమయ్యాయి. ఇలాంటి వారందరినీ పోలీసు యంత్రాంగం కాపాడుతూ, వారికి రక్షణ కల్పిస్తున్నది. ఎదురుతిరిగిన వారిని దేశ ద్రోహులని పెద్దఎత్తున ఎదురు దాడులు చేస్తున్నది.

2018 జనవరి 1నాడు జరిగిన భీమాకోరేగాం శౌర్యదివస్ వేడుకలకు హాజరైన లక్షలాది మంది దళితులపై హిందూత్వ శక్తులు దాడులకు పాల్పడి వారిలో భయోత్పాతాన్ని సృష్టించారు. దీనికి సాక్షిగా ఉన్న 19ఏళ్ళ దళిత యువతి బావిలో శవంగా తేలింది. ఇంకా అనేక ఆధిపత్య వ్యవస్థల (పితృస్వామ్యం, మతం, కులం...వగైరా)కు వ్యతిరేకంగా పోరాడుతున్న సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలైన సుధాభరద్వాజ్, షోమాసేన్‌లను అరెస్టు చేసి, జైళ్ళకు పంపించారు. గౌరిలంకేష్‌ను హత్య చేశారు. అరుంధతీరాయ్‌ని బెదిరిస్తున్నారు. సోనిసోడి మీద చేసిన చిత్రహింసలు మరింత క్రూరమైనవి.

మరొక వైపున అన్ని పార్టీలు, అన్ని ప్రభుత్వాలు సామ్రాజ్యవాద వ్యాపార సరుకు సంస్కృతిని దశ, దిశలా విస్తరించేలా అనుమతులు ఇస్తున్నాయి. టి.వి, సినిమా, ఇంటర్‌నెట్ మాధ్యమాల ద్వారా విచ్చలవిడి బూతు సంస్కృతిని, పోర్నోగ్రఫీని చూపించి, యువతను పెడదోవ పట్టిస్తున్నాయి. దీనివలన మహిళల ఉనికికే ప్రమాదం ఏర్పడింది. చిన్నారుల నుంచి వృద్ధ మహిళల వరకు భద్రత లేని పరిస్థితి నెలకొంది. మరోవైపు టూరిజం పేరుతో సెక్స్ పరిశ్రమను అభివృద్ధి చేయబోతున్నాయి. రాష్ట్రాలలోని వివిధ టూరిస్టు స్థలాలను గుర్తించి, వాటి మీద దృష్టి పెట్టాలని అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీలను రాష్ట్ర ముఖ్యమంత్రులు వేడుకుంటున్నారు.

విశాఖ జిల్లా అరకు, లంబసింగి మరియు ఇతర ప్రాంతాలలో సామ్రాజ్యవాద సంస్కృతి విషప్రభావం పెరిగిపోతోంది. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ గుట్టుచప్పుడు కాకుండా అనేక ప్రాంతాలను పర్యాటక స్థలాలుగా గుర్తించి, వాటిని అభివృద్ధి చేయాలని ఎప్పుడో దళారీ పెట్టుబడిదారులకు అప్పజెప్పాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా తాజ్‌మహల్‌ను అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులకు అప్పజెప్పారు. దేశంలో ఎన్నో ప్రాంతాలను ఈ విధంగా చేయడం వలన మహిళల భద్రతకు ప్రమాదం ఏర్పడబోతోంది.

మన దేశంలోని బూర్జువా, రివిజనిస్టు పార్లమెంటరీ పార్టీలు, ఏవి అధికారంలో ఉన్నప్పటికీ, ఈ పార్టీలన్నీ ఒకవైపు దోపిడీ పాలకవర్గ సంస్కృతిని పెంచిపోషిస్తూ, మరోవైపు ప్రజల పోరాటాలకు వెరసి, ఈ విషసంస్కృతికి వ్యతిరేకంగా కొన్ని ప్రజానుకూల చట్టాలను రూపొందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చిన చట్టాలే నిర్భయ చట్టం, దిశచట్టం. కనుకనే, అంటే పాలకవర్గాల ద్వంద్వనీతి వల్లనే ఈ చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా, వారిపై పితృస్వామిక దాడి ఆగటంలేదు. ఈ మధ్య హైదరాబాద్ శివార్లలో జరిగిన 'ప్రియాంక' సంఘటనే ఇందుకు చక్కటి ఉదాహరణ. ఈ సంఘటన నిర్భయచట్టం చేసిన తర్వాతనే జరిగింది. ఈ సంఘటన తర్వాత రాజుకున్న ప్రజాగ్రహ జ్వాలలను ఆర్పివేసేందుకే తెలంగాణ ప్రభుత్వం తమ  పోలీసు అధికారులతో నిందితుల పేరిట నలుగురిని హత్య చేయించి, మహిళా పక్షపాతిలాగా ఫోజ్ కొట్టింది. అంతేకాకుండా తాను రూపొందించిన చట్టాలకు తానే పాతర పెట్టింది. ఇలా ఒక వైపున తామే ఈ  దోపిడీవర్గ విషసంస్కృతిని పెంచిపోషిస్తూ, మరోవైపు వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు ఫోజులు కొడుతున్న ఈ పార్లమెంటరీ పార్టీలన్ని  వాస్తవంగా పితృస్వామ్యానికి అనుకూలమైనవే. కనుకనే ఈ పాలక పార్టీలు దోపిడీ వర్గాలకు, వారి సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పీడిత వర్గాల, సెక్షన్‌ల ప్రజలపైనా, వాటికి నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీలపైన తీవ్రమైన అణచివేతను కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు పోరాట ప్రాంతాలైన చత్తీష్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్‌లలో కూడా మహిళల మీద అత్యాచారాలు, హత్యలు చేయడం తమ క్రూరమైన అణచివేతలో ఒక రూపంగా కొనసాగిస్తున్నారు. విశాఖ జిల్లా, వాకపల్లిలో ఆదివాసీ మహిళలపై అత్యాచారం జరిపిన పోలీసులపై కేసు పెట్టినా ఇంతవరకు అది అతీగతి లేదు. బల్లుగూడలో ఆదివాసీ మహిళలపై అత్యాచారం జరిపిన పోలీసులపై అసలు కేసే పెట్టలేదు. చత్తీష్‌గఢ్, ఝార్ఖండ్‌లలో ఇటువంటి కేసులు ఎన్నో జరిగాయి. కశ్మీర్, మణిపూర్‌లలో వేలాది ఉదంతాలు చోటు చేసుకున్నాయి.

*ప్రియమైన ప్రజలారా!*

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంత గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో పార్టీ నాయకత్వంలోని అనేక గ్రామాలలో మహిళా సంఘాలు ఏర్పడి పితృస్వామ్యానికీ, పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. భూస్వామ్య, తెగ పెత్తనానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగం అవుతున్నారు. బలవంతపు పెళ్ళిళ్ళను వ్యతిరేకిస్తూ, పోరాట కార్యక్రమాలు చేపడుతున్నారు. విప్లవ ప్రజా కమిటీలు ఏర్పడిన చోట భూమి మీద పురుషులతో పాటు, మహిళలకు కూడా సమానవాటా సాధించుకుంటున్నారు. సామ్రాజ్యవాద వ్యాపార సంస్కృతిని వ్యతిరేకిస్తూ, తమ శక్తి మేరకు వివిధ రూపాలలో తమ నిరసన తెలియజేస్తున్నారు. ప్రజలు శ్రమ సంస్కృతినీ, సమిష్టి సహకార సంస్కృతిని పెంపొందించే వైపుగా పయనిస్తున్నారు. గత సంవత్సరం మార్చి నెలలో మహిళా దినోత్సవం సందర్భంగా వేలాది మంది మహిళలు హాజరై పితృస్వామ్యానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించుకొని, వాటిని అమలు జరిపారు.

మొత్తంగా చూసినప్పుడు నేడు దేశంలో బ్రాణ్మణీయ హిందూ ఫాసిస్టు మూకలు మహిళలపై అమలు జరుపుతున్న అమానవీయ హింస, అణచివేత ఎంత బీభత్సంగా, భయంకరంగా ఉందో, దానికి వ్యతిరేకంగా మహిళల్లో పెరుగుతున్న పోరాట చైతన్యం అంత ఆశాజనకంగానూ ఉ ంది. మహిళలపై హింస, అత్యాచారాలకు వ్యతిరేకంగా యూనివర్సిటీలు, కాలేజీలు, హాస్టళ్ళలో సమరశీల పోరాటాలు పెరుగుతున్నాయి. అలాగే దేవాలయాల్లో మహిళల ప్రవేశంపై అమలవుతున్న వివక్షకు వ్యతిరేకంగా కూడా పోరాడుతున్నారు. ఈ సంవత్సర కాలంలో జరిగిన అనేక పోరాటాల్లో, ప్రధానంగా మైదాన ప్రాంతంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతంలో మహిళలు తెగ పితృస్వామ్యానికి వ్యతిరేకంగానూ, రాజ్యహింసలో భాగంగా మహిళలపై జరుగుతున్న లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగాను గట్టిగా పోరాడుతున్నారు. ప్రజాయుద్ధంలో భాగస్వాములవుతున్నారు. పీడిత ప్రజల, మహిళల ఉజ్వల భవిష్యత్ కోసం తమ సర్వస్వాన్ని త్యజించి, వేగుచుక్కలై మార్గాన్ని చూపుతున్నారు. వారి త్యాగాలను ఎత్తిపట్టి, వారి మార్గంలో ప్రయాణం చేద్దాం. పోరాడి సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవడం కోసం మరింత దృఢంగా ఉద్యమిద్దాం.

సామ్రాజ్యవాదాన్ని, హిందూబ్రాహ్మణీయ ఫ్యూడలిజాన్నీ, పితృస్వామ్యాన్ని నిర్మూలించి, సమసమాజ స్థాపన ద్వారా మహిళా–పురుష సమానత్వాన్ని, సమాన అధికారాన్ని సాధించుకుందాం.

☆ మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్ధిలాల్లి!

☆ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

☆ ప్రపంచ సోషలిస్టు మహావిప్లవం వర్ధిల్లాలి!

విప్లవాభివందనాలతో,

ఎ.ఒ.బి ఎస్.జడ్.సి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).

మార్చి 2020

# మే 7న మన్యం పోరాట యోధుడు అల్లూరి వర్ధంతిని సమరోత్సాహంతో జరుపుకుందాం!

# మన్యం పితూరి సేనలో చేరండి! ప్రజాయుద్ధంలో భాగస్వాములు కండి!!

***ప్రియమైన ప్రజలారా!***

అల్లూరి శ్రీరామరాజు పేరు వింటే బ్రిటిషు సామ్రాజ్యవాదులను గడగడలాడించిన మన్యం ఆదివాసీల వీరోచిత తిరుగుబాటు మన కళ్ళముందు కదులుతుంది. మే 7న తెల్లదొరల తుపాకీ గుండ్లకు తన గుండెను ఎదురొడ్డి నిలిచిన అల్లూరి వీరత్వం నేటికీ మన్యం ప్రజల గుండెల్లో పోరాట జ్వాలలను రగిలిస్తూనే ఉంది. అల్లూరి అమరత్వం చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడింది. మన్యంలో ఆదివాసీల మనుగడ కోసం, హక్కుల కోసం అల్లూరితోపాటు, తమ సాంప్రదాయక ఆయుధాలతో, విల్లంబులతో తెల్లవారిని తరిమికొట్టిన అగ్గిదొర, తమ్మనదొర, గంటందొర, మర్రి కామయ్య వంటి ఎందరో ఆదివాసీ వీరుల త్యాగాల చరిత్ర మన్యం ప్రజల్లో నిరంతరం పోరాట స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుంది. దాదాపు 200 సం॥ల ఆదివాసీ పోరాట చరిత్రలో నిర్దిష్టంగా 19వ శతాబ్దం నుంచి తూర్పుగోదావరి, విశాఖ ఏజెన్సీలో దారబందాల రామచంద్రయ్య, అల్లూరి నాయకత్వంలో మన్యం పితూరి నుంచి నేటి సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో పోరాడుతున్న ఆదివాసీ పీడిత ప్రజల చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే. నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి నేటి అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నలలో కొనసాగుతున్న భారత దోపిడీ పాలకవర్గాల వరకూ అడవినీ, అడవిలో ఖనిజ సంపదనూ దోచుకోవడానికి వ్యతిరేకంగా మన్యంలో ప్రజాయుద్ధం కొనసాగుతున్నది.

1980లో మన్యంలోకి ప్రవేశించిన మా పార్టీ సాయుధపోరాటం ద్వారా, ప్రజా రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత ప్రజలు విముక్తి అవుతారని ప్రజలను చైతన్యపరుస్తూ, పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది. అందులో భాగంగానే అడవిపై హక్కు ఆదివాసీలది, పీడిత ప్రజలదే అనే నినాదంతో నీరు, అడవి, భూమి, ఆత్మగౌరవం, అధికారం కోసం, భూస్వాముల, షావుకార్ల, పెత్తందార్ల, ప్రభుత్వ, ఫారెస్టు, ఎ.పి.ఎఫ్.డి.సి వంటి సంస్థల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా మన్యం ప్రజలు వీరోచిత పోరాటాలను చేస్తున్నారు. మరీ ముఖ్యంగా మన్యంలో బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా, ఎ.పి.ఎఫ్.డి.సికి వ్యతిరేకంగా కాఫీ తోటల స్వాధీన పోరాటంలో భాగంగా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎలోని పునాది బలగమైన కామన్ మిలీషియాగా 'మన్యం పితూరిసేన' 2010 మే 7న అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆవిర్భవించి సమరశీల పోరాటాలను కొనసాగిస్తున్నది. ఈ ప్రజా పోరాటాలను అణచివేయడానికి దోపిడీ పాలకవర్గాలు అమలు చేస్తున్న నిర్బంధంలో గత 4 దశాబ్దాలలో ఎందరో ఆదివాసీ ప్రజలు, మావోయిస్టు విప్లవకారులు ప్రాణాలర్పించారు. ఎందరో ఆదివాసీ మహిళలు అత్యాచారాలకు గురైనారు. నేడు మన్యంలో ప్రతి ఒక్క ఆదివాసీ అడవిపై హక్కు మాదేనంటూ తలెత్తుకుని నిలబడగలుగుతున్నారంటే దాని వెనుక దశాబ్దాలుగా మన్యం ప్రజలు కొనసాగించిన వీరోచిత పోరాట, త్యాగాల చరిత్రను మనం మరువకూడదు.

***ప్రియమైన ప్రజలారా!***

నేడు జగన్ ప్రభుత్వం మన్యంలో బాక్సైట్ తవ్వకాలను రద్దు చేస్తున్నానంటూనే, మరోవైపు మన్యంలో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్నది. మన్యంలో క్రూరమైన పోలీసు అధికార్లను నియమిస్తూ, పోలీసు బలగాలతో మన్యాన్ని నింపివేస్తున్నది. రాష్ట్రంలో ఫాసిస్టు నియంత పాలనను కొనసాగిస్తున్నది. ఎన్నో త్యాగాలతో మనం పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడం కోసం, మన్యాన్ని సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య, దోపిడీ పాలకవర్గాల నుంచి రక్షించుకోవడం కోసం ప్రజాయుద్ధంలో భాగస్వాములు కండి! అల్లూరి వారసులుగా సాంప్రదాయక ఆయుధాలతో మన్యం పితూరి సేనలో చేరాల్సిందిగా విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ పిలుపునిస్తుంది.

- **అడవిపై హక్కు ఆదివాసీలది, పీడితప్రజలదే!**
- **మన్యం పితూరి సేనలో చేరండి! మన్యాన్ని కాపాడుకోండి!**

**విప్లవాభివందనాలతో,**

**విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ

తేది : 10 - మే -2020

**విశాఖలోని ఎల్.జి పాలిమర్స్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 12 మంది కుటుంబాలకూ, వారి బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం! ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం!! అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ఎల్.జి పాలిమర్స్ కంపెనీతోపాటు, రాష్ట్రంలో ఉన్న ప్రమాదకరమైన పరిశ్రమలన్నింటినీ తక్షణమే మూసివేయాలి! ఈ ఘటనకు కారణమైన కంపెనీ యాజమాన్యంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి!!**

కొరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపివేస్తుంటే, దేశంలోనూ, రాష్ట్రంలోను లాక్‌డౌన్ కారణంగా సాధారణ ప్రజల జీవితాలు, మరీ ముఖ్యంగా రోజువారీ కూలి పనులు, ఉద్యోగాలపై  ఆధారపడి జీవిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు అతలాకుతలమైపోతున్న తరుణంలో విశాఖలోని ఎల్.జి పాలిమర్స్ గ్యాస్ లీకేజి విషాద ఘటన విశాఖను కుదిపివేసింది. నగరమంతా నిద్రావస్థలో ఉండగానే, కంపెనీ నుంచి వెలువడిన విషవాయువు ప్రభావంతో అసలు ఏం జరుగుతుందో కూడా అర్ధం కాకుండానే, నిద్రలోనే ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. క్షణాల్లోనే వందలాది మంది అపస్మారక స్థితిలోనికి వెళ్ళిపోయారు. మూగజీవులు, పశుపక్ష్యాదులు, చెట్లు చేమలు క్షణాల్లోనే మాడి మసైపోయాయి. అత్యంత విషాదకరమైన ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగినది కాదు. ప్రజల సంక్షేమం పట్ల, ఆరోగ్య భద్రత పట్ల, ప్రజల ప్రాణాల పట్ల అత్యంత బాధ్యాతారాహిత్యంగా ఉంటూ, కోట్ల సంపాదనే లక్ష్యంగా, జనావాసాల మధ్య ఇటువంటి ప్రమాదకరమైన కంపెనీలకు అనుమతులు ఇచ్చిన దోపిడీ పాలకవర్గాల, కంపెనీ యాజమానుల తీవ్రమైన నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణం. వ్యవసాయ యోగ్య భూములు, జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో ఎటువంటి కట్టడాలు, పరిశ్రమలు నిర్మించకూడదనే చట్టాలు, నిబంధనలన్నింటినీ దోపిడీ ప్రభుత్వాలు తుంగలో తొక్కేస్తున్నాయి.

విశాఖలోని గోపాలపట్నంలో 60వ దశకంలో ఏర్పడిన హిందుస్తాన్ పాలిమర్స్‌ను దక్షిణ కొరియా సంస్థతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న తర్వాత లైఫ్ ఈస్ గుడ్ (ఎల్.జి) అనే పేరుతో ఏర్పడిన ఈ కాలుష్యకారక బడా కంపెనీని మూసివేయాలని ఎంతో కాలంగా అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, దోపిడీ పాలకులు పట్టించుకోకపోగా, విస్తరణకు సైతం అనుమతులు ఇస్తున్నారు. మిగులు భూముల పేరుతో ప్రజల భూములను ఎల్.జి పాలిమర్స్‌కు అప్పనంగా కట్టబెట్టింది. చంద్రబాబు హయంలో అనుమతులు ఇచ్చినా, నేడు జగన్ అధికారంలో వాటిని కొనసాగిస్తున్నా, ఏ ప్రభుత్వాలయినా ఆ కంపెనీల ద్వారా వచ్చే లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. కానీ ప్రజల ప్రాణాలు ముఖ్యం కాదని తేటతెల్లమవుతున్నది. కంపెనీ యజమానులకూ, దోపిడీ ప్రభుత్వాలకు మధ్య ఉన్న ఈ అనుబంధాలు, కుమ్మక్కులు, ఒప్పందాల వలనే ఒక విదేశీ కంపెనీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి, అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్నది. ఫ్యాక్టరీల చట్టాల ప్రకారం అతి హానికరమైన విషవాయువులతో నిత్యమూ వ్యవహరించే కంపెనీల్లో వి.ఓ.సి వ్యవస్థ (స్టైరేన్ స్థితిని ఎప్పటికప్పుడు తెలియజెప్పే ప్రత్యేక వ్యవస్థ) ఉండాలి. కానీ ఎల్.జి పాలిమర్స్‌లో అది పని చేయని స్థితిలో ఉన్నందువలనే, లీకేజిని గుర్తించకపోవడంతో విషవాయువు క్షణాల్లో గాల్లో విస్తరించగలిగింది. ద్రవరూపంలో ట్యాంకుల్లో వుండాల్సిన పదార్థం వాయువుగా మారి, బయటకు వచ్చి, విషం కక్కిందంటేనే నిర్ధిష్ట ఉష్ణోగ్రతల్లో దాన్ని బద్రపర్చాలన్న నియమం అస్సలు అమలు జరగలేదన్నది అర్థమవుతున్నది. ఇదంతా చూస్తే కంపెనీ నిర్లక్ష్యం మనకు అణువణువున కనిపిస్తున్నది.

ఇకపోతే లాక్‌డౌన్ పేరుతో, తయారీ రంగ పరిశ్రమలన్నింటినీ మూతపెట్టించి, మరోవైపు ఈ కంపెనీని తెరిచేందుకు ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం అనుమతి ఇచ్చింది? ఇటువంటి హానికరమైన కంపెనీలు రక్షణ చర్యలు

కొనసాగిస్తున్నాయా? లేదా అని కనిపెట్టాల్సిన వివిధ శాఖల అధికారులంతా ఎల్.జి పాలిమర్స్ వంటి బడా కంపెనీలను ఎందుకు చూసీ చూడనట్లు వదిలిపెడుతున్నారు? ప్రమాదం జరిగిన తర్వాత ప్రభుత్వాలు ప్రకటించే విచారణ కమిటీలు, నష్టపరిహారాలన్నీ ప్రజల ఆవేదనను తాత్కాలికంగా ఉపశమింపచేయటానికీ, ప్రజల ఆగ్రహావేశాలను నీరు కార్చటానికే తప్ప, ప్రజలకు మాత్రం న్యాయం జరిగేదేమి ఉండదు. కంపెనీ యాజమాన్యమే ఇంతటి నష్టానికి కారణమని కళ్ళముందు ఇంత నగ్నంగా కనిపిస్తున్నా, వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? పైగా తమ జీవితాలను తమ వారి మృతదేహాలను కంపెనీ ముందు పెట్టి నిరసన తెలియజేస్తున్న ప్రజలపై పోలీసులు అత్యంత దుర్మార్గంగా లాఠీచార్జీలు చేసి, టెంట్లను పీకివేసి అమానుషంగా వ్యవహరిస్తే ఈ పోలీసులకు గ్యాస్ లీక్ ఘటనలో విశేష ప్రతిభా పాటవాలు కనబరిచారంటూ అవార్డులు ఇవ్వటమంటే, దోపిడీ ప్రభుత్వాలకు కావలి కుక్కలైన పోలీసులు ఎవరికి సేవ చేస్తున్నారో ప్రతి ఒక్కరికీ అర్థమవుతున్నది. చనిపోయిన వారికి ప్రభుత్వం కోటి రూపాయలు ప్రకటించిందని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. కోట్లు ఇచ్చినంత మాత్రానా పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా? సృష్టిలో అత్యంత విలువైన మనిషి ప్రాణాన్ని డబ్బులతో వెలకట్టడమనేది అత్యంత దుర్మార్గమైన, అమానవీయమైన విషయం. ఈ ఘటనలో జరిగిన నష్టం తాత్కాలికమైనది కాదు. దీర్ఘకాలికంగా తరతరాల మానవ జీవితాలపై తీవ్రమైన ప్రభావం వేయకమానదు. ఎన్ని కోట్లు పెట్టినా ఈ నష్టాన్ని ఏ ప్రభుత్వాలైనా పూడ్చగలవా?

1984లో 20వ శతాబ్దంలో ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక విపత్తుగా పేర్కొన్న భోపాల్ దుర్ఘటనలో నిద్రలోనే వేలాది మంది కన్నుమూసారు. నేటికీ ఆ విషవాయువుల ప్రభావం అక్కడి ప్రజల జీవితాలను వెంటాడుతూనే ఉంది. అందులో నష్టపోయిన ప్రజలకు మాత్రం ఇప్పటికీ న్యాయం జరగలేదు.

1997లో విశాఖలో హెచ్.పి.సి.ఎల్ ట్యాంకులు పేలినప్పుడు 60 మంది ప్రజలు చనిపోయారు. అదే కంపెనీలో మళ్ళీ 4సం॥ల క్రితం కూలింగ్ టవర్ కూలిపోయి, 38 మంది చనిపోయారు. 2012లో స్టీల్‌ప్లాంట్‌లో గ్యాస్ లీకై, ట్యాంకు పేలి 19 మంది చనిపోయారు. మొత్తంగా చూస్తే ఒక్క విశాఖ నగరంలోనే అనేక పరిశ్రమల్లో ఇప్పటివరకూ 40కి పైగా భారీ ప్రమాదాలు జరిగి వందల మంది చనిపోయారు. రాష్ట్రంలో ప్రమాదాలు జరగటానికి ఆస్కారం ఉన్న పరిశ్రమలు 86 ఉన్నాయని పరిశ్రమల శాఖే గుర్తించింది. ఇందులో 20 పరిశ్రమలు ఒక్క విశాఖలోనే ఉన్నాయి. కానీ వీటి పైన ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు కూడా తీసుకోవు.

***ప్రియమైన ప్రజలారా!***

ప్రజల జీవనాధారమైన భూమి, నీరు, గాలి, చెట్లు, సహజ వనరులన్నింటినీ మన దేశ దోపిడీ పాలకవర్గాలు అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరుతో బహుళజాతి కంపెనీలకూ, బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారు. పర్యావరణాన్నీ, ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తున్నారు. ఈ దోపిడీ వ్యవస్థ ఉనికిలో ఉన్నంత వరకూ ఈ విధ్వంసం జరుగుతూనే ఉంటుంది. అందుకని మన దేశాన్ని దోచుకుంటున్న సామ్రాజ్యవాదులనూ, దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలను కూలదోసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలి. అందుకోసం భారతదేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న దీర్ఘకాలిక సాయుధ పోరాటమొక్కటే మన ముందున్న ఏకైక మార్గం. అందుకు యావత్ పీడిత ప్రజానీకమంతా ఈ ప్రజాయుద్ధంలో భాగస్వామ్యం కావాల్సిందిగా ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి పిలుపునిస్తున్నది.

**విప్లవాభివందనాలతో,**

**కార్యదర్శి,**

**గణేష్,**

**ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

**తేది: 10-5-2020**

## కార్మికవర్గ నిజాయితీకి ప్రతిరూపం

# కామ్రేడ్ కామాల్ (నగేష్)



కామ్రేడ్ నగేష్‌ది సుక్మా జిల్లా, కుంట బ్లాక్, బండోడ్ గ్రామం. అయితే వీళ్ల పూర్వీకులది తమియా గ్రామం. అక్కడ బ్రతకడం కష్టమై, నగేష్ ముత్తాతలు బండోడ్ గ్రామానికి వలస వచ్చి అక్కడే స్థిరపడ్డారు. నగేష్‌కు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి పెంపకంలో పెరిగాడు. నగేష్‌కు ఇద్దరు అన్నలు. వారిలో ఒకరు పార్టీ ఆర్గనైజర్‌గా పని చేస్తుంటే, మరొకరు డి.ఎ.కె.ఎమ్.ఎస్ అధ్యక్షుడిగా, ఊరిలోనే ఉంటూ పని చేస్తున్నాడు. నగేష్‌కు ముగ్గురు తమ్ముళ్ళు కూడా ఉన్నారు. ఇద్దరు చదువుతుంటే, ఒకరు గ్రామ సంఘంలో పని చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే నగేష్ కుటుంబమే విప్లవ కుటుంబం. వారికి కొద్దిపాటి భూమి ఉండటంతో వ్యవసాయం చేసుకుంటూ, ఇంటిల్లిపాది విప్లవ కార్యక్రమాలలో భాగస్వాములవుతుంటారు. బండోడ్ గ్రామం జనతన సర్కార్‌లో భాగంగా ఉంది. ఆ జనతన సర్కార్‌లో ఇది బలమైన విప్లవ ప్రజాపునాది కలిగిన గ్రామం కూడా.

విప్లవ గ్రామంతోపాటు, విప్లవకుటుంబాన్ని కూడా కలిగిన కామ్రేడ్ నగేష్ చిన్నతనం నుంచే విప్లవోద్యమ ప్రభావంతో పెరిగాడు. ఇంటివద్ద ఉన్నప్పుడు మిలీషియాలో పని చేసాడు. ఈ సమయంలోనే అంటే 2006లో ఎ.ఒ.బి నుంచి డి.కెకు సప్లైలు పంపే పని ముందుకు వచ్చింది. ఈ పని నిమిత్తం పార్టీ పైకమిటీ డి.కె నుంచి కొద్దిమందితో కూడిన మిలీషియా టీంను ఎ.ఒ.బిలోని కలిమెలకు పంపింది. ఈ టీంలోకి కామ్రేడ్ నగేష్ కూడా ఎంపిక అయ్యాడు. సప్లైలకు సంబంధించిన ప్రత్యేక పని నిమిత్తం ఎ.ఒ.బికి వచ్చిన నగేష్, పూర్తికాలం ఎ.ఒ.బిలో పని చేసేందుకు సిద్ధపడ్డాడు. డి.కె పార్టీ కూడా నగేష్ నిర్ణయాన్ని ఆమోదించింది. అప్పటి నుంచి మార్చి 2020లో తను అమరుడయ్యే వరకూ ఎలాంటి ఊగిసలాటలు లేకుండా స్థిరంగా దృఢచిత్తంతో విప్లవోద్యమంలో కొనసాగాడు.

కామ్రేడ్ నగేష్ ప్రారంభంలో కలిమెల, మోటు ప్రాంతాలలోని ఆర్గనైజేషన్ దళాలలో సభ్యుడిగా పని చేసాడు. అయితే తనకు మిలటరీ రంగంలో పని చేయాలనే అభిప్రాయం బలంగా ఉండటంతో, పార్టీకి తన ఆలోచనను తెలియజేసాడు. పార్టీ తన ప్రతిపాదనను పరిగణలోకి తీసుకొని, స్థానిక కంబాట్ నిర్మాణమైన ఎ.టి (ఏక్షన్‌టీం)లోకి బదిలీ చేసింది. ఇక్కడ మూడు సంవత్సరాల వరకు పని చేసాడు. ఈ నిర్మాణంలో ఉండగానే 2010లో జరిగిన మంత్రియాంబ అంబూష్‌లో పాల్గొన్నాడు. ఈ అంబూష్‌లో 11 మంది పోలీసులు చనిపోగా, 9 మంది గాయపడ్డారు. అలాగే పొడియా టౌన్‌లో ఒక హోంగార్డును ఖతం చేసి, మరొక హోంగార్డును గాయపరిచిన సంఘటనలో పాల్గొన్నాడు. ఇంకా

**తరువాయి భాగం 27వ పేజిలో**

### వర్గ శత్రువులన్నా, అన్యవర్గ ధోరణులన్నా
### ఉగ్రరూపం దాల్చడం అతడి నైజం

# అతడే కామ్రేడ్ అడ్మాల్



మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్, తెల్లరాయి పంచాయితీ, సుద్దకుంట గ్రామంలో కోయ తెగకు చెందిన నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ అడ్మాల్ జన్మించాడు. అడ్మాల్ తోబుట్టువులు మొత్తం ఐదుగురు, ఇతనే పెద్దవాడు. పెద్ద తమ్ముడు గ్రామంలోని పార్టీ సంఘంలో పని చేసేవాడు. అడ్మాల్ చెల్లెలు సున్ని 2018 నవంబర్‌లో కలిమెల ఏరియా, చందురుపల్లి అటవీ ప్రాంతంలో శతృవుతో జరిగిన ఎదురుకాల్పుల్లో కామ్రేడ్ కీర్తి, కామ్రేడ్ రుప్పిలతోపాటు అమరురాలైంది. ఇంకా ఇద్దరు చిన్న వాళ్ళు కావడంతో అమ్మనాన్నలతో ఉంటారు.

కామ్రేడ్ అడ్మాల్ కుటుంబం మొదట్లో పొడియా ఏరియాలో ఉండేది. బ్రతుకుదెరువు కోసం వాళ్ళ తాత కలిమెలకు వచ్చి అక్కడే సిర్థపడిపోయాడు. అడ్మాల్ ఇంటికి పెద్దవాడు కావడంతో, చిన్న వయసులోనే బాధ్యతలు మీద పడ్డాయి. కుటుంబం కూడా అతడిపైనే ఆధారపడేది. రోజులు గడవడం దినదిన గండంగా ఉండేది. ఈ సమయంలో కామ్రేడ్ అడ్మాల్ బెంగాల్ వాళ్ళ దగ్గర జీతం కుదిరాడు. అస్తమానం కష్టపడ్డప్పటికీ, డబ్బులు మాత్రం ఇచ్చేవారు కాదు. వారు తినగా మిగిలినదాన్ని ఇచ్చినా, దానిని ఇంటికి తీసుకెళ్ళి తన కుటుంబంతో కలిసి తినేవాడు. తన కష్టానికి ఫలితంగా సంవత్సరానికి ఒక గొడ్డు జీతం ఇచ్చేవారు. ఇలా 5 సంవత్సరాలు జీతగాడిగా ఉన్నాడు. ఈ సంవత్సరాలలో తాను సంపాదించిన 5 గొడ్లు ఇప్పటికీ అడ్మాల్ వాళ్ళ ఇంటి దగ్గర ఉన్నాయి. దీంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోవడంతో జీతం మానేసి, పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు కూలీకి వెళ్ళాడు. తల్లిదండ్రుల కష్టానికి తోడు, అడ్మాల్ సంపాదించే కూలీ డబ్బులు కొంత ఆసరానిచ్చేవి. అప్పటికే మల్కనగిరి జిల్లాలో పార్టీ బలంగా ఉండేది. అందులో అడ్మాల్ వాళ్ళ గ్రామం బలమైనది. పార్టీ సంఘాలు, ఆర్.పి.సిలు చురుగ్గా పని చేసేవి. అడ్మాల్ బాలలసంఘంలో పని చేసేవాడు. పార్టీ ఆద్వర్యంలో పంచిన భూమి ఉండటంతో దానిలో వర్షకాలపు పంటలు పండించుకునేవారు.

2008 జూన్ నెలలో మన పి.ఎల్.జి.ఎ చేసిన తెల్లరాయి అంబూష్ ఘటనలో 17 మంది పోలీసులు చనిపోగా, 6 ఎ.కెలను స్వాధీనం చేసుకున్నది. ఈ ఘటన ప్రజలలో, పార్టీ శ్రేణులలో మంచి ప్రభావాన్ని వేసింది. ఈ క్రమంలో కలిమెల ఏరియాలోని అనేక మంది యువతీ, యువకులు పి.ఎల్.జి.ఎలోకి రిక్రూట్ అయ్యారు. ఆ సమయంలో కామ్రేడ్ అడ్మాల్ మిలీషియాలో పని చేసేవాడు. ఈ ఘటన తర్వాత తన పనిని మరింత చురుగ్గా కొనసాగించాడు. అప్పట్లో జరిగిన కరువు దాడులలో, భూ పోరాటాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాడు.

2013 సంవత్సరంలో పార్టీలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. సంవత్సర కాలంపాటు స్థానిక దళంలో పని చేసాడు.

2014లో పార్టీ అవసరాలరీత్యా కామ్రేడ్ అడ్మాల్‌ని బైఫర్‌గూడ దళానికి బదిలీ చేసింది. దళంలోని కామ్రేడ్స్ అందరితో కలిసిపోతూ, తనకు అప్పజెప్పిన పనులను తూ.చ తప్పక అమలు చేసేవాడు. ఇలా రెండు సంవత్సరాల పాటు బైఫర్‌గూడ దళంలో కొనసాగాడు. 2016లో ఉద్యమ అవసరాలరీత్యా పార్టీ కామ్రేడ్ అడ్మాల్‌ని కటాఫ్ ఏరియాకు బదిలీ చేసింది.

కామ్రేడ్ అడ్మాల్ కటాఫ్ దళంలోని కామ్రేడ్స్‌తో స్నేహపూర్వకంగా మెలిగేవాడు. అందరితో కామ్రేడ్లీ సంబంధాలు కొనసాగించేవాడు. తనకు అప్పజెప్పిన ఆర్గనైజేషన్ పనులను బాధ్యతగా, పట్టుదలతో పూర్తి చేసేవాడు. గ్రామాలలోని యువకులతో కలిసి మెలిసి ఉంటూ, వారితో రాజకీయ సంబంధాలను నెరిపేవాడు. ప్రజలతోగానీ, కామ్రేడ్స్‌తోగాని కలిసిపోవడంలో ఎంతో విశాలంగా ఉండేవాడు. తనతోటి కామ్రేడ్స్‌గానీ, ప్రజలు గాని ఏదైనా బాధతో ఉంటే వారిని నవ్విస్తూ బాధలో నుంచి బయటపడేసేవాడు. చిన్ననాటి నుండే చదువుకు దూరంగా ఉన్న అడ్మాల్‌కి చదువుకోవడానికి వెనకడుగు వేసినప్పటికీ, పార్టీ క్రమశిక్షణనూ, గెరిల్లా యుద్ధ నియమాలను పాటించడంలో ఆదమరిచేవాడు కాదు. సహజంగానే ఆదివాసీ ప్రజలలో ఉండే కష్టపడేతత్వం అనేది అడ్మాల్‌లో ఉట్టిపడేలా కనబడేది. ఎంత కష్టమైన పనినైనా ఇష్టపడుతూ, తనతోపాటు పని చేస్తున్న సహచర కామ్రేడ్స్‌ను నవ్విస్తూ, నవ్వుతూ చేసేవాడు. తన కళ్ళ ముందు ఎలాంటి తప్పు జరిగినా వేదికాముఖంగా వారికి గుర్తుచేసేవాడు. తోటి కామ్రేడ్స్ తప్పులను ఎత్తిచూపడమే కాకుండా, తన తప్పులను కూడా మనస్ఫూర్తిగా ఒప్పుకునేవాడు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా, ఏ సమయంలోనైనాసరే పని చెప్పగానే ఎలాంటి బెరుకు లేకుండా సులువుగా పనిలోకి వెళ్ళేవాడు. ఏనాడు ఊగిసలాటకు గురికాలేదు. 2018 నవబంర్‌లో శతృతూటాకు బలైన తన తోబుట్టువు సున్ని అమరత్వాన్ని మరింత రాజకీయంగా అర్థం చేసుకొని, ప్రజలకోసం జరుగుతున్న ఈ దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో అమరత్వాలు సహజమే అని నమ్మి, ఆమె ఆశయ సాధనలో ముందుకే నడిచాడు.

2020 జనవరి 25వ తేదిన ఉద్యమ పనుల రీత్యా జొంతిరాయి గ్రామానికి వెళ్ళిన కామ్రేడ్ అడ్మాల్‌పై విప్లవ ప్రతీఘాతుకులు దాడి చేసారు. ఆ సమయంలో ఆయన చేతిలో గ్రెనేడ్ ఉన్నప్పటికీ దానిని విసిరితే చుట్టుపక్కల ప్రజలకు హాని జరుగుతుందని భావించి దానిని ప్రయోగించలేదు. అయితే తాను ఉగ్రరూపం దాల్చి శతృవును ఎదుర్కొన్నాడు. వారు దొంగదెబ్బ తీసి అడ్మాల్‌ను హత్య చేసారు. ఈ వార్త విన్న కటాఫ్ ఏరియా విప్లవ ప్రజానీకం కన్నీరుమున్నీరయ్యారు. కామ్రేడ్ అడ్మాల్ 'తమకోసం తన నులివెచ్చని నెత్తురుని ధార పోసాడనీ, అందుకు మనమిచ్చే నివాళి అతని ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే' అని శపథం చేసారు. ♣

---

**25వ పేజి తరువాయి**

అనేక మంది ప్రజాద్రోహుల్ని శిక్షించడంలో పాలుపంచుకున్నాడు. ఈ క్రమంలోనే 2012లో పార్టీ పైకమిటీ నగేష్‌కు ఏరియా కమిటీ సభ్యుని స్థాయిలో పదవోన్నతి కల్పించింది.

కామ్రేడ్ నగేష్ మిలీషియా సభ్యుడిగా ఉన్నప్పటి నుంచీ పార్టీ, పి.ఎల్.జి.ఎ క్రమశిక్షణా సూత్రాలనూ, నియమాలలనూ, పద్ధతులను పాటించడంలో ఏ మాత్రం వెసులుబాటు నిచ్చేవాడు కాదు, వాటికి కట్టుబడి ఉండేవాడు. పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యత నిచ్చేవాడు. ఈ లక్షణాలుండటంతో కామ్రేడ్ నగేష్, కార్మికవర్గ నిజాయితీ కలిగిన కామ్రేడ్‌గా పైకమిటీ దృష్టిలో పడ్డాడు. దీంతో పై కమిటీ కామ్రేడ్ నగేష్‌ను ఒక సి.సి.ఎమ్‌కు గార్డ్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కామ్రేడ్ నగేష్ మనస్ఫూర్తిగా స్వీకరించి బాధ్యతలు చేపట్టాడు. 2013 నుంచి 2015 వరకు గార్డ్ బాధ్యతలను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించాడు. బాధ్యుడి రక్షణ విషయంలో అత్యంత జాగరుకతతో అప్రమత్తంగా ఉండటమే కాకుండా, మిగిలిన కామ్రేడ్స్ (గార్డ్స్)తో కూడా మంచి సంబంధాలు నెరుపుతూ, టీంవర్క్ దెబ్బతినకుండ చూసేవాడు. 2015లో టెక్నికల్ రంగానికి చెందిన కామ్రేడ్ కమలతో నగేష్‌కు వివాహమైంది. వైవాహిక జీవితంలో ఎటువంటి పితృస్వామిక ధోరణులను దరిచేరనీయకుండా, కమలతో ప్రజాస్వామిక సంబంధాలను ఏర్పరుచుకొన్నాడు. 2016 మే 4న ఈస్ట్ డివిజన్‌లో పోలీసులు చేసిన ఒక దాడిలో కామ్రేడ్ కమల అమరురాలైంది. ఈ సంఘటన కామ్రేడ్ నగేష్‌ను మానసికంగా కొంత ఇబ్బందికి గురి చేసినా, తన కర్తవ్య నిర్వహణలో ఏ మాత్రం లోటు జరగకుండా కృషి చేసాడు.

కామ్రేడ్ నగేష్ 2016 ఆగస్టులో గార్డ్ బాధ్యతల నుంచి బదిలై, కలిమెల ప్రాంతానికి ఏరియా కమిటీ సభ్యుడిగా పంపబడ్డాడు. అక్కడ నుంచి 2018లో జరిగిన చందురుపల్లి ఎన్‌కౌంటర్‌లో తృటిలో తప్పుకున్నాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో 5మంది అమరులైనారు. పార్టీ పైకమిటీ కలిమెలలో తీవ్రతరమవుతున్న నిర్బంధాన్ని దృష్టిలో ఉంచుకొని, అక్కడ పని చేస్తున్న దళాన్ని రిట్రీట్ చేసి, బైఫర్‌గూడ ప్రాంతంలో నియమించింది. దీంతో నగేష్ బైఫర్‌గూడ ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేస్తూ వచ్చాడు.

ఈ క్రమంలోనే పార్టీ ఒక ముఖ్యమైన పని మీద కామ్రేడ్ నగేష్‌తోపాటు మరో కామ్రేడ్‌ను పంపింది. వీరిద్దరూ పార్టీ ఇచ్చిన పనిపై వెళ్తుండగా, నేతలనార్ బ్రిడ్జివద్ద కూంబింగ్‌కు వచ్చిన పోలీసులు మనవారి వెంటపడ్డారు. అప్పటికే జ్వరం వచ్చి కొంత బలహీనంగా ఉన్న నగేష్ పరుగెత్తలేకపోయాడు. మరో కామ్రేడ్ వేగంగా పరుగెత్తి తప్పుకున్నాడు. పోలీసులు నగేష్‌ను పట్టుకొని పార్టీ రహస్యాలు చెప్పమని తీవ్రచిత్రహింసలకు గురి చేసారు. ఆ సమయంలో ముఖ్యమైన డంపులతోపాటు, సి.సి, ఎస్.జడ్.సి నాయకత్వం ఉన్న ప్లేస్ కూడా తెలుసు. అయినా ఒక్క ముక్క కూడా పోలీసులకు చెప్పలేదు. పార్టీ ప్రయోజనాలనే సర్వస్వంగా భావించిన నిజమైన కార్మికవర్గ నిజాయితీ కల్గిన యోధుడుగా తీవ్రచిత్రహింసలను ఎదుర్కొని, పోలీసులు చేసిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసాడు. ఫాసిస్టు నిర్బంధం రోజు రోజుకు తీవ్రతరమవుతున్న నేటి పరిస్థితులలో పార్టీ, ప్రజల ప్రయోజనాలు రక్షించడంలో కామ్రేడ్ నగేష్ చేసిన త్యాగం పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులందరికీ ఆదర్శం. కామ్రేడ్ నగేష్ ఆశయాలను తుదకంటా కొనసాగిద్దామని ప్రతిన బూనుదాం. ♣

# విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్సీకి వ్యతిరేకంగా చేపట్టిన కార్యకలాపాలు

**విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్సీ కార్యకలాపాలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు సమాచార యంత్రాంగా (ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్)న్ని బలోపేతం చేయడాన్ని ఒక వ్యూహాత్మక కర్తవ్యంగా చేపట్టాయి.

**1. భౌతిక పునాది**

పై వ్యూహాత్మక కర్తవ్యాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మన ఉద్యమ ప్రాంతంలో ఒక భౌతిక పునాది కూడా ఉంది. అంటే శత్రువుకు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేసుకొనేందుకు అనుకూలమైన వివిధ సంస్థలు, వివిధ సెక్షన్లు మన ప్రాంతంలో ఉన్నాయనేదే. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజా శత్రువులు, లుంపెన్ యువత, మత సంస్థలు, స్వచ్ఛంద సంస్థలలోని ముఖ్యులు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌కి భౌతిక పునాదిగా ఉంటున్నారు. వీరేకాకుండా మన పార్టీ, ప్రజా నిర్మాణాలలో ఉంటున్న కొద్దిమంది రహస్య జీవితానికి సిద్ధపడక, బహిరంగ జీవితం గడపటంలో భాగంగా సంతలకూ, బంధువుల ఇళ్ళకూ, ఇతర చోట్లకు వెళ్ళినప్పుడు శత్రువు చేతిలో పడి, విప్లవతత్వాన్ని కోల్పోయి, స్వార్థ ప్రయోజనాలతో శత్రువు నెట్‌వర్క్‌లో భాగమవుతున్నారు.

**2. పోలీసు అధికారుల నేతృత్వం**

స్థానిక ఎస్.ఐల నుంచి డి.ఐ.జి వరకు ఒకరికి తెలియకుండా మరొకరు తమ సొంత పర్యవేక్షణలో నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తున్నారు. వీరిలో ఎవరైనా పై స్థాయి పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీయగల్గితే వారికి ప్రమోషన్‌తోపాటు, లక్షలాది రూపాయల డబ్బులు దక్కుతాయి. దీంతో వీరు పోటీపడి పని చేస్తున్నారు. ఒక్కొక్కసారి అవసరాన్ని బట్టి టీంవర్క్ కూడా చేస్తున్నారు. మన ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంత పోలీసు అధికారుల మధ్య సమన్వయంతోపాటు, సమాచారం ఇచ్చిపుచ్చుకునే పద్ధతి అమలవుతున్నది. కేంద్ర బలగాలకు చెందిన అధికారులు కూడా ఈ సమన్వయంలో భాగమవుతున్నారు. వీరు ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేసేందుకు విచ్చలవిడిగా పైసలు ఖర్చు పెడుతున్నారు. ఉద్యమ ప్రాంతం నుంచి వివిధ పనుల నిమిత్తం తమను కలిసేందుకు వచ్చేవారి జేబులో పైసలు, చేతిలో మొబైల్ పెట్టడం సర్వసాధారణంగా మారింది. వారికి తమ మొబైల్ నంబర్ కూడా ఇస్తున్నారు.

**3. ఇన్‌ఫార్మర్స్-ఫంక్షనింగ్**

ఇన్‌ఫార్మర్స్‌గా తయారవుతున్న వారిలో వర్గ శత్రువులు, మత సంస్థలలోనీ, స్వచ్ఛంద సంస్థలలోని ముఖ్యులు ఉద్దేశ్యపూర్వకంగానే విప్లవోద్యమాన్ని దెబ్బతీసే లక్ష్యంతో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌లో భాగమవుతున్నారు. ఇక విడి వ్యక్తులుగా చూసినప్పుడు, అంటే లుంపెన్ యువత లాంటివారు పోలీసులిచ్చే డబ్బులకూ, విలాస జీవితానికి బానిసలై నెట్‌వర్క్‌లో భాగమవుతున్నారు. ఇక నిర్మాణాలలో పని చేస్తున్న వారిలో కొందరు బహిరంగ జీవితాన్ని వదులుకోలేక, శత్రు నిర్బంధానికి బెదిరి, ఇన్‌ఫార్మర్స్‌గా మారుతున్నారు. కొద్దిమంది పోలీసులు చూపే ఆర్థిక ప్రలోభాలకు గురై శత్రువు చేతిలో సాధనంగా మారుతున్నారు.

ఇలా తయారైనవారిలో రెండు రకాల వాళ్ళు ఉంటున్నారు. ఒక రకం వారు ఉద్యమ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పట్టణాలలో ఉంటూ, పూర్తికాలం (ఫుల్‌టైం వర్కర్) పని చేస్తున్నారు. వీరికి 15వేల వరకు జీతం ముడ్తున్నది. వీరు ఉద్యమ కార్యకర్తల సమాచారాన్ని సేకరించడమే కాకుండా, కొత్త వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి తెస్తున్నారు. మరో రకం వారు గ్రామీణ ప్రాంతంలో రహస్యంగా ఉంటూ, ఉద్యమ కార్యకర్తల సమాచారాన్ని సేకరించి పంపుతుంటారు. ఇటువంటి వారిపై పోలీసులకు నమ్మకం కుదిరితే ముగ్గురితో కూడిన నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీరికి కూడా నెలవారిగా 3వేల నుంచి 5వేల వరకు డబ్బు ముడ్తున్నది. ఏదైనా ఫలితం చూపిస్తే అప్పుడు మళ్ళీ కొంత డబ్బు ముడుతుంది.

పార్టీ, ప్రజా నిర్మాణాల నాయకత్వ క్యాడర్‌ల, కార్యకర్తల సమాచారాన్ని మొబైల్ ద్వారా పంపుతున్నారు. సాధారణంగా వీరే పోలీసు అధికారులకు నేరుగా సమాచారం పంపుతారు. కొన్ని సందర్భాలలో తమకు పై స్థాయిలో ఉన్న ఇన్‌ఫార్మర్ ద్వారా పోలీసులకు సమాచారం పంపుతారు. ఇటువంటి సమన్వయం కూడా ఉన్నది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఇన్‌ఫార్మర్లకు పని ప్రాంతాలను కేటాయించడంతోపాటు, పని విభజన చేస్తున్నారు. అంటే కొంత మంది మకాంలనూ, జాడల(బూట్ల అడుగులు)ను గుర్తిస్తే, ఆ సమాచారాన్ని మొబైల్ ద్వారా పోలీసులకు చేర్చే పనిని మరొకరు చేపడ్తారు. ఇలా వాళ్ళ పని విభజన ఉంటుంది.

గ్రామీణ స్థాయిలో పని చేస్తున్న ఇన్‌ఫార్మర్లు పోలీసు అధికారులను కలిసేందుకు దగ్గరి పట్టణాలలోని కొన్ని ప్రాంతాలను లైజాన్

పోస్టులుగా వాడుకుంటున్నారు. ఇటువంటి చోట్ల సంబంధిత పోలీసు అధికారులూ, పోలీసులు వచ్చి ఇన్‌ఫార్మర్లను కలిసి వెళ్తుంటారు.

**4. విస్తరణ**

ఉద్యమ ప్రాంతాలలోనే కాకుండా, ఉద్యమం విస్తరిస్తుందనుకుంటున్న ప్రాంతాలలోనూ, పార్టీ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ ప్రయాణాలకు ఉపయోగించుకుంటున్న ప్రాంతాలలోను ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తున్నారు. ఇటువంటి ప్రాంతాలలో కొద్దిమంది యువకులను రహస్యంగా హోంగార్డులుగా నియమించుకొంటున్నారు. ఇటువంటి వారు హోంగార్డులుగా బహిర్గతం కాకుండా వేరు వేరు పనులు చేస్తూ కవర్‌లలో ఉంటారు. వీరు పార్టీ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ సమాచారం తెలియగానే, పోలీసు అధికారులకు సమాచారం పంపుతారు. కితుబా, డాబగూడ ఎన్‌కౌంటర్‌ల లాంటివి ఇటువంటి ప్రాంతాలలోనే కవర్స్‌లో ఉన్న హోంగార్డుల ద్వారా జరిగి, 6గురు విలువైన కామ్రేడ్స్‌ను కోల్పోయాము.

**5. కేంద్రీకరణ**

సమాచార వ్యవస్థను ప్రధానంగా సి.సి, ఎస్.జడ్.సి నాయకత్వాన్ని దెబ్బతీసేందుకు కేంద్రీకరిస్తున్నారు. అనేక సందర్భాలలో స్థానిక దళాల సమాచారం ఉంటున్నా, దాడి చేయడం లేదు. కొన్ని సందర్భాలలో పై స్థాయి నాయకత్వం ఉందని తెలిసినా, తప్పకుండా దెబ్బతీయ గలుగుతామనుకుంటేనే దాడి చేస్తున్నారు. లేదంటే ఎంత సమయమైనా ఓపికగా ఉంటూ సమయం కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యమం ఎదుగుదలలో ఉన్నప్పుడు 'టైమ్‌బౌండెడ్' ప్రోగ్రాంగా సాధారణ కార్యకర్తలను సైతం సమాచారం ఉంటే విచ్చలవిడిగా చంపుతున్నారు.

**6. గందరగోళం సృష్టించడం**

ఎవరైనా ఇన్‌ఫార్మర్లు బయటపడినప్పుడు ఇంటరాగేషన్ సందర్భంగా వారి చేత మన నిర్మాణాలలోని వారిపేర్లనూ, సానుభూతిపరుల పేర్లనూ, నెట్‌వర్క్‌లో ఉన్నారని చెప్పించి వారిని మనచేతనే శిక్షించే విధంగా ప్లాన్‌లు రూపొందిస్తున్నారు. ఈ విధంగా పార్టీకి నష్టం చేయించడంతోపాటు, ప్రజలలో గందరగోళాన్నీ, భయోత్పాతాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.

**7. ఇతర రూపాలు**

కొన్ని గ్రామాలలో పోలీసులు విప్లవ ప్రతీఘాతుకులను ఆర్గనైజ్ చేసి, మన కామ్రేడ్స్ ఆ గ్రామాలకు వెళ్ళినప్పుడు దాడి చేసి, హత్య చేసే విధంగా వారిని సిద్ధపరుస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే విప్లవ ప్రతీఘాతుకులు జొంతిరాయికి వెళ్ళిన కామ్రేడ్ అడ్మాల్‌ను హత్య చేసి, జిప్రోను గాయపరిచారు.

బయట నుంచి మనం తెప్పించుకొనే చాలా వస్తువులలో (కంప్యూటర్, ఇన్వర్టర్, రేడియో, సోలార్, వాకీ వగైరా) జి.పి.ఎస్‌లను ఏర్పాటు చేసి, మన ఆచూకిని పసిగట్టి దాడులు చేస్తున్నారు. ఇందుకు మనకు వస్తువులను సప్లై చేసేవాళ్ళను ముందుగానే లోబరుచుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో మనకు బయటనుంచి వచ్చిన ఒక వస్తువులో జి.పి.ఎస్‌ను చొప్పించి దాని ద్వారా మన సమాచారం సేకరించి జులై 16 వతేదీ నుంచి 25లోపు శత్రువు 3 భారీ దాడులను చేపట్టాడు. ఈ దాడులలో మనం ఒక కామ్రేడ్‌ను కోల్పోయాం. ఇంకా ఇతర పాదార్థిక నష్టాలు జరిగాయి. పోలీసులు కొద్దిమంది చేత విష ప్రయోగాలు చేయిస్తున్నారు. మనకు బయటనుంచి వచ్చే మందులలో, ఆహారంలో స్లో పాయిజన్ కలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. నాయకత్వం దగ్గరకు వెళ్ళినప్పుడు అకస్మాత్తుగా 'వారి తుపాకులు తీసుకొని వారినే కాల్చిరండి' అని కొద్ది మందిని ప్రోత్సహిస్తున్నారు.

మొత్తంగా పైన చెప్పినట్లు, శత్రువు సమాచార యంత్రాంగాని(ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్)కి వ్యూహాత్మక ప్రాధాన్యతనిస్తూ, అనేక కుట్ర పద్ధతులు అనుసరిస్తూ, పార్టీకీ, పి.ఎల్.జి.ఎకీ, ప్రజా నిర్మాణాలకు అనేక నష్టాలు కల్గిస్తున్నాడు. విప్లవోద్యమ పురోగమనాన్ని అడ్డుకుంటున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజా ఇంటలిజెన్స్‌పై ఆధారపడి, జనవరి 2020 నుంచి జూన్ వరకు మల్కనగిరి-కొరాపుట్ బోర్డర్ డివిజన్, విశాఖ-ఈస్ట్ డివిజన్‌లలో కొంతమంది ఇన్‌ఫార్మర్‌లను శిక్షించడంతోపాటు, శత్రు నెట్‌వర్క్ కార్యకలాపాలను కొంతమేరకు స్థంబింపజేసాము. ఈ అనుకూలతను వినియోగించుకొని అన్ని ప్రాంతాలలో విప్లవ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహించాము.

***విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్స్‌ని దెబ్బతీయడంలో మన కృషి***

పై రెండు డివిజన్‌లలో ముందునుంచే, శత్రు నెట్‌వర్క్‌కు భౌతిక పునాదిగా ఉన్న శక్తులను నియంత్రిస్తూ వచ్చాము. ముఖ్యంగా వర్గ శత్రువులను అణచివేయడం, మత సంస్థలనూ, స్వచ్ఛంద సంస్థలను కట్టడి చేయడం, లుంపెన్ యువతను రాజకీయంగా తీర్చిమలుచుకొనేందుకు యువజన సంఘాలలోకి సమీకరించడం వంటి రకరకాల పద్ధతులు అనుసరించాము. అలాగే పార్టీ, ప్రజా నిర్మాణాలు, మిలీషియాలలోని ముఖ్యులను బహిరంగ, చట్టబద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండేలా, రహస్య, సమరశీల కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనేలా వారి పనిశైలిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించాము. ప్రజలలో విప్లవ ప్రతీఘాతుకులను ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ గురించీ, దానిని నియంత్రించాల్సిన అవసరం గురించి ప్రచారం చేసాము. అయినప్పటికీ విప్లవోద్యమం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ సమస్యను నిరంతరం ఎదుర్కొంటూనే ఉంది. అయితే మనం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను నియంత్రించడంలో చురుగ్గా పని చేసినప్పుడు అది తక్కువగానూ, మన కృషి మందకొడిగా ఉన్నప్పుడు అది లోతుల్లోకి వెళ్ళి విస్తరిస్తున్నది. ఏదైనా విప్లవోద్యమంలో ఎదురైన ఇటువంటి సమస్యలను పార్టీ, ప్రజలు కలిసి పరిష్కరించుకోవాల్సే ఉంటుంది. విప్లవ పురోగమనానికి మార్గాన్ని సుగమం చేసుకోవాల్సే

ఉంటుంది. ఇప్పటికే మనం చేపట్టిన కృషి ద్వారా కొన్ని ఫలితాలు సాధించినప్పటికీ, ఇది సరిపోదు. దీనిని మరింత అభివృద్ధి పరుచుకోవాలి. ముఖ్యంగా మిలటరీ ఇంటలిజెన్సీ నిర్మాణాలను ఏర్పర్చి బలోపేతం చేయాలి.

పై కృషి నేపథ్యంలో మనకు ప్రజల నుంచి ఇన్‌ఫార్మర్ల సమాచారం వస్తున్నది. ఇలా వచ్చిన ప్రాథమిక సమాచారాన్ని మరింత లోతుగా తెలుసుకొని సంబంధిత వ్యక్తులను ప్రజాకోర్టులో పెట్టడం జరుగుతున్నది. ఇన్‌ఫార్మర్లుగా గుర్తించబడిన వారిని వాళ్ళ తప్పులను దృష్టిలో ఉంచుకొని ప్రజల సమక్షంలోనే శిక్షలు వేయడం జరుగుతున్నది. సాధ్యమైన మేరకు ఇన్‌ఫార్మర్ల ప్రవర్తనలోనూ, వైఖరిలోను మార్పు తెచ్చేందుకు కృషి చేస్తూ, వారిపై ప్రజల పర్యవేక్షణ ఉండేలా ప్రయత్నిస్తున్నాము. ఇన్‌ఫార్మర్ల సమాచారం తెలిసిన వెంటనే స్పందించని సందర్భాలలో మనం తీవ్రమైన నష్టాలకు కూడా గురైనాము. ఇక నిర్దిష్టంగా ఈ 6 నెలల కాలంలో మనం చేపట్టిన చర్యలు

### మల్కనగిరి, కొరాపుట్ బోర్డర్ డివిజన్

1. మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా జొంత్రి పంచాయితీలోని తాబేరు, అర్లంగిపడ గ్రామాలకు చెందిన సాధు, లచ్చ, బుట్టి, నీలలు ఎ.పి ఎస్.ఐ.బి గైడెన్స్‌లో ఇన్‌ఫార్మర్స్‌గా పని చేస్తూ వచ్చారు. వీరంతా స్థానిక పార్టీ, ప్రజా నిర్మాణాలలో కీలకమైన వ్యక్తులుగా ఉన్నారు. వీరిలో అర్లంగిపాడు సాధు ముఖ్యుడు. ఇతను అరెస్టయి, లొంగిపోయిన విషయం ఎవరికీ అర్థం కాకుండా జాగ్రత్త పడుతూ ఈ నెట్‌వర్క్‌ను తయారు చేసాడు. వీరిచ్చిన సమాచారంతో శతృవు నాయకత్వాన్నీ, దళాన్ని దెబ్బతీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసాడు. కానీ మన కామ్రేడ్స్ ఆయా సందర్భాలలో గెరిల్లా నియమాలు పాటించడం వల్ల తృటిలో తప్పుకున్నారు. అయితే వీరి వ్యవహారం ప్రజలకు అనుమానం కలిగి పార్టీకి తెలియజేసారు. దీంతో పార్టీ ఒకసారి లచ్చను హెచ్చరించి వదిలివేసింది. అయినా అతడు డబ్బులకూ, విలాసాలకు మరిగి తన కార్యకలాపాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. చివరికి ఈ నలుగురి కార్యకలాపాలు పార్టీకి అర్థమై వీరిని ప్రజాకోర్టులో పెట్టింది. ఈ సభకు 350 మంది హాజరైనారు. ఇక్కడ ప్రజలిచ్చిన తీర్పుననుసరించి అర్గంగిపడ సాధు, తాబేరు లచ్చులకు మరణశిక్ష విధించడం జరిగింది. అర్లంగిపడ బుట్టి, తాబేరు నీలలను హెచ్చరించి వదిలివేయడం జరిగింది.

2. మల్కనగిరి జిల్లా, కొయ్యూరుపుట్ బ్లాక్, ఒంద్రాల్ పంచాయితీలోని, కాల్‌గూడ గ్రామంలో సోనియా అనేవాడు ఇన్‌ఫార్మర్‌గా తయారయ్యాడు. ఇతడు గతంలో పంచాయితీ వార్డ్‌మెంబర్‌గా పని చేసాడు. ఇతడు ఒడిశా ఇంటలిజెన్సీ డిపార్ట్‌మెంట్‌లోని రాజా (మాజీ మావోయిస్టు) గైడెన్స్‌లో 2018 నుంచి పని చేస్తూ వచ్చాడు. ఈ ప్రాంతం నుంచి గతంలో కట్టుమండ అనేవాడు పారిపోయి, కొయ్యిరుపుట్‌లో ఉంటూ, శతృవు ఏజెంటుగా పని చేస్తున్నాడు. సోనియా ఇతడి లింక్‌లో ఉంటూ, ఎప్పటికప్పుడు మన సమాచారాన్ని ఇతడి ద్వారా పోలీసులకు చేరుస్తున్నాడు. ఈ వ్యవహారమంతా 2018 నుంచి కొనసాగుతున్నది. అయితే ఈ విషయం మనకుగానీ, ప్రజలకుగాని అర్థం కాలేదు. 2020 ఫిబ్రవరి 14న ఈ గ్రామం వద్ద మన ముఖ్యమైన నాయకత్వ కామ్రేడ్స్ ఉన్న డేరాపై ఫైరింగ్ జరిగింది. దీంతో అప్రమత్తమైన గ్రామ ప్రజలు సోనియా కార్యకలాపాలపై నిఘా పెట్టి, అతడే ఈ సంఘటనకు కారణమనీ, ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని గుర్తించి పార్టీకి తెలియజేసారు. దీంతో పార్టీ ప్రజాకోర్టు నిర్వహించింది. ఈ సభకు 8 గ్రామాల నుంచి 350 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో అతడి కార్యకలాపాలన్నింటిని బహిర్గత పరిచి, ప్రజల నిర్ణయం మేరకు దేహశుద్ధి చేసి, చివరి అవకాశంగా గుర్తించాలని చెప్పి వదిలివేయడం జరిగింది.

3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముంచంగిపుట్ మండలం, రంగబయలు పంచాయితీలోని, జోడిగుమ్మ గ్రామంలో రతన్, సర్వీలు ఎ.పి ఎస్.ఐ.బి లింక్‌లోకి వెళ్ళారు. వీరిరువురు స్థానిక పార్టీ, మిలీషియా నిర్మాణాలలో ఉన్నవారే. సర్వి అనేవాడు తన సమీప బంధువైన అర్లంగిపడ సుక్ర అనే వాడి ప్రభావంతో నెట్‌వర్క్‌లోకి వెళ్ళాడు. అయితే 2018 మేలో సుక్ర కార్యకలాపాలు అర్థమై, పార్టీ అతడిని ఖతం చేసింది. ఇతను కూడా ఆ నాటికి స్థానిక పార్టీ నిర్మాణంలో పని చేస్తున్నాడు. సుక్రను ఖతం చేయగానే రతన్ తన కార్యకలాపాలను కొద్దికాలం ఆపుకొని తిరిగి ప్రారంభించాడు. సర్వి తన దగ్గరి బంధువైన క్రిష్టియన్ మత బోధకుడి ప్రభావంతో ఇన్‌ఫార్మర్‌గా మారాడు. ఈ మతబోధకుడు గతంలో ప్రజలపై ఒత్తిడి తెచ్చి, క్రిష్టియన్ మతంలో చేర్చేందుకు ప్రయత్నం చేస్తుండగా, ప్రజలే వీడిని గ్రామం నుంచి వెళ్ళగొట్టారు. అప్పటినుంచి వీడు పోలీసుల తోనే ఉంటూ, ఫుల్‌టైమ్ ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. వీడి ద్వారానే సర్వి కూడా ఇన్‌ఫార్మర్‌గా మారాడు. అయితే రతన్, సర్వీలు అత్యంత రహస్యంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చారు. రతన్ 4 సంవత్సరాల నుంచి ఈ పనిలో ఉండగా, సర్వి 1న్నర సంవత్సరం నుంచి ఈ పనిలో ఉంటున్నాడు. వీరు దాదాపుగా 5సార్లు మన దళం కదలికలను శతృవుకు చేరవేసారు. ఈ విషయాలన్ని మనకు అర్థమై విచారిస్తుండగా ఇరువురు పారిపోయారు. అయితే ప్రజలు చేసిన హెచ్చరికతో రతన్ తిరిగి వచ్చి తన తప్పులన్నింటిని ప్రజల సమక్షంలో ఒప్పుకొని గ్రామంలో ఉండేందుకు సిద్ధపడ్డాడు. ప్రజలు రతన్‌పై కొన్ని ఆంక్షలు పెట్టి, గ్రామంలో ఉండేందుకు ఆమోదించారు. సర్వి మాత్రం పోలీసులతోనే ఉండిపోయాడు.

4. మల్కనగిరి జిల్లా, గుమ్మ ఏరియా పరిధిలోని, టైమల్ గ్రామంలో సుక్కు, లైకోన్‌లు దాదాపుగా 2 సంవత్సరాల నుంచి శతృ నెట్‌వర్క్‌లో ఉంటూ, తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. టైమల్‌కు దగ్గరగా ఉన్న పిప్పలపోదూర్ గ్రామంలో బి.ఎస్.ఎఫ్ క్యాంపు పడటంతో వీరి విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు మరింత

పెరిగాయి. వీరి కార్యకలాపాల సమాచారాన్ని ప్రజల ద్వారా తెలుసుకున్న స్థానిక దళం మిలీషియాను జమచేసి, వారిరువురిని పట్టుకునేందుకు దాడి చేసింది. ఈ దాడిలో సుక్కు తప్పించుకోగా, లైకోన్ దొరికాడు. లైకోన్ తన తప్పులన్నింటిని ఒప్పుకొని, ఈ ఒక్కసారికి క్షమాబిక్ష పెట్టమని కోరగా, వాడిని ప్రజల ఆమోదంతో వదిలివేయడం జరిగింది.

5. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముంచంగిపుట్ మండలం, లక్ష్మీపూర్ పంచాయితీలోని, గరం గ్రామంలో జగబందు, సునోదార్ అనే ఇరువురు అన్నదమ్ములు ప్రజలపై రకరకాల పద్ధతుల్లో దోపిడీ పీడనలు కొనసాగిస్తుండటంతో స్థానిక సంఘం, మిలీషియా కలిసి వీరిరువురిపై విచారణ జరిపి, దేహశుద్ధి చేసాయి. వీరు గ్రామంలో ఆధిపత్య శక్తులుగా ఉంటూ, ప్రజలను క్రిష్టియన్ మతంలోకి చేరాలని ఒత్తిడి కూడా చేసారు. ప్రజలు వీరికి దేహశుద్ధి చేసిన తర్వాత కూడా వీరు ఏ మాత్రం బుద్ధి తెచ్చుకోకుండా గ్రామం వదిలివెళ్ళి, పోలీసులతో కలిసి ప్రజలపైనా, సంఘంపైన కత్తిగట్టారు. కొంతకాలం తర్వాత వీరు తిరిగి గ్రామం వచ్చారు. ఈ విషయం తెలిసిన పార్టీ చుట్టుపక్కల మిలీషియాను సమీకరించి, వీరిని పట్టుకునేందుకు గ్రామంపై దాడి చేసింది. ఈ దాడిలో జగబందు తప్పించుకోగా, సునోదార్ దొరికాడు. వీడిని ప్రజలలో విచారించి, తప్పులు ఒప్పించడం జరిగింది. ప్రజల ఆమోదం మేరకు కొన్ని ఆంక్షలు పెట్టి, గ్రామంలో బ్రతికేందుకు అవకాశం ఇవ్వడం జరిగింది.

6. ఒడిశా రాష్ట్రం, బైఫర్‌గూడ బ్లాక్, బాల్కొండ గ్రామానికి చెందిన క్రిష్ణ గతంలో సంఘంలో పని చేసి, శతృవుకు లొంగిపోయాడు. ఈ సందర్భంగా శతృవు చూపిన ప్రలోభాలకు గురై ఇన్‌ఫార్మర్‌గా తయారయ్యాడు. ఈ మధ్య కాలంలో ఆ ప్రాంతంతో స్థానిక దళానికి కొంత గ్యాప్ రావడంతో, క్రిష్ణ అరాచకాలు పెరిగిపోయాయి. ఈ అరాచకాలను భరించలేని గ్రామ ప్రజలు ఇతడిని అనేక సందర్భాలలో హెచ్చరిస్తున్నప్పటికీ, ఆ హెచ్చరికలను క్రిష్ణ పెడచెవిన పెడుతూ వచ్చాడు. దీంతో ప్రజలు ఈ విషయాన్ని పార్టీ దృష్టికి తేగా, పార్టీ ప్రజలతో కలిసి, అతడిని పట్టుకొని విచారించింది. అతడు తనకు శతృవుతో సంబంధాలు ఉన్న విషయాన్నీ, తన అరాచకాలను ఒప్పుకొని ప్రజల ముందు ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ప్రజలు ఇతడికి దేహశుద్ధి చేసి, బుద్ధి మార్చుకోమని చెప్పి వదిలివేసారు.

**విశాఖ-ఈస్ట్ డివిజన్**

1. విశాఖ జిల్లా (మే 2020), జిమాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ, అగ్రహంపాడు గ్రామానికి చెందిన తాబేలు కోటేష్ గ్రామాన్ని వదిలి జి.మాడుగులలో ఉంటున్నాడు. ఇతను అక్కడ పోలీసుల సంబంధంలోకి వెళ్ళి పార్టీకీ, ప్రజలకు వ్యతిరేకమైన కార్యక్రమాలు చేయడం మొదలు పెట్టాడు. అంతేకాకుండా ప్రజలు తమ అవసరాల రీత్యా మండల సెంటర్‌కి వెళ్ళినప్పుడు వారిని పోలీసులకు చూపించడం, బెదిరించడం చేస్తున్నాడు. ఈ విషయాలను పసిగట్టిన అగ్రహంపాడు ప్రజలు సంఘం నేతృత్వంలో అతడిని జి.మాడుగుల నుంచి పిలిపించవలసిందిగా కుటుంబానికి చెప్పారు. కుటుంబ ఒత్తిడితో కోటేష్ ప్రజాకోర్టుకు రాక తప్పలేదు. ఈ ప్రజాకోర్టుకు 5 గ్రామాల ప్రజలు హాజరై కోటేష్ తప్పులను నిలదీసారు. అతను తన తప్పులను ఒప్పుకోగా, ఒక సంవత్సరకాలం వరకు ఊరు విడిచి ఎటూ వెళ్ళడానికి వీల్లేదనీ, ఇంటిపట్టునే ఉండాలని ప్రజాకోర్టులో తీర్పు చెప్పారు.

2. మల్కనగిరి జిల్లా (మే 2020), చిత్రకొండ బ్లాక్, రాళ్లగడ్డ పంచాయితీ, చింతలధూలి గ్రామానికి చెందిన కొర్రసాలు అనే అతను గ్రామంలో మునసబు. ఇతను గతంలో వార్డు మెంబర్‌గా పని చేసాడు. ఇతడు గ్రామంలో ప్రజలను విప్లవమార్గం నుంచి దూరం చేసేందుకు బూటకపు ప్రభుత్వ సంస్కరణల దిశగా మళ్ళించడం ప్రారంభించాడు. అంతేకాకుండా ఇతను పోలీసులు నిర్వహించే జనమైత్రి శిబిరాలకూ, సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలకు హాజరవుతూ, తన గ్రామంలోని ప్రజలను కూడా తన వెంట తీసుకుపోవడం చేస్తున్నాడు. దీంతో స్థానిక సంఘం అతనితో మాట్లాడాలని నిర్ణయించి, ప్రజాకోర్టును ఏర్పాటు చేసింది. ప్రజలందరి సమక్షంలో అతడు తన తప్పులను ఒప్పుకున్నాడు. కొర్రసాలును ఒక సంవత్సరం వరకు గ్రామ పొలిమేర దాటడానికి వీల్లేదని ప్రజలు హెచ్చరిక చేసారు.

3. విశాఖ జిల్లా (మే 2020), జి.మాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ, చింతగుప్ప గ్రామానికి చెందిన గెమ్మెల సుబ్బారావు కొంతకాలం ఎ.వి.ఆర్.సి.ఎస్‌లో పని చేసాడు. దీనిలో పని చేస్తున్న క్రమంలోనే గంజాయి వ్యాపారిగా అవతారమెత్తాడు. ఈ విషయం తెలిసి సంఘం అతడిని నిర్మాణం నుంచి తొలగించింది. అయితే ఇతడు గంజాయి వ్యాపారం చేస్తున్న క్రమంలోనే పోలీసులకు దొరికి లొంగిపోయాడు. లొంగిపోవడమే కాకుండా శతృవుకు అనుకూలంగా మారి, జి.మాడుగులలో మకాం పెట్టాడు. ఈ సమయంలో రంగారావు (పోలీసు ఏజెంటు)తో స్నేహంగా ఉంటూ, పోలీసులవద్ద నుంచి బైక్‌ను తీసుకున్నాడు. ఈ విషయాలన్ని సంఘానికి తెలియడంతో అతడిని జి.మాడుగుల నుంచి గ్రామానికి రప్పించాల్సిందిగా కుటుంబంపై ఒత్తిడి తెచ్చారు. కుటుంబ ఒత్తిడితో సుబ్బారావు గ్రామానికి వచ్చిన తర్వాత ప్రజా పంచాయితీ నిర్వహించారు. ఆ పంచాయితీలో ఇతడు చేసిన తప్పులన్నింటిని బహిర్గతపరిచి ఒక సంవత్సరకాలంపాటు గ్రామంలోనే ఉండాలనీ, ఎలాంటి ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఈ ప్రజాకోర్టుకు మూడు గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

4. మల్కనగిరి జిల్లా (మే 2020), చిత్రకొండ మండలం, రాళ్ళగడ్డ పంచాయితీ, కొక్కులగడ్డ గ్రామానికి చెందిన కొర్ర ప్రవీన్ లుంపెన్‌గా తిరుగుతూ, గ్రామంలోని మహిళలతో అసభ్యంగా

ప్రవర్తించేవాడు. పనికోసం కంపెనీలకు వెళ్ళి కొద్దిరోజులు గడవకముందే తిరిగొచ్చేవాడు. ఈ క్రమంలో గంజాయి వ్యాపారం చేయడం మొదలుపెట్టాడు. ఈ వ్యాపారం చేస్తున్న సమయంలోనే పోలీసుల కంటపడ్డాడు. ఆ తర్వాత సరెండర్ అయి, రాళ్ళగడ్డ క్యాంపులోనే మకాం వేసాడు. అక్కడ ఉంటూనే మరో పెళ్ళి చేసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత భార్యతో కలిసి సొంతూరుకి వచ్చాడు. ఈ విషయాలన్నింటిని గమనించిన స్థానిక ప్రజారాజ్యా కమిటీ(ఆర్.పి.సి) ప్రవీణ్‌ను పట్టుకొని ప్రజాకోర్టు ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలందరి ముందు తన తప్పులను ఒప్పుకున్నాడు. ఆ తర్వాత ప్రవీణ్‌ను గ్రామం వదిలి ఎక్కడికి వెళ్ళకూడదనీ, ప్రజాకోర్టు తీర్పు ఉల్లంఘిస్తే ఆ తర్వాత జరిగే పరిణామలు సీరియస్‌గా ఉంటాయని హెచ్చరిక జారీ చేసింది.

5. మల్కనగిరి జిల్లా (జూన్ 2020), చిత్రకొండ మండలం, రాళ్ళగడ్డ గ్రామానికి చెందిన కొర్ర గంగినాయుడు, ఆనందరావులు గతంలో బెంజిబాబు, స్వామియల్ అరెస్టులకు కారకులుగా అనుమానం రావడంతో వారిని ప్రజల ముందు పెట్టి విచారించడం జరిగింది. ఆర్.పి.సి నేతృత్వంలో జరిగిన ఈ ప్రజాకోర్టుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ ప్రజాకోర్టులో వారు తమ తప్పులను అంగీకరించడంతో ప్రజలు వారిని 6 నెలల వరకు గ్రామం నుంచి ఎక్కడికి వెళ్ళకూడదని షరదు పెట్టారు.

6. విశాఖ జిల్లా (మే 2020), పెదబయలు మండలం, ఇంజరి పంచాయితీ, నానాబరి గ్రామానికి చెందిన వంతల సుత్తి నిరంతరం తాగడం, భార్యను ఇబ్బంది పెట్టడం చేస్తుండేవాడు. అయితే ఇతని భార్య ప్రజారాజ్యకమిటీలో సభ్యురాలు. ఆమె పాల్గొనే విప్లవ కార్యక్రమాలకు సుత్తి ఆటంకంగా ఉండేవాడు. ఈ క్రమంలో తన భార్యపైనా, ప్రజారాజ్య కమిటీ సభ్యులపైన వ్యతిరేకతను పెంచుకొని పోలీసుల చెంతకు చేరాడు. పోలీసుల దగ్గర సరెండర్ అయి, జి.మాడుగులలోని ఉన్న తన అన్న దగ్గర మకాం వేసాడు. సరెండర్ వార్త తెలుసుకున్న గ్రామస్తులు, స్థానిక కమిటీ సభ్యులు సుత్తిని పిలిపించారు. ప్రజాకోర్టు ఏర్పాటు చేసి నిలదీసారు. తన సరెండర్ విషయాలను బహిర్గతపరిచి, తన తప్పులను ఒప్పించారు. సంవత్సరకాలం పాటు ఎక్కడికి వెళ్ళకూడదని కండీషన్ పెట్టారు. ఈ ప్రజాకోర్టుకు ప్రజారాజ్య కమిటీ పరిధిలోని గ్రామాల ప్రజలు 400 వరకు హాజరైనారు.

7. విశాఖ జిల్లా (జూన్ 2020), జి.మాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ తరతల గ్రామానికి చెందిన వంతల సత్తిబాబు గ్రామంలోని మునసబు. గతంలో వీరి భూమి పంపకాలు కూడా జరిగాయి. అలాగే వీరి తమ్ముడు విజయ్, చెల్లి లలిత దళంలో పని చేసి సరెండర్ అయి శతృవు దగ్గరే ఉంటున్నారు. సత్తిబాబు కొడుకు రాజు కూడా శతృవు దగ్గరే ఉంటున్నాడు. 6నెలల క్రితం సత్తిబాబు జ్వరం అని చెప్పి వేరే గ్రామానికి వెళ్ళి అక్కడే ఉండిపోయాడు. ఈ కుటుంబంపై అనేక అనుమానాలు ఉన్న స్థానిక దళం, ప్రజలు సత్తిబాబుని గ్రామానికి పిలిపించారు. పంచాయితీ నిర్వహించి, తన కుటుంబ సభ్యులందరి గురించి వివరంగా అన్ని విషయాలు రాబట్టి, సత్తిబాబు కుటుంబంపై కొన్ని షరతులు విధించి గ్రామం నుంచి ఎటు వెళ్ళకూడదని హెచ్చరించారు. ♣

---

"క్యాడర్ల సరియైన విధానంలో యిమిడి ఉండే విషయాలు ఏమిటి?

మొదటిది: మన కార్యకర్తలను బాగా తెలుసుకోవడం. మన పార్టీలలో క్యాడరును గురించి పద్ధతి ప్రకారం క్షుణ్ణంగా తెలుసుకోవడం అనేది లేనేలేదు. ఈ మధ్యనే ఫ్రాన్స్, పోలెండ్ కమ్యూనిస్టు పార్టీలు, అటు తూర్పున చైనా కమ్యూనిస్టుపార్టీ ఈ విషయంలో కొంత మేరకు విజయం సాధించాయి. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ కూడా, అది రహస్య జీవితానికి పోకముందు, తన క్యాడరును గురించి అధ్యయనం చేయబూనుకొంది. ఈ పార్టీలు తమతమ బలగాలను శ్రద్ధగా అధ్యయనం చేయడం ప్రారంభించగానే అంతవరకూ ఎవరి దృష్టికి రాని అనేకమంది పార్టీ కార్యకర్తలు బయటికి పడినట్లు ఈ పార్టీల అనుభవంవల్ల తేలింది. ఇంకొక వంక, ఈ పార్టీలలో అప్పటివరకూ తలదాచుకుంటున్న అన్యవర్గ శక్తులను, సైద్ధాంతికంగా బలహీనంగా వున్నవారిని, రాజకీయంగా హానికరమైన వారిని వదిలించుకొని పార్టీని పరిశుభ్రం చేయడంకూడా మొదలయింది. ఒక్క ఉదాహరణ చూస్తే చాలు. ఫ్రాన్స్‌లో సేలర్, బార్బెల్ బోల్షివిక్ సూక్ష్మదర్శినితో పరీక్షించేసరికి వర్గశత్రువు ఏజెంట్లు అని తేలిపోవడంతో వారిని పార్టీ నుంచి తరిమేశారు. పోలెండ్, హంగరీ దేశాల్లో క్యాడర్ల తనిఖీ జరపడంవల్ల దొంగచాటుగా తమ నిజస్వరూపాన్ని కప్పి పెట్టుకుంటున్న శత్రు ఏజంట్ల ముఠాలు తేలిగ్గా బయటపడ్డాయి"

- కార్యకర్తల గురించి (కామ్రేడ్ డిమిట్రోవ్)

# విజయవంతమైన

# మార్చ్ 8 శ్రామిక మహిళా దినం



**మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా మార్చి 8ని జరుపుకున్న ఎమ్.కె.బి విప్లవ ప్రజానీకం**

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని ఎమ్.కె.బి, విశాఖ-ఈస్ట్ డివిజన్‌లలో విజయవంతం చేసాం. పాలక ప్రభుత్వాలు నిర్వహిస్తున్న దానికి భిన్నంగా పోరాటస్ఫూర్తితో నిర్వహించాము.

ఈ సంవత్సరం మహిళలపై కొనసాగుతున్న రాజ్యహింసకు వ్యతిరేకంగానూ, స్థానిక తెగ వ్యవస్థలో కొనసాగుతున్న పితృస్వామ్యానికి వ్యతిరేకంగాను క్యాంపెయిన్ తీసుకోవాలనే పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ఈ మార్చి 8ని నిర్వహించాము.

**మల్కనగిరి-కొరాపుట్ బోర్డర్ డివిజన్**

ఈ మార్చి8 ఒక నెల రోజులపాటు నిర్వహించాలని ఫిబ్రవరి నుంచి ప్రారంభించినప్పటికీ, తీవ్ర శతృనిర్బంధం వల్ల సాధ్యం కాలేదు. అయినప్పటికీ, ఉన్న సమయంలో ప్రజా నిర్మాణాలు, మిలీషియా మద్దతుతో 15రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడమైంది. ఏరియా వ్యాప్తంగా ఒడియా, తెలుగు భాషలలో కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం చేయడమైంది. ముఖ్యమైన సెంటర్‌లలో, సంతలలో ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. కటాఫ్ ఏరియాలోని మూడు చోట్ల బి.ఎస్.ఎఫ్ క్యాంపులు నిర్మించినప్పటికీ, ప్రజలు ధైర్యంగా సభలను జరుపుకున్నారు. 4 క్యాంపెయిన్ టీంలు 7 పాకెట్‌లలో దాదాపు 65 నుంచి 70 గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. 5 చోట్ల బహిరంగ సభలు నిర్వహించారు. జొంత్రి పాకెట్‌లోని జొంత్రి గ్రామంలో అమ్లిబెడ, తాబేరు, జొంత్రి గ్రామాలకు చెందిన దాదాపు 1850 మంది ప్రజలు హాజరు కాగా, మరో 200 మంది నది దాటలేక ఆగిపోయారు. అంద్రపల్లి పాకెట్‌లో దాదాపు 200 మంది, పనసపుట్ పాకెట్‌లో 250 మంది, ముకుడుపల్లి పాకెట్‌లో 260 మంది, కొసంపుట్ పాకెట్‌లో కాల్‌గూడ, కొసంపుట్ గ్రామాలకు చెందిన ప్రజలు దాదాపు 300 మంది వరకు హాజరయ్యారు. ఈ సభలలో ఎ.వి.ఎమ్.ఎస్ నుంచి, ఎ.వి.ఆర్.సి.ఎస్ నుంచి ప్రసంగించారు.

ఈ సభలలో మహిళలపై అమలవుతున్న రాజ్యహింసనూ, మహిళలకు వ్యతిరేకంగా ఉన్న తెగ సాంప్రదాయాలనూ, భూస్వామ్య, సామ్రాజ్యవాద విషసంస్కృతిని వ్యతిరేకిస్తూ తీర్మానించారు.

**విశాఖ-ఈస్ట్ డివిజన్**

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి 8ని విజయవంతం చేయాల్సిందిగా, బ్రహ్మణీయ హిందూ ఫాసిజం, రాజ్యం మహిళలపై అమలు జరుగుతున్న అమానవీయ హింస, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా పిలుపునిస్తూ డి.వి.సి పేరుతో పత్రికా ప్రకటన ఇవ్వడంతోపాటు, డివిజన్‌లోని పి.బి.ఎల్-కె.కె, జి.కె ఏరియాలలో పోస్టర్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాము. పెదబయలు-కె.కె ఎ.సి పరిధిలో సువ్వపల్లి పాకెట్‌లోని 7 గ్రామాల నుంచి 300 మంది ప్రజలతో సభను నిర్వహించాము. ఎ.సి సభ్యురాలు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మహిళలు రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడుతూనే, తెగలోని పితృస్వామ్యానికి వ్యతిరేకంగా కూడా ఐక్యంగా పోరాడాలనీ, అందుకు ఆదివాసీ విప్లవ మహిళా సంఘాలలో మహిళలు మరింతగా సంఘటితం కావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సభ అనంతరం మార్చి 1వ తేదీన ఈ పాకెట్‌లో ఎ.వి.ఎమ్.ఎస్ పాకెట్ కమిటీ నిర్మాణం జరిగింది. ఈ కమిటీకి ఎ.వి.ఎమ్.ఎస్ ప్రణాళికా -నిబంధనావళి, కర్తవ్యాలను ఒకరోజు క్లాసు నిర్వహించి, ఆ పాకెట్‌లోని మహిళా సంఘాలకు కన్సాలిడేషన్ కార్యక్రమం ఇవ్వడం జరిగింది.

- 'కోంద్రు' పాకెట్‌లో మార్చి 8 సభ నిర్వహణకు ఏర్పాటు జరుగుతుండగా మార్చి 7 నుండే పోలీసు బ్యాచ్‌లు ఆపరేషన్‌ను ప్రారంభించడంతో పాకెట్ స్థాయి సభను జరపలేకపోయాము. అయితే మార్చి 15న ఆ పాకెట్‌లోని ఎ.వి.ఎమ్.ఎస్ ప్రణాళిక, నిబంధనావళి, కర్తవ్యాలను క్లాసు చెప్పడం జరిగింది. తదుపరి ఈ కమిటీ, మరికొంత మంది మహిళలు కలిసి 15 మంది క్యాంపెయిన్ టీంగా ఏర్పడి మార్చి 8 స్ఫూర్తితో ఆ పాకెట్‌లోని గ్రామగ్రామాన మహిళా సంఘాల సమావేశాలు వేసి, మార్చి 8 ప్రాధాన్యతను వివరించడంతోపాటు, తెగలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా చర్చించారు. అలాగే ఆ పాకెట్‌లోని 3గ్రామాల్లో భార్యభర్తల మధ్య వచ్చిన పితృస్వామ్య సమస్యలను కూడా ఈ క్యాంపెయిన్ టీం పరిష్కరించడం జరిగింది.

ఈ సభల ప్రారంభానికి ముందు అన్నిచోట్ల భారీ ఊరేగింపులు నిర్వహించారు. 'మహిళలేని విప్లవం గేలువలేదు', మహిళ విముక్తి కోసం పి.ఎల్.జి.ఎలో చేరాలనీ, రాజ్యా నిర్బంధానికి వ్యతిరేరంగా పోరాడాలనీ, బహుభార్యత్వం, బాల్యవివాహాలను వ్యతిరేకించాలనీ, గ్రామాలపై పోలీసు దాడులను వ్యతిరేకించాలని మహిళలు అన్ని నిర్మాణాలలో భాగం కావాలని నినాదాలు చేసారు. ♣

> **"స్త్రీలు ఆకాశంలో సగం అన్నాడు మావో. ఆకాశంలోని ఆ సగభాగం కదలిక లేకుండా ఉన్నట్లైతే, పాత ప్రపంచాన్ని తుడిచివేయవలసిన విప్లవ తుఫానులు తెప్పచినుకులుగా మాత్రమే మిగిలిపోతాయి"**
>
> - క్లాడీ బ్రొయెల్ (చైనాలో స్త్రీవిముక్తి - 14వ పేజీ)

# రాజ్యాధికార లక్ష్యంతో

# పురోగమిస్తున్న వ్యవసాయక విప్లవ కార్యక్రమం



**విప్లవ సంస్కరణలలో భాగంగా చెరువులను తవ్వుకున్న విశాఖ-ఈస్ట్ డివిజన్ ప్రజలు**

'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజాకమిటీలకే అధికారం' అనే కేంద్ర నినాదంతో విప్లవ రైతుకూలిసంఘాలు గ్రామాలలో వర్గ విశ్లేషణ జరిపి ఆదివాసీ, ఆదివాసేతర భూస్వాములు, కొంత మంది తెగపెద్దలు ప్రజల నుంచి అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను వ్యవసాయ కూలి, పేదరైతాంగానికి పంపిణీ చేస్తున్నాయి. అలాగే సాగుభూమి తక్కువగా వున్న గ్రామాలలో భూమి చదును కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. వ్యవసాయ యోగ్యం కాని బీడుభూములను సైతం సాగులోకి తేవడానికి చెరువుల నిర్మాణం

చేపట్టి, భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయి. గతంలో భూస్వాముల నుంచి భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంపిణీ చేసిన చోట, సరైన వర్గ ప్రాతిపదికన జరగకపోవడంతో పునఃసమీక్షలు చేపట్టి, వర్గ ప్రాతిపదికన పునఃపంపిణీ కార్యక్రమం చేపట్టాయి.

### విశాఖ-ఈస్ట్ డివిజన్

కోరుకొండ ఏరియా, చింతలదూలి గ్రామంలో గ్రామ మునసబు గతంలో ప్రజల నుంచి ఆక్రమించిన సుమారు 10 ఎకరాల భూమిని, అదే గ్రామంలోని భూమిలేని 5 వ్యవసాయ కూలి కుటుంబాలకు విప్లవ రైతుకూలి సంఘం నాయకత్వంలో పంపిణీ చేసారు. ఇదే ఏరియాలో సువ్వపల్లి గ్రామ మునసబు తన రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించుకొని, ప్రజల నుంచి ఆక్రమించిన భూములు, అటవీ భూములను విప్లవ ప్రజా కమిటీ నాయకత్వంలో విచారణ జరిపి, అదనంగా ఉన్న 8 ఎకరాల భూమిని తిరిగి స్వాధీన పరుచుకొని, కొక్కులగడ్డ, సువ్వపల్లి గ్రామాలలోని భూమిలేని ప్రజలకు పంపిణీ చేసింది. అలాగే గతంలో ఇదే మునసబు నుంచి స్వాధీనం చేసుకున్న చెరువునూ, అందులోని పూడికను తీసివేసి, గ్రామ ప్రజలు సమిష్టిగా చేపల పెంపకానికీ, వ్యవసాయ సాగుకూ, ఎండకాలం పశువుల త్రాగునీటికి ఉపయోగించుకుంటున్నారు. కిష్టారం గ్రామ మాజీ సంఘ నాయకుడు, ప్రజా వ్యతిరేకి, విప్లవ ద్రోహి మల్లేషం 2 సంవత్సరాల క్రితం గ్రామం వదిలి కుటుంబంతో సహా పారిపోయి, శతృవు ఏజెంటుగా పని చేస్తున్నాడు. గ్రామంలో మల్లేషానికి ఒక ఇల్లు, పసుపు దొడ్డి, కాఫీ ప్లాంటేషన్, మరికొంత గరువు ఉంది. ఈ ఆస్తులను విప్లవ రైతుకూలిసంఘం నాయకత్వంలో స్వాధీనం చేసుకొని, మొదట సమిష్టిగా సాగుచేసారు. తర్వాత మల్లేషం ఇంటిని గ్రామంలో ఇల్లులేని ఒక పేద కుటుంబానికి ఇచ్చారు. ఆ మిగిలిన భూములను భూమిలేని ప్రజలకు పంపిణీ చేసారు. ఈతలపాడు గ్రామంలో సాగుయోగ్యం లేక నిరుపయోగంగా ఉన్న బీడు భూమిని, సంఘం నాయకత్వంలో గ్రామ ప్రజలందరు సమిష్టిగా నెలరోజులు పని చేసి, భూమిని చదునుచేసి, నీటి సౌకర్యం కల్పించి, పొలాన్ని సాగు చేసే విధంగా తయారు చేసారు. మొదటి 2 సంవత్సరాలు సమిష్టిగా సాగుచేసి, పండిన వరిపంటను సమానంగా పంపిణీ చేసుకున్నారు. తర్వాత సంఘం సుమారు 10 ఎకరాలు ఉన్న ఈ భూమిని గ్రామంలోని 17 కుటుంబాలకు పంపిణీ చేసింది.

పెదబయలు ఏరియాలోని కోంద్రు, ఇంజరి గ్రామాలలో విప్లవ ప్రజా కమిటీ నాయత్వంలో సుమారు 6 గ్రామాల ప్రజలు సమిష్టి భాగస్వామ్యంతో నెల రోజులు పని చేసి, 2 చెరువులను నిర్మించారు. ప్రస్తుతం ఈ చెరువులను ప్రధానంగా చేపల పెంపకానికి ఉపయోగిస్తున్నప్పటికీ, కొంత సాగు భూమికి కూడా నీరు అందుతున్నది. కోంద్రు పాకెట్‌లో అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులను సమిష్టి సహకార గ్రూప్‌ల పద్ధతిలో నిర్వహిస్తున్నారు.

రాళ్ళగడ్డ పాకెట్‌లోని రాళ్ళగడ్డ గ్రామంలో ప్రజలు సమిష్టి శ్రమ ద్వారా చెరువును తవ్వుకున్నారు. ఇదే గ్రామంలో గతంలో తీసిన చెరువులో ఆ గ్రామ ప్రజలంతా 3 రోజులు సమిష్టిగా శ్రమ చేసి, పూడిక తీసారు. రాళ్ళగడ్డ పాకెట్‌లో గత సంవత్సరం ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించుకునేందుకు ఈతలపాడు, చీకటిపల్లి, కొక్కులగడ్డ, గాజులమామిడి గ్రామాల్లో కొండల నుంచి నీటిని పైపుల ద్వారా తెచ్చారు. తాగునీటి నిర్వహణను మెరుగుపర్చడంలో భాగంగా గ్రామాల్లో కొళాయిలకు చుట్టూ సిమెంట్‌తో గచ్చులు వేశారు. ఈ పాకెట్‌లో ప్రజల సంక్షేమ నిధితో ఒక ధాన్యం మిల్లుని తీసుకువచ్చారు. ఈ మిల్లు రావటంతో చుట్టుపక్కల 3, 4 గ్రామాల ప్రజలు ముఖ్యంగా మహిళలు చాలా సంతోషించారు. మహిళల పని బారాన్ని తగ్గించేందుకు మంచినీళ్ళ పైపులు వేయడం, ధాన్యం మిల్లులు ఏర్పర్చడం వలన మహిళలు కొంత మేరకు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెసులుబాటు వచ్చింది.

### ఎమ్.కె.బి డివిజన్

కటాఫ్ ఏరియా, గురుశెట్టి గ్రామంలో సుండి (ఆదివాసేతర) భూస్వాముల నుంచి గతంలో సుమారు 300 ఎకరాల భూములను పార్టీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత భూపోరాటకమిటీ నాయకత్వంలో 6 గ్రామాలలోని సుమారు 200కు పైగా కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. మెజారిటీ భూమి ప్రస్తుతం సాగు చేసుకుంటున్నారు. అయితే తిరిగి ఈ 6 గ్రామాలలో మరోమారు వర్గ పరిశోధన చేపట్టి, భూమిలేని వ్యవసాయకూలి, పేద రైతాంగం కుటుంబాల వివరాలను సేకరించారు. అలాగే గతంలో జరిగిన భూపంపిణీని తిరిగి సమీక్షించారు. ఈ సమీక్షను స్థానిక పార్టీ కామ్రేడ్స్ ప్రజల వద్దకు తీసుకెళ్ళారు. గతంలో జరిగిన భూపంపిణీలో అక్కడక్కడ కొందరు భూమి కలిగి ఉన్నవారికి కూడా భూమిని ఇచ్చామనీ, కొందరు భూమిలేని వారికి భూపంపిణీ జరగలేదని గుర్తించారు. ఈ విషయంపై ప్రజల అభిప్రాయాలనూ, ఆమోదాన్ని తీసుకొని, భూమి కలిగి ఉన్న 30 కుటుంబాల భూములను తీసుకొని, గతంలో భూమి లభించని 30 కుటుంబాలకు పంపిణీ చేసారు. ప్రస్తుతం ఈ భూములన్ని సాగులోకి వచ్చాయి.

శతృవు ప్రజల విజయాలను వమ్ముచేసి, తిరిగి భూస్వామ్యాన్నీ, పాత తెగఆధిపత్య అభివృద్ధి నిరోధక అధికారాన్ని నిలబెట్టడానికి సాయుధ బలగాలను వినియోగించి, కార్పెట్ సెక్యూరిటీని విస్తరింపజేసి, పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలను నిర్మూలించే లక్ష్యంతో సైనిక దాడిని తీవ్రతరం చేసాడు. ఈ పరిస్థితుల్లో స్వాధీనం చేసుకున్న భూములనూ, సాధించుకున్న అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజలు సాయుధులు కావాల్సిన అవసరం పెరుగుతున్నది. ఈ లక్ష్యం దిశగా మన కార్యకలాపాలను మరింత పట్టుదలతో, సృజనాత్మకంగా ముందుకు తీసుకెళ్ళాలి. ♣

# ప్రజల ప్రతిఘటన

**ఎమ్.కె.బి డివిజన్**

**జొంతిరాయి గ్రామంలో పి.ఎల్.జి.ఎ సభ్యులపై విప్లవ ప్రతిఘాతుకుల దాడి, ప్రతిఘాతుకుల దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టిన విప్లవ ప్రజానీకం**



**జొంతిరాయి ప్రజలు మాకు శత్రువులు కాదంటూ,**
**విప్లవ ప్రతీఘాతుకులకు ప్రజల చేతిలో శిక్ష తప్పదంటూ హెచ్చరించిన కటాఫ్ ఏరియా ప్రజలు**

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో మన పార్టీ నాయకత్వంలో గత దశాబ్దకాలంగా ప్రజలు సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఆ పోరాటాన్ని రాజ్యాధికార లక్ష్యం దిశగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని ప్రజల అన్ని రకాల సమస్యలను పరిష్కరించుకొనేందుకు నవీన్ ప్రభుత్వానికీ, దాని కిరాయి పోలీసు బలగాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాల ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు. కొన్నింటిని స్వచ్ఛందంగా వారే పరిష్కరించుకున్నారు. ఈ క్రమంలో ప్రజానిర్మాణాలు, మిలీషియా, ఆర్.పి.సిలు, పార్టీ నిర్మాణాలు ఏర్పడి విప్లవకర ప్రజా పునాది బలోపేతం అయింది. దీంతో నవీన్ సర్కార్ బెంబేలెత్తి ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకొంటున్న పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని దెబ్బతీసేందకు ప్రత్యేకంగా కేంద్రీకరించింది. మొదట సాయుధ దాడినే ప్రధాన ఆయుధంగా ఎంచుకొని, పార్టీని నిర్మూలించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పోలీసు బలగాల సమన్వయంతో ఆపరేషన్ ఆలౌట్, ఆపరేషన్ విచ్ఛిన్నాంచల్ వగైరా పేర్లతో దాడిని తీవ్రతరం చేసింది. 2016 అక్టోబర్ 24న రాంగూడ భారీ ఎన్‌కౌంటర్ ద్వారా పార్టీకి తీవ్రమైన నష్టం చేసింది. అందులో స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్ కూడా 9 మంది అమరులయ్యారు. ఈ సంఘటన తర్వాత పార్టీ ఈ ప్రాంతంలో తుడిచి పెట్టుకు పోతుందని శత్రువు కలలుగన్నాడు. కాని ఈ అమరత్వాలను స్ఫూర్తిగా తీసుకొని, శత్రువు కలలను కల్లలు చేస్తూ, ఉద్యమం మరింత సంఘటితంగా, చురుకుగా పురోగమించింది. దీని కొనసాగింపుగా ప్రజలు ఈ ప్రాంత అభివృద్ధిని డిమాండ్ చేస్తూ, విశాల ప్రజల ఐక్య వేదికను నిర్మించుకొని పోరాడుతున్నారు.

ఈ సారి ప్రభుత్వం తన ఎత్తుగడలలో సంస్కరణలను ముందుపెట్టి, సాయుధ దాడిని జోడించి అమలు పరచపూనుకున్నది. కటాఫ్‌లోకి సాయుధ బలగాలు, ప్రభుత్వ యంత్రాంగం చొచ్చుకు రావడానికి వీలుగా 200కోట్లు ఖర్చు పెట్టి, అతిపెద్ద గురుప్రియ బ్రిడ్జిని సాయుధ బలగాల రక్షణలో నిర్మించింది. ఆ తర్వాత కటాఫ్ ఏరియా అభివృద్ధి పథకం అంటూ, 100 కోట్ల ప్రత్యేక ప్యాకేజిని కేటాయించి, ఈ ప్రాంతానికి స్వాభిమానాంచల్ అనే నామకరణం చేసింది. ప్రభుత్వం ప్రధానంగా ఈ 100కోట్లను రోడ్లు, ప్రభుత్వ పాలన భవనాల నిర్మాణం కోసం ఖర్చు పెట్టాలనే పథకం వేసుకున్నది. ప్రజలు ఈ ప్రాంతంలోని మౌలిక సమస్యలను ముందుంచి, వాటిని ఎలా ఖర్చు చేయాలో డిమాండ్ చేస్తూ, ఒక పోరాట సంఘాన్ని ఏర్పర్చుకొని, ఆ డిమాండ్‌లను ప్రభుత్వం

ముందుంచారు. రోడ్లకూ, ఇతర కమ్యూనికేషన్, పాలన వ్యవస్థల పటిష్టానికై అనుమతి నివ్వమని తేల్చి చెప్పారు. కొత్తగా ఈ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన పోలీసు క్యాంపులను వ్యతిరేకించారు. దీనితో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సరికొత్త కుట్రలకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా మన నిర్మాణబలం, ప్రజాపునాది సాపేక్షికంగా బలహీనంగా ఉన్న జొడాంబ, జొంతిరాయి గ్రామాలను ఎంచుకొని, విప్లవ పోరాటంలో భూములు కోల్పోయిన భూస్వాములనూ, అధికారం కోల్పోయిన కొందరు తెగపెద్దలు వారి కుటుంబాలనూ, ప్రభుత్వ పథకాల లబ్ధిపొందిన వారినీ, పోలీసు కుటుంబాలనూ, కొందరు లుంపెయిన్ యువకులనూ, ప్రజా వ్యతిరేకులను రహస్యంగా కూడగట్టే పనిని చేసింది. ఈ పనికి పోలీసు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు నేతృత్వం వహించారు. వీరు ఆ రెండు గ్రామాల ప్రజలను బెదిరించి, అదిరించి రకరకాల పద్ధతుల్లో తమ ప్రభావంలోకి తెచ్చుకున్నారు. ఈ పరిణామాలను స్థానిక నాయకత్వం లోతుగా పరిశీలించి అర్థం చేసుకోలేక పోయింది. ప్రజల నుంచి ఆ రెండు గ్రామాలకు సంబంధించిన ప్రమాదాన్ని వ్యక్తం చేసినప్పటికీ, సీరియస్‌గా పరిగణించలేదు.

పై పరిస్థితుల్లో 25 జనవరి, 2020న మనదళం ఒక గ్రామానికి వెళ్ళగా, జొంతిరాయి గ్రామానికి చెందిన ప్రతిఘాతుక ముఠాలోని ఒకవ్యక్తి అక్కడికి వచ్చి వెళ్ళాడని తెలిసింది. ఈ విషయాన్ని క్లియర్ చేసుకోవడానికి మన దళ సభ్యుడు కొద్ది మంది మిలీషియాతో జొంతిరాయికి వెళ్ళాడు. అప్పటికే ఒక పథకం ప్రకారం దాడి చేయడానికి సిద్ధంగా ఉన్న విప్లవ ప్రతిఘాతుకులు మనవాళ్ళను బంధించారు. పోయిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో, మరో ఎ.సి.ఎమ్ మరికొంత మంది మిలీషియాను తీసుకొని అదే గ్రామానికి వెళ్ళాడు. అప్పటికే జొడాంబ, జొంతిరాయిలో ప్రజలను రెచ్చగొట్టి, భయపెట్టి అందరిని అక్కడికి చేర్చిఉన్నారు. 2వసారి వెళ్ళిన ఎ.సి.ఎమ్‌ను మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వకుండా దాడి చేసి, విపరీతంగా కొట్టి బంధించారు. విప్లవ ప్రతీఘాతుకులు కామ్రేడ్ అడ్మాల్‌ను హత్య చేసి, కామ్రేడ్ జిప్రో(ఎ.సి.ఎమ్)ను బంధించి పక్కనే ఉన్న పోలీసు క్యాంపుకు అప్పగించారు. ఈ సంఘటన పోలీసు అధికారుల పర్యవేక్షణలో జరిగింది. దీనిని ప్రజల ప్రతిఘటనగా శతృవు ప్రచారం చేసుకున్నాడు. ఈ విషయం రాత్రికిరాత్రే అన్ని గ్రామాలలో ప్రచారం అయింది. కోపోద్రిక్తులైన వందలాది మంది ప్రజలు తెల్లవారుఝామున 4గం॥ల నుంచే సాంప్రదాయక ఆయుధాలు ధరించి తరలిరావడం ప్రారంభమైంది. ఉదయం 6గం॥లకు సుమారు 2వేల మంది ప్రజలు జొంతిరాయి గ్రామ పరిసరాలకు చేరుకున్నారు. అప్పటికే హంతకులను రక్షించడానికి పోలీసు బలగాలు మోహరించాయి. కొపోద్రిక్తులైన ప్రజలు జొడాంబ గ్రామంపై దాడి చేసి, విప్లవ ప్రతిఘాతుకుల, భూస్వాముల, ప్రజా వ్యతిరేకుల ఇళ్ళను కూల్చారు, వారి ఆస్తులను ధ్వంసం చేసారు. సాధారణ ప్రజలకు మేము వ్యతిరేకంకాదని ప్రకటించారు. అదేరోజు ఈ సంఘటనను నిరసిస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఆ రోజే జొడాంబ, జొంతిరాయి గ్రామాలకు పోలీసు రక్షణలో జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి విప్లవ ప్రతిఘాతుకుల ఆస్తులకు రెట్టింపు నష్టపరిహారం చెల్లించారు. వారి రక్షణకు పోలీసు క్యాంపును ఏర్పాటు చేసారు. గత 10సం॥రాలుగా ప్రజలు తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ పోరాడినప్పుడు ఏనాడు కలెక్టర్‌లు ప్రజల సమస్యల పరిష్కారానికి కనీస ప్రకటనలు కూడా చేయలేదు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎవరిని రక్షిస్తున్నాయో ప్రజలు పోరాట ఆచరణ నుంచి మరింతగా రాజ్యవర్గ స్వభావాన్ని అర్థం చేసుకున్నారు.

ఈ సంఘటన జరిగిన 2వ రోజు ప్రజలు సుమారు 4వేల మంది ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ, హంతకులను శిక్షించాలనీ, పోలీసు క్యాంపును వెంటనే ఎత్తివేయాలనీ, గాయపడి ప్రస్తుతం పోలీసు కస్టడిలో ఉన్న జిప్రో (ఎ.సి.ఎమ్)ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రదర్శన నిర్వహించారు. పత్రికా విలేఖరులను పిలిచి, సంఘటన వాస్తవాలను వెల్లడించారు. జొడాంబ, జొంతిరాయిలోని సాధారణ ప్రజలు మాకు శతృవులు కారనీ, వారు ఏరియాలోని మిగిలిన ప్రజలతో కలిసి పోరాడాలనీ, విప్లవ ప్రతిఘాతకులను శిక్షిస్తామని ప్రకటించారు. 100కోట్ల ప్రత్యేక ప్యాకేజి ప్రజా సమస్యల పరిష్కారానికి కాదనీ, పోలీసు, పాలన యంత్రాంగాన్ని బలోపేతం చేసి, పోరాడే ప్రజలపై అణచివేతను అమలు చేయడానికేనని ఖండించారు. వాటికి వ్యతిరేకంగా పోరాడుతామని ప్రకటించారు.

### సిమిలిపొదూర్ గ్రామ సంఘ నాయకత్వం అరెస్టుకు నిరసన

సిమిలిపొదూర్ సంఘ నాయకత్వాన్ని పోలీసులు మాటుకాసి పట్టుకొని, తీవ్ర చిత్రహింసలకు గురి చేసి, తమ వెంట పట్టుకెళ్ళారు. ఈ విషయం తెలిసిన సిమిలిపొదూర్, బియ్యాన్‌కుడి, కొజ్జరగూడ, ముక్కుడుపల్లి, సిందిపుట్ తదితర గ్రామాలకు చెందిన 10 వేల మంది ప్రజలు రకరకాల పద్ధతుల్లో తమ నిరసన తెలియజేసారు. పోలీసు క్యాంపులు ఎత్తివేయాలనీ, అక్రమ అరెస్టులను నిలిపివేయాలనీ, గ్రామాలపై పోలీసుల దాడులను ఆపివేయాలని డిమాండ్ చేసారు. చివరకు పత్రికా విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి, పోలీసులు చేస్తున్న అరాచకాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఇచ్చిన రకరకాల వస్తువులను విలేఖర్ల ముందే తగులబెట్టారు.

### సంఘ నాయకత్వాన్ని రక్షించుకొన్న సిర్లిమెట్ట గ్రామ ప్రజలు

జూన్ చివరి వారంలో ఆంధ్ర పోలీసులు సంఘ నాయకత్వాన్ని అరెస్టు చేసేందుకు సిర్లిమెట్ట గ్రామంపై దాడి చేయగా, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో ఆంధ్ర, ఒడిశా గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ప్రజల ప్రతిఘటన ముందు తోకముడిచిన పోలీసులు సంఘ నాయకత్వాన్ని వదిలివెళ్ళక తప్పలేదు. ఈ సంఘటన తర్వాత ఆ ప్రాంత ప్రజలు పత్రికా విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి, పోలీసుల అరాచకత్వాన్ని ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను సూటిగా విమర్శిస్తూ మాట్లాడారు.

పోలీసు క్యాంపుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న ప్రజలు





## కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా నిర్మిస్తున్న పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా మీటింగ్ జరుపుకున్న కటాఫ్ ఏరియా ప్రజలు

మల్కనగిరి జిల్లా (జూన్ 2020), కటాఫ్ ఏరియాలో ఒడిశా ప్రభుత్వం పార్టీనీ, ప్రజా ఉద్యమాలను నిర్మూలించే లక్ష్యంతో, కేంద్ర అర్థసైనిక బలగాల(బి.ఎస్.ఎఫ్)తో కార్పెట్ సెక్యూరిటీని చాలా వేగంగా విస్తరింపజేస్తూ, నూతనంగా పోలీసు క్యాంపులను ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా జాంగూడ గ్రామం వద్ద క్యాంపు నిర్మాణం కోసం పోలీసు అధికారులు స్థలం ఎంపిక చేయడానికి పూనుకున్నారు. ఈ విషయంపై ఆ ప్రాంతంలో 30 గ్రామాలకు చెందిన సుమారు 2వేల మంది ప్రజలు జూన్ నెలలో సింగోయి గ్రామం వద్ద సమావేశమై 'పోలీసు క్యాంపు నిర్మాణానికి ప్రజలెవరూ స్థలం ఇవ్వకూడదనీ, వారికి సహకరించకూడదనీ, బలవంతంగా పెట్టడానికి ప్రయత్నిస్తే ప్రజలందరు సామూహికంగా ప్రతిఘటించాలనీ, ఇప్పటికే ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులను వెంటనే ఎత్తివేయాలనీ, పోలీసులు గ్రామాలపై దాడులను మానుకోవాలినీ, అడవులలో కూంబింగ్‌లు వెంటనే నిలిపివేయాలనే' డిమాండ్‌లను తీర్మాణించారు. సాంప్రదాయక ఆయుధాలు ధరించి క్యాంపుల నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతికా విలేఖరులను పిలిచి తమ డిమాండ్‌లను ప్రకటించారు. ♣

### విశాఖ-ఈస్ట్ డివిజన్

### పోలీసులు పట్టుకెళ్ళిన తమ ప్రజలను విడిపించుకున్న పెదబయలు-కోరుకొండ ఏరియా ప్రజలు

◆ 2020 జనవరి 19 నుంచి 26 వరకూ పెదబయలు -కోరుకొండ ఎ.సి పరిధిలో శత్రువు ఏరియా డామినేషన్ తీసుకున్నాడు. ఈ సందర్భంగా 20వ తేదీ ఉదయం నీరుమామిడి అనే గ్రామంలో ఆ రోజు ఒక ఫంక్షన్ కోసం అవసరమైన వంట పాత్రలను తెచ్చుకోవడానికి నలుగురు గ్రామస్తులు సింగవరం అనే గ్రామానికి వెళ్ళి వంటపాత్రలను తీసుకొని తిరిగి వస్తుండగా దారిలో వున్న ఒక పోలీసు బ్యాచ్ వీరిని పట్టుకున్నది. మావోయిస్టుల కోసమే వంట పాత్రలు తీసుకువెళుతున్నారని వీరికి పక్కకు తీసుకుపోయి ఇంటరాగేషన్ చేయడం మొదలుపెట్టారు. ఈ లోపు వంట పాత్రలకు వెళ్ళినవారు ఎంతకూ తిరిగి రాకపోవడంతో, చుట్టుపక్కల పోలీసు బ్యాచ్‌లు కూడా వచ్చిన విషయం అర్థమయిన నీరుమామిడి ప్రజలు ఫంక్షన్‌ను ఆపుకుని, ఫంక్షన్‌కు వచ్చిన వారినీ, పక్కనే ఉన్న దగుడుపల్లి గ్రామ ప్రజలను కలుపుకొని తమ వారికోసం కొండలన్నీ వెతకడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే వీరికి తమ పక్క గ్రామమైన గజ్జెడి గ్రామంలో వంటలు చేసుకుంటున్న ఒక పోలీసు బ్యాచ్ తారసపడింది. ప్రజలందరూ తమ వారిని ఎక్కడ పెట్టారో చెప్పాలనీ ఆ బ్యాచ్‌తో ఘర్షణకు దిగారు. పోలీసుల వంట ఏర్పాట్లను, వంట పాత్రలను చెల్లాచెదురుగా పడవేశారు. వంటలు చేసుకోనీయకుండా అడ్డుకున్నారు. ముఖ్యంగా మహిళలు గొడ్లను కట్టే తాళ్ళతో నలుగురు పోలీసులను కట్టివేయటానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ఘర్షణలో మహిళల గాజులు పగిలి పోలీసుల చేతులకు గాయాలయ్యాయి. పోలీసులు మహిళలను గట్టిగా నెట్టడానికి ప్రయత్నిస్తే పురుషులు కర్రలతో పోలీసులపై దాడికి దిగారు. తమవారు నలుగురిని విడిచిపెడితేనే మిమ్మల్ని విడిచిపెడతామని ఆ బ్యాచ్‌ను ఎక్కడికీ కదలనీయకుండా చుట్టూ కూర్చున్నారు. ఈ ఘర్షణ ఉదయం 10 గం॥ నుంచి సాయంత్రం 5గం॥ల వరకు జరిగింది. ప్రజలు ఆకలితో, ఆగ్రహావేశాలతో పోలీసులను కూడా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టనీయలేదు. చివరకు పోలీసులు ఫోన్లద్వారా ఈ విషయాన్ని తెలియజేసుకొని మరో బ్యాచ్ వచ్చి తమ వారిని విడిచిపెట్టిన తర్వాతనే ప్రజలు తమ వారిని తీసుకొని పోలీసులను వదిలిపెట్టారు.

◆ 2020 మార్చి 8వ తేదీ మధ్యాహ్నం 3గం॥ల సమయానికి కోంద్రు గ్రామానికి చెందిన నలుగురు సెల్ సిగ్నల్ పాయింట్ దగ్గరకు ఫోన్ చేయడం కోసం వెళ్ళారు. వీరిని గమనించిన పోలీసులు పట్టుకోవటానికి దగ్గరకు రావటంతో ఆ నలుగురిలో ఒకరైన మిలీషియా కమాండర్ వేగంగా పరుగెత్తి తప్పించుకుని

వెళ్ళిపోగలిగాడు. మిగతా ముగ్గురిని పోలీసులు పట్టుకుని వారి ఆధార్‌కార్డు వగైరాలు చెకింగ్ చేసి, ఇద్దరిని విడిచిపెట్టారు. అయితే తప్పించుకున్న మిలీషియా కమాండర్ తాలుకు ఫోన్‌ను పట్టుకుని ఉన్న లక్ష్మణ్ అనే యువకుడిని మాత్రం వదిలిపెట్టకుండా తమతో తీసుకుని వెళ్ళిపోయారు. తప్పించుకున్న వారి ద్వారా సమాచారం తెలుసుకున్న కోంద్రు, నానాబరి గ్రామాల ప్రజలంతా కత్తులు, గొడ్డళ్ళతో కేకలు వేసుకుంటూ బిడింగ్‌ల మీదకు ఎక్కి పోలీసుల కోసం వెతకడం మొదలుపెట్టారు. అప్పటికే లక్ష్మణ్‌ను దూదిపల్లి అనే గ్రామ పరిసరాలలో పెట్టి, ఇంటరాగేషన్ చేస్తున్న పోలీసులకు తమ చుట్టు ఉన్న అన్ని కొండల నుండీ జనం కేకలు, అరుపులతో రావడం కనిపించింది. అంతలోనే లక్ష్మణ్ తండ్రి కూడా పెద్ద గొడ్డలి పట్టుకుని "నా కొడుకుని ఎందుకు తెచ్చారు? మీకు తుపాకీ ఉంటే నాకు గొడ్డలి ఉంది" అంటూ ఎత్తడంతో చుట్టుపక్కల నుండి జనాలు కూడా దగ్గరకు రావడంతో పోలీసులు లక్ష్మణ్‌ను వదిలిపెట్టి పరుగులంకించుకున్నారు. దమ్ముంటే ఆగండిరా అని ప్రజలు కొంత దూరం వెంటబడ్డారు. అప్పటికే చీకటి కావడంతో లక్ష్మణ్‌ను తీసుకుని ప్రజలు వెనుదిరిగారు. అయితే మళ్ళీ మరుసటి రోజు కూడా పోలీసులు తీసుకుపోయిన ఫోన్ కోసం ఎక్కడ పోలీసు బ్యాచ్ కనబడిన ఘర్షణకు దిగి, ఆ ఫోన్‌ను లాక్కోవాలనే ఆలోచనలో కోంద్రు పాకెట్‌లోని 5 గ్రామాల ప్రజలు కొండలన్నీ వెతికినప్పటికీ, పోలీసు బ్యాచ్‌లు ఎక్కడా కనబడకపోవడంతో వెనక్కువచ్చారు. ఈ రెండు సందర్భాల్లో తమ వాళ్ళను విడిపించుకోవటానికి పోలీసులతో ప్రజలు ఘర్షణ పడటం, ప్రతిఘటించి విడిపించుకోవడం మిగతా గ్రామాల ప్రజలలో కూడా మంచి ప్రభావాన్ని, నైతిక స్థైర్యాన్ని పెంచాయి. ♣

## ఎమ్.కె.బి. డివిజన్ ఇతర కార్యక్రమాలు

### 1. ఆధిపత్య శక్తులను దేహశుద్ధిచేసిన మిలీషియా, ప్రజలు (ఫిబ్రవరి-2020)

కటాఫ్ ఏరియాలో కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా, పోలీస్ క్యాంపులను దగ్గర దగ్గరగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే మూడు క్యాంపులను నిర్మించారు. మరికొన్ని క్యాంపులను నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో దెబ్బతిన్న ఆధిపత్య శక్తులు, అరాచక శక్తులు తమ ఆధిపత్యాన్ని, దోపిడీని తిరిగి కొనసాగించుటకు ప్రయత్నాలు ప్రారంభించారు. శత్రు నిర్బంధాన్ని అతిగా ప్రచారం చేస్తూ, గ్రామాల్లో సంఘాలు నిలబడవనీ, గ్రామాలపై పోలీస్ దాడులు పెరుగుతాయనీ, పార్టీ ఇక్కడ నుంచి వెళ్ళిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజల్లో విశ్వాసం కోల్పోయేలా చేస్తున్నారు. కొద్ది మంది సంఘ నాయకులను బెదిరించడం, ప్రజలపై దౌర్జన్యం చేయడం, సంఘాల్లో చురుకుగా కదులుతున్న మహిళలను నిరుత్సాహ పరిచేలా ఎగతాళి చేయడం, తిట్టడం చేస్తున్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక అరాచక శక్తులను ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంతలో మిలీషియా, ప్రజలు కలిసి దేహశుద్ధి చేసారు.

☆ మల్కనగిరి జిల్లా, గుమ్మ ఎ.సి పరిధిలోని, పనసపుట్ పంచాయితీ, తపలగూడ గ్రామానికి చెందిన సుబ్బారావు, అర్జున్‌లను దేహశుద్ధి చేయగా, అంద్రపల్లి పంచాయితీకి చెందిన దన్ను, కిల్లో, భీమాలను ప్రజల్లో పెట్టి హెచ్చరించారు.

☆ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముంచంగిపుట్ మండలం, రంగబయలు పంచాయితీ, పడాల్‌పుట్‌కు చెందిన జగ్గు, రాజులను విచారించి, వారిలో ఒకరికి దేహశుద్ధి చేసారు. కుముడ పంచాయితీ, కిముడుపుట్ గ్రామానికి చెందిన రాము, బొందులతోపాటు, మరో ఇద్దరిని హెచ్చరించారు.

మొత్తం ఈ కార్యక్రమాలు ఫిబ్రవరి నెలలో క్యాంపెయిన్ రూపంలో ఆయా పాకెట్‌లలోని ఎ.వి.ఆర్.సి.ఎస్, ఎ.వి.ఎమ్.ఎస్, మిలీషియా, కలిసి నిర్వహించాయి. ఈ ఘటనల అనంతరం ఏరియాలో మంచి ప్రభావం పడింది. దీని ప్రభావంతో పోలీస్ క్యాంపులకు సమీపంలో ఉన్న దార్లబెడతోపాటు, సిర్లమెట్ట, గుసాంపాదూర్ మరికొన్ని గ్రామాలలో ప్రజలు ఆధిపత్య శక్తులను నిలదీయడం, హెచ్చరించడం చేసారు.

### 2. మహిళపై జరుగుతున్న దౌర్జన్యాలు, అఘాయిత్యాలపై ప్రజా కోర్టులు (మార్చి - 2020)

☆ మల్కనగిరి జిల్లా, గుమ్మ ఎ.సి పరిధిలో, అంద్రపల్లి పంచాయితీ, గుసాంపాదూర్ గ్రామంలో స్వంత కూతురుపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకి చెబితే చంపుతానని కూతురిని బెదిరించాడు. కొన్ని నెలలకు ఆ మహిళా గర్భవతి కావడంతో, కుటుంబంవారు ఆమెని ప్రశ్నించారు. ఆమె ఈ తప్పుకు తండ్రిదే బాధ్యత అని చెప్పింది. దీంతో ఈ విషయం సంఘం దృష్టికి వచ్చింది. గ్రామంలోని ఎ.వి.ఎమ్.ఎస్ గర్భవతి అయిన మహిళతో విషయాలన్నింటిని మాట్లాడింది. జరిగిన విషయాలన్నింటిని ఆ మహిళ సంఘంవారితో పంచుకోవడంతో తండ్రిని హెచ్చరించి వదిలేసారు. కొన్నాళ్ళకు ఆ మహిళా బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత వేరే గ్రామానికి చెందిన వ్యక్తి ఆమెని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. విషయం తెలుసుకున్న తండ్రి అతడిని బెదిరించి, తన కూతురును ఎవరికి ఇవ్వననీ, తన దగ్గరే పెట్టుకుంటాననీ, పెళ్ళి చేసుకోవడానికి ఎవరైనా వస్తే వారిని చంపుతాననీ, మంత్రాలు చేస్తానని బెదిరించాడు. తన కుటుంబ సభ్యులు చెప్పినప్పటికీ అతడు వినిపించుకోలేదు. దీంతో పాకెట్ స్థాయి నిర్మాణాలైన ఎ.వి.ఎమ్.ఎస్, ఎ.వి.ఆర్.సి.ఎస్‌లు, మిలీషియా మద్దతుతో పంచాయితీ నిర్వహించాయి. తప్పు చేసిన తండ్రికి దేహశుద్ధి చేసి, కుటుంబ సభ్యుల అభిప్రాయంతో వేరే గ్రామానికి చెందిన యువకుడికి పెళ్ళి చేయాలని నిర్ణయించాయి. ఈ పంచాయితీకి 270 మంది ప్రజలు హాజరయ్యారు.

☆ విశాఖ జిల్లా, కుమడ, పంచాయితీ, కిముడుపుట్ గ్రామంలో ఒక వ్యక్తి భార్యను 2 సంవత్సరాల నుంచి వేధిస్తూ తీవ్రంగా కొట్టేవాడు. ప్రజలు హెచ్చరించినా వినకపోవడంతో, అతడిని ఎ.వి.ఎమ్.ఎస్ నాయకత్వంలో సుమారు 70 మంది మహిళలు, ఆ గ్రామ మిలీషియా కలిసి దేహశుద్ధి చేసారు. ♣

### విశాఖ-ఈస్ట్ డివిజన్ ప్రచార కార్యక్రమాలు

### 1. ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ (ఫిబ్రవరి-2020)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2020 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల కమీషన్ జనవరి 2వ వారంలో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రకటన వచ్చిన వెంటనే డివిజన్‌లో పెదబయలు-కోరుకొండ ఎ.సి పరిధిలో వున్న ఎ.వి.ఆర్.సి.ఎస్ ఏరియా కమిటీ సమావేశం నిర్వహిచడమైంది. వారికి పార్లమెంటరీ ఎన్నికలపై మన పార్టీ వైఖరిని అర్థం చేయిస్తూ ఒక పూట క్లాస్ నిర్వహించి, ఎన్నికల బహిష్కరణకు కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. దానికి అనుగుణంగా క్యాంపెయిన్ టీమ్స్ ఏర్పడి అన్ని పాకెట్స్‌లోనూ ప్రచారం చేశాయి. అయితే ఈ ఎన్నిలల్లో ప్రభుత్వం 59.85 శాతం రిజర్వేషన్‌లు ఖరారు చేసింది. అంటే ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న 11 మండలాల్లో మొత్తం ఆదివాసీలు కాకుండా కొన్ని స్థానాలు బి.సి మహిళలకు, 7 మండలాలో జనరల్స్‌కు కేటాయించడంతో ఇది ఏజెన్సీ ప్రాంతంలో వివాదాస్పదంగా మారింది. దీనికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. తిరిగి మార్చిలో మళ్ళీ ఎన్నికల కమీషన్ ఎన్నికలను ప్రకటించింది. ఈ సందర్భంగా ఎ.వి.ఆర్.సి.ఎస్ ఏరియా కమిటీ మరోసారి ప్రచార క్యాంపెయిన్ చేపట్టింది. జి.కె ఏరియాలో 2 పాకెట్స్‌లో సంఘ నాయకత్వానికి ఎన్నికలపై మన వైఖరిని క్లాసులు నిర్వహించారు. 'బూటకపు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించండి, ప్రజాయుద్ధంలో భాగమవుతూ విప్లవ ప్రజా కమిటీలను నిర్మించండి' అని పిలుపునిస్తూ, డి.వి.సి పేరుతో కరపత్రం వేయడం, పత్రికలకూ, ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రకటన ఇవ్వడం జరిగింది. అయితే మార్చి నాటికి ప్రపంచవ్యాప్తంగా అతలాకుతలం చేస్తున్న కొరోనా దేశంలోనూ ప్రబలటంతో ప్రభుత్వం మార్చి 14 నుంచి దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. దాంతో మన ప్రజా నిర్మాణాలు ఎన్నికల బహిష్కరణకు నిర్వహించ తలపెట్టిన తదుపరి కార్యక్రమాలను విరమించుకుని కొరోనా సంబంధంలో కార్యక్రమాల్లోకి వెళ్ళాయి.

### 2. జి.ఒ నంబర్ 3 రద్దుపై (ఏప్రిల్-22)

ఏజెన్సీ ప్రాంతాల్లోని స్కూళ్ళలో ఉపాధ్యాయ పోస్టులన్నీ స్థానిక ఆదివాసులకే ఇవ్వాలన్న జి.ఒ 3ను ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, మన్యంలో గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగసంఘాలు, ఐక్యకార్యాచరణ సమితిగా ఏర్పడి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ విషయంపై మన పార్టీ వైఖరిని తెలియజేస్తూ, జి.ఒ 3 రద్దు చేయటమంటే ఆదివాసీ ప్రజలు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను నిరంకుశ ప్రభుత్వాలు కాలరాచివేయటమేననీ, దీన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రజలు చేపట్టిన నిరసన, ఆందోళన కార్యక్రమాలకు సంపూర్ణ మద్ధతును తెలియజేసాం. ఏప్రిల్ నెలలో ఒకసారి పత్రికా ప్రకటనను విడుదల చేయడంతోపాటు, మే నెలలో కరపత్రాన్ని, పోస్టర్లను వేసి, డివిజన్‌లో పెదబయలు-కె.కె, జి.కె ఏరియాలో ప్రచారం చేసాం. అలాగే జి.ఒ 3 సాధన కోసం ఏర్పడిన ఐక్యకార్యాచరణ సమితి జూన్ 9వ తేదీన ఇచ్చిన మన్యం బంద్‌కు మద్దతునిస్తూ, ఎ.ఒ.బి ఎస్.జడ్.సి పత్రికా ప్రకటన ఇచ్చింది. ఇందులో 100% ఉపాధ్యాయ పోస్టులన్నీ ఆదివాసులకే ఇవ్వాలనీ, సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలనీ, ఇప్పటికే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలనీ డిమాండ్ చేయడంతోపాటు, ఆదివాసీ ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులనూ, చట్టాలను కాపాడుకోవాలంటే ప్రజలు మిలిటెంట్‌గా ఉద్యమించాలనీ, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం ద్వారా మాత్రమే ప్రజల హక్కులు కాపాడబడతాయనీ, అందుకు ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది. లాక్‌డౌన్ కారణంగా గ్రామాలకు వచ్చి ఉన్న విద్యార్థులు, కొంతమంది ఉద్యోగులతో ఈ విషయాన్ని చర్చించినప్పుడు మన పార్టీ వైఖరిపట్ల సానుకూలంగా స్పందించడం, మిలిటెంట్‌గా పోరాడడం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం అవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం పాజిటివ్ పరిణామంగా చెప్పవచ్చు.

### 3. ఎల్.జి పాలిమార్స్ విషాద ఘటనపై (మే-2020)

కొరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తుంటే, దేశంలోనూ, రాష్ట్రంలోనూ లాక్‌డౌన్ కారణంగా సాధారణ ప్రజల జీవితాలు, మరీ ముఖ్యంగా రోజువారి కూలిపనులపై ఉద్యోగాల మీద ఆధారపడి జీవిస్తున్న వలస కార్మికులు, పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు అతలాకుతలమైపోతున్న తరుణంలో మే7 అర్థరాత్రి విశాఖలోని ఎల్.జి పాలిమర్స్ గ్యాస్ లీకేజి విషాధ ఘటన విశాఖను కుదిపివేసింది. నగరమంతా నిద్రావస్తలో ఉండగా, కంపెనీ నుంచి వెలువడిన విషవాయువు ప్రభావంతో క్షణాల్లోనే నిద్రలోనే ఉన్న 12 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వందలాది మంది అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. అత్యంత విషాదకరమైన ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగినది కాదు. ప్రజల సంక్షేమంపట్ల, ఆరోగ్య భద్రతపట్ల, ప్రజల ప్రాణాలవట్ల అత్యంత బాధ్యతారాహిత్యంగా వుంటూ, కోట్లను సంపాదించడమే లక్ష్యంగా జనావాసాల మధ్య ఇటువంటి ప్రమాదకరమైన కంపెనీలకు అనుమతులు ఇచ్చిన దోపిడీ పాలకవర్గాల, కంపెనీల యజమానుల తీవ్రమైన నిర్లక్ష్యవైఖరే ఈ ఘటనకు కారణం. ఈ ఘటనకు కారణమైన ఎల్.జి పాలిమర్స్ కంపెనీతోపాటు, రాష్ట్రంలో ఉన్న ప్రమాదకరమైన కంపెనీలను వెంటనే మూసివేయాలనీ, కంపెనీ యజమానిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రఘాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. తీవ్రంగా

అస్వస్థతకు గురైన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. డి.వి.సి పేరుతో పత్రికలకు, మీడియాకు ప్రకటనను విడుదల చేయడంతోపాటు, పెదబయలు-కోరుకొండ ఎ.సి పరిధిలో చింతపల్లి, పెదబయలు, జిమాడుగుల మండల సెంటర్స్, పంచాయితీల్లోనూ, గ్రామాల్లోను పోస్టర్స్ వేసి, ప్రచారం చేసాం.

### 4. విద్యుత్ డిపార్ట్‌మెంట్‌లో అవినీతిపై

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో విశాఖ జిల్లా, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు ఎ.ఇగా పని చేస్తున్న జి. సోమరాజు, పాడేరు సబ్ డివిజన్ ఎ.డి.ఇ డి.భాస్కరరావులు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పనులన్నీ తమ కింద పని చేసే కాంటాక్టు బేస్డ్ వర్కర్స్‌తో పని చేయించుకొని వారికి జీతాలు ఇవ్వకుండా ఈ కాంటాక్టు పనులన్నింటినీ బిల్లులు పాస్ చేసుకొని తింటూ వర్కర్స్ శ్రమను దోపిడీ చేస్తున్నారు. అలాగే డిపార్ట్‌మెంట్‌లో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయడం కోసం ముంచంగిపుట్ ఆఫీస్‌లో 12 మందికి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుండి లక్ష ముప్ఫైవేల చొప్పున పాడేరు సబ్ డివిజన్‌లో సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం కోసం ఒక్కొక్కరి నుండి 5లక్షల చొప్పున 6గురి నుండి లంచాలను తీసుకున్నారు. ఈ విషయం పై కంపెనీ సి.ఎమ్.డికి రిపోర్ట్ అందటంతో కంపెనీ యాజమాన్యం ఈ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా జాయిన్ చేసుకోవాల్సి ఉంటుందని జి.ఒను పాస్ చేసింది. ఈ ఉద్యోగ నియమాకాలు ఆగిపోవడంతో అప్పులు చేసి, లంచాలు ఇచ్చిన వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పై విషయాలన్నీ మన దృష్టికి వచ్చిన తర్వాత విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ పేరుతో పత్రికా ప్రకటనను ఇచ్చాం. అందులో డిపార్ట్‌మెంట్‌లో అవినీతిపై కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, లంచాలన్నీ తిరిగి వెనక్కు ఇచ్చివేయాలనీ, అర్హత కలిగిన వారికి వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నేటి దోపిడీ సమాజంలో అన్ని రంగాలలోనూ కింది నుంచి పై వరకు జరుగుతున్న అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిందిగా, దోపిడీ, అవినీతిలేని సమాజం కోసం ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ స్టేట్‌మెంట్ పత్రికలలోనూ, ఎలక్ట్రానిక్ మీడియాలోను విస్తృతంగా ప్రచారం జరగటంతో కంపెనీ యాజమాన్యం విచారణ జరపడం, తీసుకున్న లంచాలను తిరిగి ఇచ్చివేయడం జరిగింది. ఇది ఆ డిపార్ట్‌మెంట్‌లోని కార్మికులతో పాటు, ఇతర రంగాలపైన ప్రజలపైన మంచి ప్రభావాన్ని వేసింది.

### 5. మే 7 అల్లూరి వర్ధంతి సందర్భంగా

'మన్యం వీరుడు, పోరాట యోధుడు అల్లూరి వర్ధంతిని సమరోత్సాహంతో జరుపుకోవాల్సిందిగా, మన్యం పితూరిసేనలో చేరండి! అల్లూరి పోరాట వారసత్వాన్ని కొనసాగించండి! అడవిపై హక్కు ఆదివాసీలదీ, పీడిత ప్రజలదీ!' అనే నినాదంతో ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావల్సిందిగా పిలుపునిస్తూ విశాఖ-ఈస్ట్ డి.వి.సి పేరుతో కరపత్రాన్ని, పోస్టర్లను వేసి, డివిజన్‌లోని పి.బి.ఎల్-కె.కె, జి.కె ఏరియాలలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా పి.బి.ఎల్-కె.కె ఎ.సి పరిధిలో కోంద్రు పాకెట్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ముగింపులో సంఘ నాయకులు, మిలీషియా కమాండర్లు మే 7 ప్రాధాన్యతను వివరిస్తూ, అల్లూరి వారసత్వాన్ని కొనసాగించాలనీ, మన్యం పితూరిసేనలో చేరి మన్యాన్ని కాపాడుకోవాలనీ, ప్రతిఘటన ద్వారానే శత్రువును ఎదుర్కోవాలనీ పిలుపునిస్తూ ఉపన్యాసాలను ఇచ్చారు.

### 6. పార్టీపై పోలీసుల దుష్ప్రచారదాడిని ఖండిస్తూ (మే-2020)

దేశంలో కొరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రజానీకమంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులలో ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఎ.ఒ.బి ఎస్.జడ్.సి ఈ సమయంలో ఎటువంటి దాడులకు, ప్రతిఘటన చర్యలకు పాల్పడబోమనీ, ఏప్రిల్‌లో పత్రికా ముఖంగా ప్రకటన చేసింది. దీనిపై తమ వైఖరిని తెలియజేయాలనీ ప్రభుత్వాన్ని, పోలీసులను కోరింది. కానీ ప్రభుత్వం మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటనను ఇవ్వలేదు సరికదా పోలీసులు గతంలో సరెండరైన వారిని స్టేషన్స్‌కు రమ్మని నోటీసుల పంపడం, అరెస్టుల చేయడం, ఇంటలిజెన్సీ పోలీసులు సివిల్ దుస్తుల్లో, మారువేషాల్లో పార్టీ, దళాల సమాచారాన్ని సేకరించడం, కూంబింగ్‌లు చేయడంతోపాటు, పార్టీపై తీవ్రమైన దుష్ప్రచార దాడిని కొనసాగించారు. మే 24న చింతపల్లి ఎ.ఎస్.పి సతీస్‌కుమార్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పార్టీపై అత్యంత దుర్మార్గంగా అబద్ధాలను ప్రచారం చేశాడు. మావోయిస్టులు, ఒడిశా, చత్తీస్‌ఘడ్ నుండి వచ్చి, విశాఖ మన్యంలో కొరోనా వ్యాప్తి చేస్తున్నారనీ, యాక్షన్ టీంలు రెక్కీలు చేస్తున్నాయనీ, బైక్‌లపై తిరుగుతున్నారనీ, పెళ్ళిళ్ళకు హాజరవుతున్నారనీ, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రకటనలు చేశారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ, పోలీసులు చేస్తున్న ఈ దుష్ప్రచార దాడి వెనక ఉన్న కుట్రను వివరిస్తూ, మావోయిస్టులు తిరుగుతున్నారనే పేరుతో మన్యంలో పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్స్ చేయడానికి, పార్టీపై, ప్రజలపై మరింత నిర్బంధాన్ని తీవ్రతరం చేయడం కోసమే ఇదంతా చేస్తున్నారు కనుక ప్రజలంతా దీన్ని ఖండించాలనీ, ప్రతిఘటించాలనీ పిలుపునిస్తూ, పోలీసులు కూంబింగ్‌లు, ప్రజలపై దాడులను మానుకోకపోతే ప్రజల ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తూ విశాఖ-ఈస్ట్ డి.వి.సి పేరుతో మీడియాకు ప్రకటన ఇవ్వడం జరిగింది. అలాగే పి.బి.ఎల్-కె.కె ఎ.సి సభ్యుడు కామ్రేడ్ నగేష్‌పైన ప్రజలను దోచుకున్న దోపిడీ సొమ్ముతో ఇల్లు కట్టుకుంటున్నాడనే దుష్ప్రచారం చేస్తూ, కోరుకొండ ఏరియా వ్యాప్తంగా పోలీసులు వేసిన పోస్టర్లను ఖండిస్తూ కామ్రేడ్ నగేష్ సహచరి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రకటన ఇచ్చింది. అలాగే దీనిపై పెదబయలు-కోరుకొండ ఎ.సి పేరుతో కోరుకొండ ప్రాంతంలో పోస్టర్స్ వేయడం జరిగింది. ♣

## 44వ పేజి తరువాయి

ఆదివాసీ ప్రాంతాల్లో సంతలపై ఆధారపడి ప్రజలు తమ నిత్యవసరాలను పొందుతారనే విషయం మనకు తెలిసినదే. అయితే పాలకవర్గాలు ముందుచూపు లేకుండా విధించిన లాక్‌డౌన్ మూలంగా, ఆదివాసుల బతుకులు పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డ విధంగా తయారయ్యాయి. ప్రయాణాలు, సంతలు పూర్తిగా ఆగిపోవడంతో, ప్రజలు ఉప్పు లాంటి కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని పరిస్థితులకు నెట్టబడ్డారు. ఇలాంటి కష్ట సమయంలో ప్రజల కనీస అవసరాలను తీర్చే విధంగా పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేసింది. దీంట్లో భాగంగా వివిధ ఛానల్స్ ద్వారా కనీసం 10 టన్నుల ఉప్పును సేకరించి, 200 గ్రామాలకుపైగా ప్రతి కుటుంబానికి 2 కేజీల ఉప్పును పంపిణీ చేసింది. సరైన సమయంలో పార్టీ తీసుకున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పాజిటివ్ ప్రభావాన్ని వేయగలిగాం.

మరోవైపు ఈ సమయంలోనే ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టిపెట్టి, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేసాం. ఈ ప్రాంతంలో మలేరియా, టైఫాయిడ్, టి.బి, డయేరియా, కంటి సమస్యలతోపాటు, రకరకాల చర్మవ్యాధులతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మంది సరైన సమయంలో మందులు అందుబాటులో లేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. జొడాంబ గ్రామంలో ఒక హాస్పిటల్ ఉన్నప్పటికీ, ప్రజలకు అందుతున్న వైద్యం నామమాత్రమే. అయితే ఇప్పుడు ఆ గ్రామంలో బి.ఎస్.ఎఫ్ క్యాంపు వచ్చిన తర్వాత ఆ నామ మాత్రమైన వైద్యం కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రతి పంచాయితీ పరిధిలో సబ్‌సెంటర్స్ ఉన్నప్పటికీ, అవి ఏనాడు ప్రజలకు అందుబాటులో లేవు. ఇటువంటి పరిస్థితుల్లో కోవిడ్–19 మహమ్మారి విజృంభించడంతో ప్రజల జీవితాలు మరింత ప్రమాదకర స్థితిలో పడ్డాయి.

పై పరిస్థితుల నేపథ్యంలో, కటాఫ్ ఏరియాలో  మన పార్టీ నెల రోజులపాటు 52 గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించింది. ఈ మెడికల్ క్యాంపుకు అమరుడు కామ్రేడ్ అడ్మాల్ పేరును పెట్టాము. ఈ క్యాంపుల్లో సుమారు 4వేల మందికి ట్రీట్‌మెంట్ ఇచ్చాం. ఈ సందర్భంగా మందులకూ, ఇతర జీవిత అవసరాల(ఉప్పు)కు ప్రజా సంక్షేమ నిధి నుంచి రూ॥ 5,50,000 ఖర్చు పెట్టాము. ఈ కార్యక్రమాలతోపాటు, ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంచేందుకు ప్రతి నెలకు ఒకసారి గ్రామ పరిసరాలను శుభ్రపరచుకోవాలనీ, వేడినీరు తాగాలనీ, కొరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేటి పరిస్థితిలో పెళ్ళిళ్ళతోపాటు, ఇతర గుమ్మిగూడే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రచారం చేస్తూ చైతన్య పరిచాము. ఈ మొత్తం క్యాంపెయిన్‌లో గ్రామస్థాయి పార్టీ, ప్రజా నిర్మాణాలు, మిలీషియా ఎంతో చురుగ్గా పాల్గొన్నాయి.

మనం ఒకవైపున ప్రజల కష్టాలనూ, ఇబ్బందులను పట్టించుకుంటూ కార్యక్రమాలను చేపడుతుంటే, ఒడిశాలో నవీన్ ప్రభుత్వం మాత్రం మావోయిస్టుల వల్లనే గ్రామాల్లో కొరోనా వ్యాప్తి చెందుతున్నదని దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూ, తీవ్రమైన నిర్బంధాన్ని కూడా అమలు చేసింది. ఇటువంటి పరిస్థితుల్లో సైతం పార్టీ శతృదాడులను ఎదుర్కొంటూ, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం వల్ల విశాల ప్రజానీకంలో మన కార్యక్రమం మంచి ప్రభావాన్ని వేసింది. అంతేకాదు, ప్రజలు ప్రభుత్వ రాజకీయ స్వభావాన్ని మరింత లోతుగా తెలుసుకున్నారు.

## విశాఖ–ఈస్ట్ డివిజన్

విశాఖ–ఈస్ట్ డి.వి.సి పేరుతో పత్రికలకు ప్రకటన ఇవ్వడంతోపాటు, ఒక కరపత్రాన్ని, పోస్టర్స్‌ను విడుదల చేసి, పెదబయలు–కోరుకొండ, గాలికొండ ఏరియాలలో విస్తృతంగా ప్రచారం చేసారు. కొరోనాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పోస్టర్స్ వేయడం జరిగింది. పెదబయలు–కోరుకొండ ఎ.సి పరిధిలో ఎ.వి.ఆర్.సి.ఎస్, ఎ.వి.ఎమ్.ఎస్, ఆర్.పి.సిల నుంచి నాయకత్వం, మరికొంత మంది సభ్యులు కలిసి మొత్తం 10 క్యాంపెయిన్ టీమ్స్‌గా ఏర్పడి ఒక్కోటీం 2, 3 పాకెట్స్‌ను వర్క్ డివిజన్ ఎంచుకొని, ప్రతీ గ్రామానికి వెళ్ళి కొరోనాపై వేసిన కరపత్రాన్ని చదివి అర్థం చేయించడం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి చెప్పడంతో పాటు, అనారోగ్యంతో వున్నవారికి వైద్యాన్ని కూడా అందించాయి. ఈ సందర్భంగా లక్ష రూపాయల విలువైన మందులను కూడా తెప్పించి, ప్రజలకు అందజేయడం జరిగింది. ఈ క్యాంపెయిన్ 10 రోజులపాటు జరిగింది.

రెండు డివిజన్స్‌లో మనం చేపట్టిన ఈ క్యాంపెయిన్ ద్వారా దోపిడీ ప్రభుత్వాలను రాజకీయంగా ఎండగట్టగలిగాము. మనం ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళగలిగాము, వారి ప్రేమను చూరగొన్నాము. ఈ సందర్భంగా కొన్ని కొత్త గ్రామాల నుంచి ప్రజలు పరిచయాల్లోకి వచ్చారు. ప్రజలు విపత్తులకు గురైనప్పుడు వారి సంక్షేమాన్ని కోరడం, దానిని ప్రధాన కార్యక్రమంగా చేపట్టడం ఎంతో సరైందని ఈ క్యాంపెయిన్ రుజువు చేసింది.



# పెట్టుబడిదారీ విధాన విధ్వంసకర సృష్టే కోవిడ్-19
# కోవిడ్-19 నేపథ్యంలో రాజకీయ, సంక్షేమ కార్యక్రమాలు

కోవిడ్-19 వైరస్, 2019 డిసెంబర్‌లో చైనా దేశంలోని ఊహాన్ ప్రాంతంలో ఉనికిలోకి వచ్చి, 2020 ప్రారంభానికి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి ప్రకంపనలు సృష్టించింది. ఇదే సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లూ.హెచ్.ఒ) దీన్ని ఒక 'మహమ్మారి' అనీ, మానవజాతికి గొప్ప విపత్తు అని ప్రకటించింది. అయితే ఇటువంటి విపత్తులు ప్రకృతిలో సహజమే అయినా, ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న కోవిడ్-19 విపత్తు మాత్రం 'పెట్టుబడిదారి విధానపు సృష్టే' అని డబ్లూ.హెచ్.ఒ ప్రకటించలేదు. వాస్తవంగా అత్యంత క్రూరమైన, స్వార్థపూరితమైన, లాభాపేక్ష మాత్రమే కలిగిన పెట్టుబడిదారి విధానం ప్రకృతినీ, అందులో భాగంగా వున్న పర్యావరణాన్నీ, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేయడం ద్వారానే ఈ మహమ్మారి సృష్టించబడింది. ఈ విషయాన్ని అనేక మంది శాస్త్రవేత్తలు ముఖ్యంగా వైరాలజిస్టులు ఇప్పటికే ప్రకటించి వున్నారు. అంతే కాకుండా ఈ శాస్త్రవేత్తలు పెట్టుబడిదారీ విధానపు విధ్వంసపు, దురాశ విధానాల ఫలితంగా ఓజోన్ పొర కరిగిపోతూ, సకల మానవాళితోపాటు, భూ మండలం సైతం ప్రమాదంలో పడబోతున్నదని హెచ్చరించి కూడా ఉన్నారు.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితిలో కోవిడ్-19 వ్యాపించడం దానిని మరింత విధ్వంసానికి గురి చేస్తున్నది. పతనమవుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగంగా, మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా 2019 చివరకే డీలా పడిపోయింది. ఈ పరిస్థితిలో కోవిడ్-19 దేశంలోకి వ్యాపించడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అయింది. అయితే ప్రపంచంలోనూ, దేశంలోను ఏర్పడ్డ ఈ అల్లకల్లోల పరిస్థితిని ఆయా దేశాల దోపిడీ ప్రభుత్వాలు ఏ మాత్రం చక్కదిద్దలేకపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మన దేశ ప్రధాని మోడి ఈ విపత్తును ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమై, జిమ్మిక్కులకు పరిమితమవుతున్నారు. మరోవైపు ప్రపంచంలోనూ, దేశంలోను మౌలిక వైరుధ్యాలతోపాటు, అనేక వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. అంతేకాకుండా, ప్రజలంతా కొవిడ్-19 మహమ్మారిని ఎదుర్కోలేక తీవ్రమైన ఆందోళనకు గురి అవుతుంటే, మోడీ గ్యాంగ్ ఇదే అవకాశమని భావించి పార్లమెంటులో మూక బలంతో ప్రజా వ్యతిరేక చట్టాలు చేస్తున్నారు. ప్రధానంగా పీడిత ప్రజలు కోవిడ్-19 బారిన పడటమే కాకుండా ఉపాధి కోల్పోయి, కనీస అవసరాలు లభించక తీవ్రమైన కష్టాలలో కూరుకుపోయారు.

ఇటువంటి పరిస్థితులలో, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం ఒక కీలకమైన కర్తవ్యంగా పార్టీ భావించింది. ఇందుకనుగుణంగా ఉద్యమ ప్రాంతంలో సైనికచర్యలను ఆపేస్తామనీ, ప్రభుత్వం కూడా తన సాయుధ బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పి.ఎల్.జి.ఎ తన ప్రతి దాడులను కొనసాగిస్తుందని ప్రకటించింది. అయితే మన ప్రకటనకు ఎ.పి ఒడిశా ప్రభుత్వాల నుంచి ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. ఇటువంటి పరిస్థితులలో పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలు దోపిడీ ప్రభుత్వాల దాడిని ఎదుర్కొంటూ, వాటి ప్రజా వ్యతిరేక నైజాన్ని రాజకీయంగా బహిర్గత పరుస్తూ, 'ప్రజల సంక్షేమానికి' కార్యక్రమాన్ని రూపొందించుకొని పథకం ప్రకారం కృషి చేసాయి.

## మల్కనగిరి-కొరాపుట్ డివిజన్

ప్రజల జీవితాలతో ముడివేసుకుపోయిన మన పార్టీ, ఇలాంటి విపత్కర సమయాల్లో మరింత బాధ్యతాయుతంగా తన కార్యాచరణను కొనసాగించింది. ముఖ్యంగా ఎమ్.కె.బి డివిజన్, గుమ్మ ఏరియా కమిటీ నాయకత్వంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, కార్యక్రమాలను చేపట్టింది. దీంట్లో భాగంగా కొరోనా మహమ్మారికి కారకులు ఎవరనే అనే విషయాన్ని బహిర్గత పరుస్తూ విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టింది. డి.వి.సి, ఎస్.జడ్.సిల పేరుతో తెలుగు, ఒడియా బాషల్లో కరపత్రాలు రాసి, పంపిణీ చేయడం, ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఆడియో సందేశాలు విడుదల చేయడం, గ్రామస్థాయిలో జనరల్ మీటింగ్స్‌ను నిర్వహించడం వగైరా కార్యక్రమాలను చేపట్టింది.

తరువాయి భాగం 43వ పేజీలో